8

# నెగడు

తెలంగాణ ఉద్యమ సంకలనం

తెలంగాణ రిసోర్స్ సెంటర్ ప్రచురణ

## తెలంగాణ సాధనకై

# సకల జనుల సమ్మె

## 2011

## రెండవ భాగం




- చైతన్యం వెలిగించిన సమ్మె
- అణచివేస్తే తిప్పికొడదాం!
- వెలివేయండిక!
- విభజన సీమాంధ్రకే మేలు
- తెలంగాణ దుక్కుల్లో హక్కుల మొక్కలు నాటాలి
- విరమణ కాదు - విద్రోహమే
- 'సకలం' సశేషం, పాఠాలు అనేకం
- ఐక్యతే మన ఆయుధం

# తెలంగాణ సాధనకై సకల జనుల సమ్మె 2011 - రెండవ భాగం
## Telangana Sadhanakai Sakala Janula Samme 2011 - Rendava Bhagam


| | | |
|---|---|---|
| ప్రచురణ కాలం | : | డిసెంబర్, 2011 |
| Edition | : | December, 2011 |
| ప్రచురణ | : | తెలంగాణ రిసోర్స్ సెంటర్, హైదరాబాద్ |
| Published by | : | **Telangana Resource Centre, Hyderabad.** |
| ప్రచురణ కర్త | : | **ఎం. వేదకుమార్,** చైర్మన్, తెలంగాణ రిసోర్స్ సెంటర్ |
| Publisher | : | **M. Vedakumar,** Chairman, Telangana Resource Centre |
| సంపాదకులు | : | **బొనకుర్తి సోమేశ్వర్,** కో-ఆర్డినేటర్, తెలంగాణ రిసోర్స్ సెంటర్ |
| Editor | : | **Bonakurthi Someshwar,** Co-ordinator, Telangana Resource Centre |
| ప్రతులకు | : | **తెలంగాణ రిసోర్స్ సెంటర్**<br>"చంద్రం" 490, స్ట్రీట్ నెం. 11, హిమయత్‌నగర్, హైదరాబాద్.<br>trchyd@gmail.com; Mobile : 9959922022<br>www.telanganaresourcecentre.org<br><br>సహచర బుక్‌మార్క్ • దిశ పుస్తక కేంద్రం • నవోదయ బుక్ హౌస్ |
| వెల | : | **రూ. 20/-** |

Printed at :
DECCAN PRESS Azamabad, Hyderabad. Ph.+91-040-27678411
e-mail : deccan.press@yahoo.com

## తెలంగాణ సాధనకై

# సకల జనుల సమ్మె

## 2011

## రెండవ భాగం



*సకల జనుల సమ్మె సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు మరియు ఉద్యోగులు. తేది : 20-09-2011*


తెలంగాణ రిసోర్స్ సెంటర్

హిమాయత్‌నగర్

హైదరాబాద్

# విషయ సూచిక

**ప్రచురణకర్తల మాట :**

భిన్న కోణాల – సంఘటిత ఆలోచనల సమాహారం – వేదకుమార్. ఎమ్ 3

**ముందుమాట :**

వేయి ఆలోచనల సంఘర్షణ! – ఘంటా చక్రపాణి 5

చైతన్యం వెలిగించిన సమ్మె – ప్రొఫెసర్ హరగోపాల్ 7

ఉద్యమ పథమే సాఫల్య మార్గం – జూకంటి జగన్నాథం 10

టార్గెట్ తెలంగాణ నాయకులే 13

'సకలం' సశేషం, పాఠాలు అనేకం – కె.ఎస్. 16

విరమణ విద్రోహం కాదు – నారదాసు లక్ష్మణ్‌రావు 18

సకల జనులకు నీరాజనం – ఎన్. వేణుగోపాల్ 21

తెలంగాణ సకలజనుల సమ్మె అంటే సర్వజనుల ఉద్యమమే – చిక్కుడు ప్రభాకర్ 23

తెలంగాణ దుక్కుల్లో హక్కుల మొక్కలు నాటాలి – డా॥ చెరుకు సుధాకర్ 27

'సకల'ం మిథ్య అంటే సరిపోతుందా? – కె. శ్రీనివాస్ 30

వ్యూహం లేని ఉద్యమం – సుదర్శన్ బాలబోయిన 33

విభజన సీమాంధ్రకే మేలు – కారుమంచి చైతన్య, అయ్యంగారి రాఘవశర్మ 39

అణచివేస్తే తిప్పికొడదాం! – శ్రీరాముల శ్రీనివాస్ 42

వెలివేయండిక! – జూకంటి జగన్నాథం 44

విరమణ కాదు – విద్రోహమే – దరువు ఎల్లన్న 47

'గురు'జన గర్జన – కె.ప్రభాకర్ 49

సమ్మె చేసే హోక్కు లేదా? – ఎండి. అన్వర్ 51

ఐక్యతే మన ఆయుధం – చుక్కా రామయ్య 53

మీరు సీమాంధ్ర అగ్రకుల సంపన్న వర్గాల వైపా లేక తెలంగాణ నాలుగు కోట్ల ప్రజలవైపా? – చిక్కుడు ప్రభాకర్ 55

పార్టీల వైఖరులు, నేతల లౌక్యాలు – జూకంటి జగన్నాథం 59

కుట్రలను ఛేదిస్తాం.... ఉద్యమంలో ముందుంటాం..... 62

పోరుబాటలో మైలురాయి 'సమ్మె' – కావటి వెంకట్ యాదవ్ 64

మా ఆకాంక్షపై మాదే తీర్పు... 67

పెనం వేడయ్యేదాకా వంట 'చెరుకు'ను కాపాడాలి!! – ప్రొ. ఘంటా చక్రపాణి 70

## ప్రచురణకర్తల మాట

# గుణపాఠం నేర్చుకుందాం...కలకాలం గుర్తుంచుకుందాం!

**– వేదకుమార్. ఎమ్**

పండుగైనా, పబ్బమైనా ప్రత్యేక రాష్ట్రం తరువాతే! శుభకార్యమైనా వాయిదా వేసుకుందాం. మన సొంత రాష్ట్రం వచ్చిన తరువాత చేసుకుందాం... ఒకటి కాదు, రెండు కాదు, 42 రోజుల పాటు ఓ పెద్ద రాష్ట్రం లోని సగ భాగం ప్రజానీకం అంతా భావించింది అదే. నాలుగున్నర కోట్ల మంది తెలంగాణ ప్రజల గుండె చప్పుడు అది.

ఇంట్లో జరిగే పెళ్ళిని తమ కుటుం బానికి సంబంధించని కారణంగా ఎవరూ వాయిదా వేసుకోరు. ఏదో విధంగా ఆ శుభకార్యాన్ని జరిపించాలనే భావిస్తారు. ఒక ఫంక్షన్ హాల్ కాకపోతే మరొకటి, ఒక ఊరు కాకపోతే మరో ఊరు...ఇలా ఉంటాయి ఆలోచనలు. అందుకు భిన్నంగా... మన వాళ్ళంతా సకల జనుల సమ్మె చేస్తున్నారు, ఈ సమయంలో నేను ఇంట్లో శుభకార్యం చేసు కోవడమేంటని ఆలోచించిన వారెందరో! అలా ఆలోచించిన వాళ్ళు అంతా యూనివర్సిటీ ప్రొఫెసర్లో, ప్రభుత్వ ఉద్యోగులో కాదు. వారంతా పల్లెల్లో ఉన్నవారే. ఆ విధంగా ఆలోచించాలనే విషయాన్ని వారికెవ్వరూ ప్రత్యేకించి నేర్పించలేదు. అది పుట్టుకతో వచ్చిన గుణం. తెలంగాణలో తన పాలతో తల్లి వంటబట్టించిన గుణం.

పక్కవాడు బాధల్లో ఉంటే తాను సంబరం చేసుకునే సంస్కృతి కాదు తెలంగాణది. తోటి వాడిని దోచుకోవడం అని గాకుండా, తోటి వాడి ఆస్తిలో భాగం అని గాకుండా, బాధల్లో భాగం పంచుకునే సంస్కృతి తెలంగాణాది. అందుకే ఒక జాతి యావత్తూ సకల జనుల సమ్మె సందర్భంగా సమ్మెకు సై అంది. కలో, గంజో కలసి పంచుకుందామని భావించింది. సమ్మె కారణంగా వచ్చిన పెద్ద పెద్ద సమ స్యలను సహనంతో సహించింది. ఉజ్వల భవితపై ఆశతో భరించింది. ఇంతటి గుండె నిబ్బరాన్ని ప్రదర్శించిన జాతి మరొకటి లేదు. ఇలా చరిత్రకెక్కిన సకల జనుల సమ్మె మరొకటి లేదు.

రోజుకు 24 గంటల చొప్పున 42 రోజుల పాటు సాగిన మహత్తర సమ్మె. ఒక్కొక్క వాగూ వచ్చి నదిని మహానదిని చేసినట్లుగా ఒక రోజున ఆర్టీసీ వారు చేరితే, మరో రోజున సింగరేణి కార్మికులు చేయి కలిపారు. కొంత ఆలస్యంగానైనా ఒకదశలో ఎన్నో విభాగాలు సమ్మెలో చేరాయి. ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్ళాయి.

మరి అలాంటి మహత్తర సమ్మె ఎందుకు నీరుగారిపోయింది? ఒక చారిత్రక సమ్మె తన లక్ష్యాలను ఎందుకు సాధించలేకపోయింది? యావత్ ప్రపంచానికి చుక్కానిగా నిలువదగ్గ ఉద్యమం ఎందుకు నీరుగారిపోయింది? అందుకు కారణం ఎవరు? ఆ ద్రోహం చేసింది ఎవరు? ద్రోహులు మనవాళ్ళేనా? పరాయి వర్గాల వారా? మరి ఆ ద్రోహానికి శిక్ష ఏమిటి? ఇకపై ద్రోహానికి గురికాకుండా తీసుకోవాల్సిన చర్యలేంటి? ఇలా ఎన్నో ప్రశ్నలు నేడు సామాన్యుడి బుర్రను తొలిచేస్తున్నాయి. అలాంటి వాటికి సమాధానాలు అందించేలా మీడియాలో ఎన్నో కథనాలు. వాటన్నింటినీ ఒక్కచోటుకు చేర్చి, భావితరాలకు ఈ మహోద్యమంపై ఒక అవగాహనను అందించాలన్నదే మా ప్రయత్నం. అందులో భాగంగా ఇప్పటికే ఈ పుస్తకం తొలిభాగం వెలువడింది. ఇది రెండో భాగం. నిజం చెప్పాలంటే, ఇలాంటి భాగాలు వందలాదిగానూ వేయవచ్చు. అంతటి సమాచారం అందుబాటులోనూ ఉంది. అలా వేయాల్సిన అవసరమూ ఉంది. అయినా కూడా మా పరిధులను, వనరులను దృష్టిలో ఉంచుకొని ఈ పుస్తకం ప్రచురిస్తున్నాం.

సకల జనుల సమ్మె జరిగిన తీరు చూస్తే, దానితో ప్రజలు మమేకం అయినతీరును చూస్తే గుండె తరుక్కుపోతుంది.

పట్టుమని పది అడుగులు కూడా నడవలేని చిన్న పిల్ల, పిలగాల్లు సైతం

కిలోమీటర్ల కొద్దీ దూరం ఆనందంగా నడుచుకుంటూ వెళ్ళారు. అంతే తప్ప, సకల జనుల సమ్మెను ఏనాడూ తిట్టుకోలేదు. ఓ మహత్తర లక్ష్యం కోసం వారంతా సమ్మె చేస్తుండగా, తాను ఈ మాత్రం దూరం నడవలేనా అని మాత్రమే భావించారు. తమ సంఘీభావం ప్రకటించారు.

రావాల్సిన సిటీబస్సు పది నిమిషాలు ఆలస్యమైతేనే సహించలేని హైదరాబాద్ ప్రజానీకం కొన్ని వారాల పాటు సిటీబస్సులకు దూరంగా ఎలా ఉండగలిగారు? తమకు బస్సులు కావాలని కోరుతూ రోడ్లపైకి రాలేదెందుకని?

పొద్దున లేస్తే ఎన్నో ఇంటర్వ్యూలు, మరెన్నో ఎంట్రన్స్‌లు. అవసరమైన సర్టిఫికెట్ల కోసం ఉస్మానియా విశ్వవిద్యాలయం కోసం రాక తప్పదు. సిబ్బంది రావడం ఐదు నిమిషాలు ఆలస్యమైతేనే కిటికీ తలు పుల మీద దరువు వేసే విద్యార్థులు ఎన్నో రోజుల పాటు విశ్వవిద్యాలయ పాలనా కార్యాలయం ముఖం చూడకుండా ఎలా ఉండగలిగారు?

ప్రభుత్వం తలుచుకుంటే ఓ ఉద్యోగిని ముప్పతిప్పలు పెట్టగలదు. మూడు చెరువుల నీళ్ళు తాగించగలదు. పని చేసిన కాలానికీ జీతం రాకుండా చేయగలదు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రాకుండా అడ్డుకోనూ గలదు. అయినాకూడా లక్షలాది ప్రభుత్వ ఉద్యోగులు సకల జనుల సమ్మెలోకి దూసుకువచ్చారు. ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధపడ్డారు.

ఉద్యమం అంటే ఇదీ అని భావితరాలు కలకాలం గుర్తు పెట్టుకునేలా సకల జనుల సమ్మె సాగింది. ఎన్నడూ లేని రీతిలో ప్రైవేటు సంస్థల సిబ్బంది కూడా సకల జనుల సమ్మెలో పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిధిలో, తమ శక్తికి మించిన రీతిలో ఈ సమ్మెలో పాలుపంచుకున్నారు.

చివరకు ఏం జరిగింది? ప్రజలు గెలిచారు. నాయకులు ఓడిపోయారు. సమ్మె ముగిసింది. ఆకాంక్షాలు అలాగే మిగిలాయి. సమ్మెకు నేతృత్వం వహించాల్సినవారు ముఖం చాటేసి ఇళ్ళకు పరిమితమయ్యారు. దాంతో, ఇళ్ళలో ఉండే వారు తెగించి రోడ్డున పడ్డారు.

ఈ సమ్మె మనకెన్నో గుణపాఠాలను నేర్పింది. మనపక్కనే ఉంటూ మన వెన్నులో కత్తి దింపేదెవరో తెలియజేసింది. తెగువతో పోరాడే వారెవరో తేటతెల్లం చేసింది. మన వాళ్ళెవరో, పరాయి దొరల మోచేతి నీళ్ళు తాగేదెవరో స్పష్టం చేసింది. విద్రోహం ఎలా ఉంటుందో, అణచివేత ఎలా ఉంటుందో ఈ తరం వారికి తెలిసివచ్చింది. ఇక ముందు విశ్వసించాల్సింది ఎవరినో కూడా స్పష్టమైంది.

జెండా ఉంటేనే సరిపోదని, అందుకు తగ్గ అజెండా కూడా ఉండాలని, అజెండా సాధించేందుకు జెండాలన్నీ పక్కన బెట్టాలనీ తెలంగాణ మలిపోరులో రెండో తరం విద్యార్థులు సైతం గుర్తించారు. ఆ సమ్మె రేపిన గాయాలింకా మానలేదు. ప్రభుత్వం, పోలీసు వర్గాలు ఆ గాయాలను ఇంకా కెలుకుతూనే ఉన్నారు. జీతభత్యాలివ్వబోమంటూ ప్రభుత్వం, కేసులు పెడుతూ పోలీసులు ఇంకా వేధిస్తూనే ఉన్నారు. ఈ వేధింపులను తిప్పికొట్టాల్సిన అవసరం ఉంది.

సకల జనుల సమ్మె నేపథ్యంతో వచ్చిన ఈ పుస్తకంలో సమ్మె జరిగిన తీరు, సమ్మెకు సంబంధించిన సమీక్ష వ్యాసాలు చోటు చేసుకున్నాయి. సమ్మెకు సంబంధించి వ్యూహాలు, మొదటి దశలో వచ్చిన వ్యాసాలను నెగడు తెలంగాణ ఉద్యమ సంకలనం (7) "సకల జనుల సమ్మె 2011 – మొదటి భాగం"లో ఇప్పటికే ప్రచురించాం. ఇక ఇప్పుడు రెండోభాగం (8) "సకల జనుల సమ్మె 2011 – రెండవ భాగం మీ చేతిలో ఉంది. ఈ సంకలనానికి ముందు మాట హృదయపూర్క వ్రాసిన ఘంటా చక్రపాణి గారికి వందనములు టి.ఆర్.సి. తెలుపుతుంది. సకల జనుల సమ్మె తీరుతెన్నులపై ఒక అవగాహనకు వచ్చేందుకు ఈ పుస్తకం దోహదపడగలదని ఆశిస్తూ..

**తెలంగాణ సకల జనులకు ఉద్యమాభివందనాలతో.....**

**– వేదకుమార్.ఎమ్**

8-12-2011

*ఛైర్మన్, తెలంగాణ రిసోర్స్ సెంటర్*

## ముందు మాట

# వేయి ఆలోచనల సంఘర్షణ!

– ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి

తెలంగాణ ప్రజలు సకల జనుల సమ్మె ద్వారా అపూర్వమైన రీతిలో ఉద్యమాన్ని నడిపించారు. ఏ దేశంలో కూడ చరిత్రలో ఒకానొక ప్రజాస్వామిక ఆకాంక్ష ఇంత సంఘటితంగా వ్యక్తం కాలేదు. దాదాపు నలభై రెండు రోజులపాటు సాగిన ఈ సమ్మె ద్వారా పరిపాలన స్తంభించిపోవడం అంటే ఏమిటో తెలంగాణా ఉద్యోగులు చూపించగలిగారు. సింగరేణి గని కార్మికులు మొదలు గెజిటెడ్ అధికారులదాకా యావత్ ఉద్యోగ వర్గం ఈ సమ్మె ద్వారా తమ సంఘటిత శక్తిని చాటుకుంటుంది. అంతేకాకుండా జనసామాన్యానికీ స్ఫూర్తినిచ్చింది. ఒక్క అవకాశవాద రాజకీయ నాయకులు మినహా యువత తెలంగాణా అంతటా ఒకే ఆత్మగా నిలబడింది. ఇదొక చారిత్రాత్మకమైన సందర్భం. ఈ సందర్భంగా వ్యక్తమైన అభిప్రాయాలను, ఉద్యమం పై వచ్చిన విశ్లేషణలను, విమర్శలను సంకలనపరచడం, వాటిని ప్రజా బాహుళ్యానికి చేరవేయడం ఉద్యమానికి ఉపయోగపడే పని. ఆ పనిని చేస్తున్నందుకు ముందుగా తెలంగాణా రిసోర్స్ సెంటర్‌ను అభినందించాలి. తెలంగాణా ఉద్యమంలో ఈ సంస్థ ఒక అవసరమైన ప్రేరణ శక్తిగా పనిచేస్తోంది. ప్రారంభమైన తొలి ఏడాదిలోనే దాదాపు పది సంకలనాలు, నివేదికలు ప్రచురించి తెలంగాణా రిసోర్స్ సెంటర్ చరిత్ర సృష్టించింది.

శ్రీకృష్ణ కమిటీ నివేదికను, అందులో ఎనిమిదో చాప్టర్ రహస్యాలను మొదలు ఉద్యమంలోని అన్ని సందర్భాలను ఈ సంస్థ రికార్డు చేస్తూ వస్తోంది. ఇప్పుడు సకల జనుల సమ్మె సందర్భంగా వచ్చిన విశ్లేషణలను, వ్యాసాలను తెలంగాణ సాధనకై సకల జనుల సమ్మె 2011 – రెండవ భాగం పేరుతో మీ ముందుకు తెస్తోంది. సకల జనుల సమ్మె వ్యాసాలలో కొన్నింటిని ముఖ్యంగా సకల జనుల సమ్మె మొదటి దశలో వచ్చిన విశ్లేషణలను ఇప్పటికే తెలంగాణా రిసోర్స్ సెంటర్ ఒక సంకలనంగా ప్రచురించింది. ఇప్పుడు ఈ సంపుటిలో ప్రధానంగా సమ్మె చివరి దశలో అలాగే సమ్మె విరమణ అనంతర పరిణామాల మీద వచ్చిన విశ్లేషణలున్నాయి. దాదాపుగా అన్నీ వివిధ వార్తా పత్రికల్లో వచ్చినవే. సాధారణంగా ఉద్యమ సంస్థలు ప్రచురించే పుస్తకాలు, సమాచార పత్రాలు ఏవైనా ఉద్యమాన్ని, ఆ ఉద్యమం నడిపిస్తోన్న సంస్థలని, సంఘాలను, ఉద్యమ నాయకత్వాన్ని, పంథాను ఆకాశానికి ఎత్తుతుంటాయి.

ఇందులో ఇరవైకి పైగా వ్యాసాలున్నప్పటికీ అవన్నీ ఒకే మూసలో, ఒకే ఆలోచనా ధోరణిలో లేవు. వీటిల్లో సమ్మె చారిత్రాత్మకం అన్న సత్యాన్ని చెప్పే వ్యాసాలూ ఉన్నట్టే, సమ్మె సందర్భంగా నాయకత్వాలు చేసిన చారిత్రక తప్పిదాల విశ్లేషనా ఉన్నది. ఇందులో సమ్మె – సకల జనుల ఆకాంక్షగా మారిన సందర్భం గురించిన లోతైన అవగాహనను ప్రొఫెసర్ హరగోపాల్, కె.శ్రీనివాస్ చేసిన విశ్లేషణలు ఉపయోగపడితే, జూకంటి జగన్నాథం, జిలుకర శ్రీనివాస్ తదితరుల వ్యాసాలు ఉద్యమ నాయకత్వ తప్పిదాలు ఎత్తిచూపుతాయి. మరోవైపు ఉద్యమ నాయకత్వం తీసుకున్న నిర్ణయాలను సమర్థిస్తూ ఆయా సమయాల్లో ఉన్న ప్రత్యేక పరిస్థితులను నారదాసు లక్ష్మణ్‌రావు, డాక్టర్ చెరుకు సుధాకర్ వ్యాసాలూ వివరిస్తాయి. వీటికి భిన్నమైన తులనాత్మక విశ్లేషణ ఎన్. వేణుగోపాల్ అందించారు.

అలాగే చుక్కా రామయ్య, చిక్కుడు ప్రభాకర్ తో పాటు ఉస్మానియా విశ్వ విద్యాలయ అధ్యాపకులు రాసిన వ్యాసాల్లో కర్తవ్య బోధ కనిపిస్తుంది. అన్ని వ్యాసాలు భిన్న కోణాల్లో కనిపించినా సకల జనులకు, వారి సంఘటిత స్ఫూర్తికి అద్దంపట్టే ఆలోచనల సమాహారం ఈ పుస్తకం. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమంటే అన్ని విచార దారాలకు సంబంధించిన వ్యాసాలు ఈ పుస్తకంలో ఉన్నాయి.

నూరు పూలు వికసించి వేయి ఆలోచనలు సంఘర్షించినట్టుగా ఉంటాయి ఈ విశ్లేషణలు. ఎవరైనా సరే విమర్శలను సరిఅయిన రీతిలో అర్థం చేసుకుంటే మళ్ళీ పొరపాట్లు చేయకుండా ఉంటారు. తెలంగాణా ఉద్యమానికి ఇది ఎంతో అవసరమైన సమాచార సంకలనం. తెలంగాణా కోరుకునే ప్రతిఒక్కరూ చదవడమే కాదు, పదిమందితో చదివించాల్సిన పుస్తకం ఇది. ఈ ఆలోచనలు అయోమయంలో ఉన్నవారికి కొత్తమార్గం చూపుతాయని ఆశిద్దాం. ■

**– ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి**

సమాజ శాస్త్ర ఆచార్యులు, రాజకీయ విశ్లేషకులు



*సకల జనుల సమ్మె సందర్భంగా విద్యుత్ సౌధలో ఉద్యోగుల ధర్నాలో మాట్లాడుతున్న విద్యుత్ జె.ఎ.సి. నాయకులు రఘు. తేది:24-09-2011.*

# చైతన్యం వెలిగించిన సమ్మె

– ప్రొఫెసర్ హరగోపాల్

ప్రపంచీకరణ వ్యాధి భారతదేశాన్ని కూడా కబళించే క్రమంలో జరిగిన నష్టంలో, ట్రేడ్ యూనియన్‌లు కూలిపోవడం ఒక పెద్ద ఊహించలేని పరిణామం. గత శతాబ్దపు 1970 దశకంలో దేశ వ్యాప్తంగా జరిగిన ఉద్యమాలలో, ముఖ్యంగా రైల్వే సమ్మె మొత్తం దేశాన్ని కుదిపేసింది. ఆ కాలంలో ఉద్యోగులు, రవాణా, ఉపాధ్యాయులు, పోస్టల్ ఉద్యోగులు సమ్మె చేస్తే సమాజం దాదాపు స్తంభించిపోయేది. ఆ క్రమం 1980 దశకం వరకు చాలా మారింది. కార్మిక సంఘాల నాయకత్వ రాజీ ధోరణి, అమ్ముడుపోయే ధోరణి పెరిగి కార్మికవర్గ పాత్ర కుచించుకుపోయింది. 80 దశకంలో దాదాపు సమ్మెలు జరగడం ఆగిపోయింది. 90 దశకంలో ఊపందుకున్న ప్రపంచీకరణ వల్లా, సర్వీస్ రంగాన్ని ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రైవేటీకరించడం వల్లా, పబ్లిక్ రంగ ఉద్యోగులు సమ్మె చేసినా అన్ని రంగాలలో సమాంతరంగా ప్రైవేట్ రంగం పెరగడం వల్లా – మధ్య తరగతికి, ప్రత్యేకించి పాలకవర్గాలకు సమ్మె ఒక సమస్యే కాకుండా పోయింది. అందువల్లే ప్రపంచవ్యాప్తంగా గత మూడు దశాబ్దాలుగా సమ్మెల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. దీనికి తోడు కార్మికరంగ సంస్థలలో పోటీసంస్థలు, రాజకీయ పార్టీల అనుబంధ సంస్థలు బలంగా ఉండడం వలన, రాజకీయాలు ఎలా దిగజారాయో అదే క్రమంలో ట్రేడ్ యూనియన్లు కూడా దిగజారుతూ, ఒక సంఘం సమ్మె పిలుపు ఇస్తే మరో సంఘం దానిని వ్యతిరేకించడంతో సమ్మె విఫలం కావడం దాదాపు సాధారణమై పోయింది. ఈ నేపథ్యంలో సకల జనుల సమ్మె, ముఖ్యంగా ఉపాధ్యాయులు, ఉద్యోగులు, సింగరేణి కార్మికులు తమ మాతృ సంస్థలతో సంబంధం లేకుండా సంఘటితంగా ఉద్యమాలు చేయడం సాధారణ విషయం కాదు. ఇది ఒక కొత్త విశ్వాసాన్ని కలిగించింది.

సకల జనుల సమ్మె తెలంగాణలో ఉధృతంగా జరుగుతున్న కాలంలోనే వాల్‌స్ట్రీట్‌కు వ్యతిరేకంగా 80 దేశాలలో నిరుద్యోగులు, సాధారణ పేద ప్రజలు రాజ్య వ్యవహార పద్ధతిని, అక్రమ సంపదకు అవినీతి రాజకీయాలకు మధ్య ఏర్పడిన అనైతిక సంబంధాన్ని ప్రశ్నిస్తూ ఉద్యమాలు ముందుకు వచ్చాయి. ఈ ఉద్యమాలు ప్రధానంగా లేవదీసిన ప్రశ్న : సామాజిక, ఆర్థిక జీవితంలో రాజకీయాల పాత్ర ఏమిటి? రాజకీయాలు ప్రజల ఓట్లతో, లేదా మద్దతుతో గెలిచి, ప్రజాస్వామ్యం పేరు మీద, సార్వభౌమ అధికారం పేరుమీద పాలిస్తూ, దేశంలో సంపదను లూటీ చేస్తున్న వాళ్ళకు అనుకూలంగా ఎందుకు పనిచేస్తున్నట్టు – అంటూ, ప్రజాస్వామ్యమంటే దోపిడీదారులు, రాజకీయ నాయకులు కూడబలుక్కుని, రాజ్యాన్ని అడ్డం పెట్టుకుని ప్రజల రక్తం తాగడమేనా అనే ఒక మౌలిక ప్రశ్న లేవదీశారు. ఈ ఉద్యమాలకు స్పందిస్తూ ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ 'ప్రపంచ వ్యాప్తంగా సంపద మీద తిష్ఠ వేసి కూర్చున్న వాళ్ళు సామాజిక శ్రేయస్సును గురించి ఆలోచించవలసిన సమయం ఆసన్నమైంది అని వ్యాఖ్యానించాడు. ఈ తిరుగుబాటు అమెరికాలో ప్రారంభమై ప్రపంచ వ్యాప్తంగా పాకింది. అమెరికా అధ్యక్షుడు కూడా 'ఈ తిరుగుబాటుదారుల ఆవేదనను అర్థం చేసుకోవాల' ని సంపన్నులకు సలహా ఇచ్చాడు.

ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న తిరుగుబాటులో ఒక గమనించదగ్గ అంశం, ఏ సాంకేతిక విజ్ఞానాల ద్వారా సంపన్నులు ప్రపంచాన్ని నియంత్రిస్తున్నారో, ఆ సాంకేతిక మార్గాల ద్వారానే ప్రపంచవ్యాప్త తిరుగుబాట్ల మధ్య ఒక

సంబంధం ఏర్పడింది. ఉత్పత్తి శక్తులు పెరుగుతున్న క్రమంలోనే ఏర్పడే వైరుధ్యాలు, సంపదకు ఎలా సవాలుగా మారుతాయో ఇదొక చక్కటి ఉదాహరణ. పెట్టుబడిదారీ వ్యవస్థకు శ్రమకు మధ్య ఏర్పడ్డ రాజీయే కార్మికుల హక్కులు అనే ఒక సూత్రీకరణ కూడా ఉంది. హక్కులు ఒక చారిత్రక సంధి నుంచి బలీయమైనవన్న ఒక అవగాహన కూడా ఉంది. కార్మికులు రెండు శతాబ్దాల పోరాటాల ద్వారా హక్కులు సాధించుకున్నారు. ఈ మొత్తం చారిత్రక అభివృద్ధిని అడ్డుకుంటూ, హక్కులను హరించుకుంటూ నయా ఆర్థిక విధానం ప్రపంచ సంపదను కొల్లగొట్టాలనుకుంటోంది. కొల్లగొడుతున్నది. దీనికి పర్యవసానంగానే సాధించుకున్న హక్కులు పోగొట్టుకుంటూ, పని దొరికితే చాలు అనే దీన స్థితికి ప్రజలను నెట్టబడ్డారు. ఒకవైపు ఐఎల్ఓ (అంతర్జాతీయ లేబర్ సంస్థ) 'పని అంటే 'డీసెంట్ పని' అని, అది గౌరవప్రదంగా ఉండాల' ని నిర్వచించినా, ఆ మాట వినేవాళ్లే కరువయ్యారు. దీనికి తోడు మదనూరు భారతి గారు ప్రస్తావిస్తూ వచ్చిన 'అదనపు మనుషుల' సంఖ్య పెరుగుతూ వస్తున్నది. పనిచేయడానికి చేతులుండి, ఆలోచించే శక్తి ఉన్న మనుషులకు పని ఎందుకు దొరకదు? అనేది చాలా మౌలికమైన ప్రశ్న. ఆహార సేకరణ దశలో ఏ మనిషికా మనిషి తమ ఆహారాన్ని తామే సేకరించే పనిలో ఉన్నారు. అందరికి ప్రకృతి వనరులు అందుబాటులో ఉన్నాయి. ఆ దశ నుంచి అత్యంత ఆధునిక దశకు చేరుకున్నామని భ్రమించే వ్యవస్థలు మనిషి జీవితాన్ని ఉన్నతీకరించే బదులు పనిలేని, పని దొరకని మనుషులను చేశాయి. మనిషికి చేతినిండా పని కల్పించని ఏ ఆర్థిక వ్యవస్థ అయినా అది అమానవీయ దోపిడీ వ్యవస్థే. ఈ వక్ర అభివృద్ధికి వ్యతిరేకంగా భిన్న దేశాలలో 'మాకు పని ఎందుకు లేదు, మేం పేద వాళ్ళుగా ఎందుకున్నాం?' అంటూ 'సంపద మీకు పేదరికం మాకా?' అన్న నినాదాలతో ఉద్యమిస్తున్నారు. తెలంగాణ సకల జనుల సమ్మెలో ఈ మౌలిక ఆకాంక్ష ఎక్కడో దాగుంది అని అనిపిస్తున్నది.

తెలంగాణ ప్రాంతంలో చారిత్రకంగా ప్రపంచ మార్పులకు ప్రతిస్పందించే ఒక గుణముంది. దేశమంతా స్వాతంత్ర్యోద్యమం జరుగుతున్నప్పుడు, అర్థవలస, అర్ధ భూస్వామ్య వ్యవస్థకు చైనాలో జరుగుతున్న పోరాటంతో పోల్చగల సాయుధ పోరాటం తెలంగాణ ప్రాంత అనుభవంలో ఉంది. ఆ పోరాటం ఎంత అర్థాంతరంగా ముగిసినా ఆ దారిలో అనుభవం తెలంగాణకు గొప్ప వారసత్వాన్ని ఇచ్చింది. ఆ పోరాటాన్ని అణచివేసి, అదే నినాదాలను తీసుకొని కాంగ్రెస్ పార్టీ ప్రజల మద్దతు కూడగట్టుకుంది. అప్పటికి, ఇప్పటికీ కాంగ్రెస్ పార్టీ స్వభావంలో అలాగే ఉంది. ఇప్పుడు సోషలిజం పేరు చెప్పి, ఇప్పుడు ప్రత్యేక తెలంగాణ పేరు చెప్పి ఎన్నికలలో గెలవాలని తప్పించి నిజాయితీగా న్యాయమైన పరిష్కారమేమిటా అని ఆలోచించే స్థితిలో లేకపోవడం ఎంతో అప్రజాస్వామికం. ఇది మోసపు చరిత్ర కొనసాగింపు.

అలాగే 1969లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం జరిగినప్పుడు ప్రపంచం ఉద్రిక్త, ఉద్వేగ వాతావరణంలో ఉంది. చైనాలో సాంస్కృతిక విప్లవం, అమెరికాలో వియత్నాం యుద్ధానికి వ్యతిరేకంగా ఉద్యమం, ఫ్రాన్స్‌లో యువత తిరుగుబాటు, దేశంలో నక్సల్‌బరీ పోరాటం పుంజుకుంటున్న సందర్భమది. అప్పటి తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగుల, విద్యార్థుల పాత్ర చాలా కీలకమైనది. ఇప్పుడు జరుగుతున్న ఉద్యమం సకల జనుల ఉద్యమంగా ఎదగగలిగింది. ఈ సమ్మె సఫలమైందా, విఫలమైందా, సరియైన సమయంలోనే జరిగిందా? లేదా? నాయకత్వంలో రాజీపడ్డారా? సమర్థవంతమైన నాయకత్వం లేదా? వంటి ప్రశ్నలు చాలానే అడగవచ్చు. వీటిని చాలాకాలం చర్చించుకోవచ్చు. ఒక ప్రజా ఉద్యమం విజయవంతమైందా? విఫలమైందా? అనడానికి మనం ఉపయోగించే ప్రమాణాలు ఏమిటి? అనేది కూడా ప్రశ్నే. తెలంగాణ రాష్ట్రాన్ని నిర్మాణం చేయడం లేదా బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టడం అనేదే ప్రమాణమైతే సమ్మె తన లక్ష్యాన్ని సాధించలేదు అని అనవచ్చు. ప్రజా ఉద్యమాలను అలా చూడకుండా, ఉద్యమ ప్రక్రియ ఎలా ఉంది, సమీకరణ ఎలా సాగింది, సంఘటిత శక్తి ఎలా వ్యక్తీకరించబడింది, సామాజిక సంబంధాలను ఎలా ప్రభావితం చేసింది, కొత్త విలువలు, ప్రజా చైతన్యంలో ఎదిగాయా? ఇలాంటి ప్రశ్నలు అడగకపోవడం వలన అనుకున్నది సాధించలేదన్న నిరాశ కలుగుతుంది. ఈ కోణం నుంచి సకల జనుల

సమ్మెను చూస్తే పెట్టుబడిదారులకు, రాజకీయాలకు ఏర్పడ్డ అనైతిక సంబంధాన్ని సమ్మె ఎండగట్టింది. అక్రమ సంపాదన కలిగిన వారు రాజకీయాలను ఎలా నిర్దేశిస్తున్నారో తెలంగాణ ప్రజలకు తెలిసినంత స్పష్టంగా బహుశా ఇతర ఏ ప్రాంతం వారికి తెలిసి ఉండదు. అలాగే భిన్న రంగాలకు చెందిన సమస్త వృత్తుల వాళ్ళు, విద్యార్థులు, రైతులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఆటోలు నడుపుకునే వాళ్ళతో సహా ..... ఒక్కరు కాదు ప్రతిరంగం ఉద్యమానికి స్పందించింది. తన స్థాయిలో పాల్గొన్నది. సింగరేణి కార్మికుల్లో వ్యక్తమయిన ఐక్యత సాధారణమైన సంఘటన కాదు. అలాగే గ్రామ గ్రామంలో నిరసన, ఉద్యమాలు జరిగాయి. ఉద్యమ రూపాలలోని వైవిధ్యంలో ప్రజల సృజనాత్మకత కనిపించింది. అంటే ఉద్యమాలకు నిర్దిష్టమైన గమ్యాలు ఉండడమే కాదు, వాటికి ఒక గమనం కూడా ఉంటుంది. ఆ గమనాన్ని గమనిస్తే సకల జనుల సమ్మె ఒక గొప్ప సామాజిక అనుభవమే. అయితే సమ్మె విఫలమైందన్న నిరాశకు గురికాకుండా సమ్మె సృష్టించిన చైతన్యాన్ని మరలా ఉన్నత శిఖరాలకు తీసుకుపోయేలా ఉద్యమకారులు కృషి చేయడమే నిజమైన సామాజిక అభివృద్ధికి దోహదపడుతుంది. ■

**– ప్రొఫెసర్ హరగోపాల్**
రాజకీయ విశ్లేషకులు

29–09–2011, నమస్తే తెలంగాణ

# మరణం పోరాట చరణం కాదు

కరుణామూర్తి కన్నతల్లిని తలుస్తూనే....
అందరినీ కన్న తెలమగాణ తల్లికోసం
కఠోర నిర్ణయం తీసుకుంటావు
ఆఖరి మద్దావద్దు....
తిరుగు ప్రయాణానికని అంతకన్నా
చెడొద్దనుకుని
రెక్కల కష్టందాచుకున్న జేబును
తడుముకుంటావు
దిటవు గుండెను చేసుకుని సాక్షాత్తూ...
పార్లమెంటు ఎదుటే ఉరితాడును ముద్దాడుతావు
ఢల్లీ తల్లడిల్లిపోతుంది
ఒక వార్త గుప్పుమంటుందేమోనని
జాగ్రత్త పడబోతూ...దొంగవుచ్చులల్లుకుంటూ
ఆస్పత్రి....ఆంధ్రభవనమూ...
ఊసరవెల్లులకు నిలయాలై బలుస్తాయి
కుహానా సమైక్యవాదుల కుట్రలు
విషంలా పారివ్యాప్తమౌతూనే వుంటాయి

నీ మరణ వాంగ్మూలం....
కిరాతకుల పాలిట మరణశాసనమై
ప్రజలు...ప్రజలుగా పరుచుకుంటూ పోతుంది
తండ్రీ ....యాదిరెడ్డీ....
వీరుడా మందాడీ....
నీవు సంధించిన ప్రశ్నలు......
ఏలికలను ఎదిరిస్తున్నాయ్
అధికారులూ..... బడాచోరులూ
తమ పాషాన ఫణాలను నేలకేసి
కొట్టుకోవడమే తరువాయి...
బ్రహ్మాండం పేలిపోయేంతటి....ఆక్రోశం
నాలుగుకోట్ల తెలంగాణవాదుల...నిరసన
వెల్లువై విస్తరిస్తున్న కొద్దీ...
పిడికిళ్ళు...బిగించిన పిడికిళ్ళ ప్రజావళీ...
'ఇదే ఆఖరి ఆత్మహత్య కావాలన్న నీ కోర్కె
నెరవేరాలన్న ఆకాంక్ష!!

**– వేణు సంకోజు**

# ఉద్యమ పథమే సాఫల్య మార్గం

– జూకంటి జగన్నాథం

ఒక దశాబ్దానికి పైగా తెలంగాణ మలి దశ అస్తిత్వ పోరాటం లేక తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమం జరుగుతోంది. దీనిలో భాగంగా అనేక రకాల నిరసనలు, సమ్మెలు, ధర్నాలు, రాస్తారోకోలు, ఊరేగింపులు కొనసాగుతున్నాయి. పోరాట కాంక్షా భావనల పరిపక్వతలు 'నానుమాల' గా కన్పిస్తున్నాయి. కానీ ఫలవంతం కావడం లేదు. ఇదే రీతిలో రాజకీయ ప్రక్రియ ఉద్యమాలు కొనసాగితే ప్రజల కోరిక నెరబోనుందనే భరోసా అసంగతంగా మిగిలిపోతుంది. ఈ నేపథ్యంలో రాజకీయ ప్రక్రియలు, ప్రజా ఉద్యమాల వాస్తవికత, ఆచరణ, సంక్లిష్టత, సంబంధాల గుణ ధోరణులను లోతుగా అర్థం చేసుకునే ప్రయత్నం చేద్దాం.

తెలంగాణ సాధన బాటలో గమ్యం చేరుకోవడానికి ముఖ్యంగా రాజకీయ పార్టీలు ఎన్నిక చేసుకున్న మార్గం రాజకీయ ప్రక్రియ. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఈ ప్రక్రియ ద్వారానే తెలంగాణ కలను సాకారం చేసుకోవచ్చని తెలంగాణ రాజకీయ పక్షాలు, ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర సమితి గట్టిగా విశ్వసిస్తున్నాయి. ఆ నమ్మకంతోనే తమ ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నాయి. రాజకీయ ప్రక్రియలను లోతుగా చూస్తే మనకు ఎన్నికలు – ఓట్లు – నాయకులు–చట్టసభలు పైకి అగుపించుతున్నాయి. మీదికి కనిపించే ఈ నాల్గింటిని తెరచాటు నుంచి నడిపించే ప్రబల చోదక శక్తి ఆర్థికమేనని మనకు ద్యోతకమవుతుంది. ఇది తెలంగాణలో ఒకవైపు విశ్వసించి రాజకీయ పార్టీలు తమ మనుగడను కిందా మీదా పడి కొనసాగిస్తున్న స్థితి. తెలంగాణలోని రాజకీయ పార్టీల 'రాజకీయ ప్రక్రియ' తతంగాల నమూనానే సీమాంధ్రలోని పార్టీలు స్వీకరించాయి. తద్వారా మెజారిటీ శక్తితో, ఆర్థికయుక్తితో ఉమ్మడి రాష్ట్రంలోని ఒక ప్రాంతం చిరకాల కాంక్షను అడ్డుకుంటున్నాయి. ఎప్పటికప్పుడు కాల రాస్తున్నాయి. ఇది సీమాంధ్రలో నాణేనికి మరో వైపున నమ్మించి రాజకీయాలను 'కమ్ము' తున్న పద్ధతి.

సీమాంధ్ర, తెలంగాణలలోని రాజకీయ పక్షాలు, వాటి నాయకులు రాజకీయ ప్రక్రియనే విశ్వసించి తమ ప్రయోజనాలకు దెబ్బ తగులకుండా కొనసాగుతున్నాయి. అయితే సీమాంధ్ర నాయకమన్యులు పెట్టుబడి నుంచి ఎదిగివస్తే తెలంగాణ ప్రాంతంలోని నాయకులు పెట్టుబడితో అంటకాగుతూ, పెట్టుబడిదారులుగా రూపాంతరం చెందడానికి ఒదిగి వస్తున్నారు. అందువలనే దశాబ్దకాలంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖచిత్రమంతా ఒకసారి చిత్రవిచిత్రాలుగా మరోసారి కుప్పిగంతులుగా అస్తవ్యస్తంగా కనిపిస్తుంది.

ప్రధాన రాజకీయపక్షాలు టిడిపి, కాంగ్రెస్ ఇరు ప్రాంతాల్లో కత్తికి రెండు వైపులా పదును పెడుతూ చోద్యాన్ని చూస్తున్నాయి. తక్కువ అంచనా వేస్తూ ప్రజలతో చెలగాటమాడుతున్నాయి. ఈ రెండు పార్టీలు ఇరు ప్రాంతాల్లో ఇదే తరహా విధానాన్ని పాటిస్తే భవిష్యత్తులో భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి ఉంటుంది.

కేవలం రాజకీయ ప్రక్రియ, అనగా లాబీయింగ్, ద్వారా తెలంగాణ సాధించగలమని అనుకున్న టిఆర్ఎస్ ఎప్పటికప్పుడు ప్రజలలో ఎండమావుల భ్రమలను కల్పించవచ్చు. కానీ ప్రజల అసలు దూపను తీర్చే జీవధారను అందించలేదు. టిఆర్ఎస్ ఇదే ధోరణిని ప్రదర్శిస్తూ పోతే తెలంగాణలో ఎదురులేని శక్తిగా అవతరించడం అటుంచి రోజు రోజుకూ ప్రజల నమ్మకానికి దూరమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. దీనికి కారణం రాజకీయ

ప్రక్రియ అనే భావన ఆచరణలో అనేకానేక అడ్డంకులను అధిగమించాల్సి ఉండడమే. కేవలం రాజకీయ ప్రక్రియతోనే ప్రజల కోరికలకు, రాజకీయ పార్టీలు పట్టాభిషేకం చేయడం అంత సులభసాధ్యం కాదు కాక కాదు. ఈ వాస్తవాన్ని దశాబ్దకాలం నుంచి సాగుతున్న తెలంగాణ పోరాట చరిత్ర స్పష్టం చేసింది.

ఒకే 'రాజకీయ ప్రక్రియ' సూత్రాన్ని నమ్ముకొని ఒక ప్రాంతంలో సఫలమయితే తెలంగాణలో దారుణంగా విఫలమవడం యాదృచ్ఛికం కాదని గుర్తెరగాలి. తెలంగాణలోని రాజకీయ పార్టీల నాయకులు అనుభవం నుంచి ఆచరణ నుంచి గుణపాఠం నేర్చుకోకున్నా కనీసం పాఠం నేర్చుకున్న దాఖలాలు లేవు. అందుకే తిరిగి తిరిగి విఫలమైన రాజకీయ ప్రక్రియను ఆశ్రయించి తమ 'రాజకీయ శూన్యాన్ని' నిర్మూలించుకోవాలని రాజకీయ పార్టీలు చూస్తుంటాయి.

మార్క్సియన్ దృక్పథంతో ప్రజా ఉద్యమాలలో విశేష అనుభవం గడించి తలపండిన బుద్ధిజీవులు కూడా ఈ రాజకీయ ప్రక్రియ విలువల వలువల సాధ్యా సాధ్యాలను వింగడించడంలో ప్రజలకు వివరించడంలో ఘోరంగా విఫలమయ్యారు. అంతేగాక తమ మేధా సంపత్తిని కొండొకచో పార్టీలకు తాకట్టు పెట్టినట్టు సంచరించారు. రాజకీయ పార్టీలకు తప్పులు చేయడం, తాత్కాలికంగా చెంపలు వేసుకోవడం పరిపాటి. కానీ నడుస్తున్న తెలంగాణ ఉద్యమంలో బుద్ధిజీవులు తమ పాత్రను శీలాన్ని ప్రజలు శంకించేలా ప్రవర్తించటం క్షమించరాని నేరం.

ప్రపంచ చరిత్రలో ఏ దేశంలోనైనా ప్రజా ఉద్యమాలు లేకుండా కేవలం రాజకీయ ప్రక్రియపై ఆధారపడి తమ స్వప్నాన్ని సాధించిన సందర్భాలు లేవు. ప్రజా సమూహాల అభిలాషను ఆయా సమాజాలను ఐక్యపరిచి ప్రజాస్వామ్య ఉద్యమాల నిర్మాణం ద్వారా రాజకీయ ప్రక్రియకు సానుకూల వాతావరణం ఏర్పడుతుంది లేక వేగవంతం కల్పించినట్లవుతుంది. కానీ ఒకే ఒక్క రాజకీయ ప్రక్రియ ద్వారానే రాజకీయ పార్టీలు తమ లక్ష్యాన్ని చేరలేవని, ఛేదించలేవని చాలాసార్లు తెలంగాణ ఉద్యమం చరిత్ర రుజువు చేసింది.

ఉద్యమ క్రమంలో టిఆర్ఎస్ మిగతా రాజకీయ పార్టీలను తెలంగాణ విషయంలో ఒప్పించగలిగింది. కాని అది ఓట్ల రుతువుకే పరిమితమయింది. ఆ పిదప ఎవరి దారి వారిదిగా, ఎవరి గూటికి వారుగా 'బోకెత్తుల' మాటలతో తప్పించుకొని కాలం వెల్లబుచ్చుతున్నారు. అయితే ఈ వ్యూహ ప్రతివ్యూహాల వలలో చిక్కి నిరాశ నిస్పృహలతో ఎటూ పాలుపోక 700 పై చిలుకు విద్యార్థులు, యువకులు తమ అమూల్యమైన ప్రాణాలను తర్పణం చేశారు. తెలంగాణ మట్టి వారసత్వానికి పూర్తి వ్యతిరేకంగా పిరికిగా రాజకీయ వధ్యశిలకు తమ విలువైన జీవితాలను బలియిచ్చారు. ఇది తెలంగాణ పార్టీలకే కాదు ద్వంద్వ ప్రమాణాలు పాటించే తెలుగుదేశం, కాంగ్రెస్ అధినాయకత్వాల ప్రస్థానానికి ఒక మాయని అమానవీయమైన అసమానకరమైన మచ్చ.

రాజకీయ ప్రక్రియ యాగంలో నోట్లు కూడబెట్టవచ్చు గానీ ఓట్లు రాబట్టలేమని గ్రహించిన నాయకులు తెలంగాణ ఉద్యోగ సంఘాలను ఉద్యమ అగ్రభాగంలోకి ఒడుపుగా లాగాయి. తెరవెనుక రాజకీయ నాయకులు తోలుబొమ్మలాటకు నాంది పలికాయి. సాపేక్షత, ఓటు బ్యాంకు రాజనీతి అవసరంలేని ప్రజాసంఘాలను సమన్వయపరచలేని టి–జాక్ రాజకీయ పార్టీలను ఐక్యం చేయడంలో పూర్తిగా సహజంగా విఫలమైంది. దీనికి కారణం ఇతరుల కుట్ర కన్నా తానేనన్న అపఖ్యాతిని మూటగట్టుకుంది. అటువంటి టి–జాక్ ఆయా వర్గాల సమ్మెకు సకల జనుల సమ్మెకు మధ్యనున్న అంతరాన్ని, అర్థాన్ని గ్రహించకుండానే పిలుపునిచ్చి కుడితిలో పడ్డ ఎలుకలా రాజకీయ పార్టీల చుట్టూ గిలగిలా కొట్టుకుంటూ చక్కర్లు కొడుతుంది. నిజంగా వేతన జీవులు ఈ సమ్మెలో మైనస్ అయితే సకల జనుల సమ్మె ఊహను సైతం ఊహించుకోజాలక పోవడమే కాదు జీరోగా సమ్మె తేలిపోతుంది. సమ్మెలో ప్రధాన రాజకీయ పక్షాలు అంటి ముట్టనట్టు వ్యవహరిస్తున్నాయి. నువ్వు ముందు అంటే నువ్వు ముందు అంటూ మీసాలు తీప్పుతూ తొడలు కొడుతూ గోడ మీది పిల్లిలా 'నాసు' పెట్టుకు రాజకీయ పార్టీలు కాచుక కూర్చున్నాయి. విచిత్రంగా ఈ సకల జనులనే సమ్మెలో బాధాకరంగా ఎక్కువగా తెలంగాణ సామాన్యులే ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ప్రభుత్వాలకు, సీమాంధ్రులకు వారి వారి వ్యాపారులకు ఆర్థిక లావాదేవీలకు

చీమ కుట్టినట్లయినా లేదు. ఈ రకమైన ఉద్యమాల్ని రాజకీయ ప్రక్రియ అనే బదులు సత్యాగ్రహంలో ఒక భాగం అంటే బాగుంటుంది.

దశాబ్దకాల అస్తిత్వ పోరాటాల స్వరూపాలన్నీ అక్కడక్కడా 'ఎరుకలు' పెట్టుడే కానీ ఏ ఒక్క పెద్ద సమస్యను రాజకీయ పార్టీలు సీరియస్‌గా తీసుకొని శాశ్వతంగా పరిష్కరించిన దృష్టాంతాలు లేవనే చెప్పాలి. తెలంగాణలో ఉద్యమం ఉగ్రరూపం దాల్చిన ప్రతిసారీ రాజకీయ నాయకులు ప్రజల ఉద్యమాన్ని నీరు గార్చుతున్నారు. ఈ దఫా విచిత్రంగా తెలంగాణలో రాజకీయ ప్రక్రియను నమ్ముకున్న పార్టీ కూడా చివరకు సమ్మె ద్వారా ప్రజా ఉద్యమాల్ని ఆశ్రయించాలనే విషయాన్నే చెప్పకనే చెప్పి ఒప్పుకున్నట్లయింది. ఇక ఇప్పుడు సారాంశంలో 'రాజకీయ ప్రక్రియ – ప్రజా ఉద్యమాలు' గా కాక 'ప్రజా ఉద్యమాలు – రాజకీయ ప్రక్రియ' గా ప్రాధాన్యత క్రమాన్ని గుర్తెరిగి పొసంగం లేని ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు ఇక ముందు నిర్మాణాత్మకంగా మసలుకోవాలనే విషయాన్ని విశదీకరించింది.

ఇప్పటికైనా తెలంగాణ ఉద్యమంలో జరిగిన ప్రాణనష్టాన్ని ముందు ముందు జరగకుండా నివారించడానికి ముఖ్యంగా ప్రజాసంఘాల నాయకులు తమ తమ అహాలను, ఒంటెద్దు పోకడలను పక్కన పెట్టాలి. అనుభవ సారాలకు పదును పెట్టి 'ఉట్టికెగరలేనమ్మా స్వర్గానికెగిరినట్లు' గాక దేశంలో ఎక్కడా లేని తెలంగాణలో మాత్రమే ఉన్న సాంస్కృతిక దళాలను పూర్తి స్థాయిలో సమాయత్తం చేసి చట్ట పరిధిలో సమాంతర ప్రత్యామ్నాయ ప్రజా ఉద్యమాలను నిర్మించాలి. ప్రజలకు రేషం గల గొప్ప వారసత్వం అందించాలి. విద్యార్థులలో యువకులలో అచంచలమైన విశ్వాసాన్ని పాదుకొల్పాలి. ప్రజా ఉద్యమాల నిర్మాణం ద్వారా రాజకీయ ప్రక్రియ పైన, నాయకుల పైన పునాదులు కదిలే అనూహ్యమైన ఒత్తిడి పెంచితేనే తెలంగాణ అస్తిత్వ పోరాటానికి ఒక శాశ్వత సంపూర్ణ పరిష్కారం లభిస్తుంది. లేకపోతే అప్పటివరకు గిదే 'కొర కొర' మధ్యే మార్గ సూచనలు సలహాలే గతి అవుతాయి. ఉద్యోగుల, మేధావుల ఉద్యమంలోని రాజకీయ పార్టీల లొసుగుల పట్ల ఉదాసీన వైఖరి తెలంగాణ ఉజ్వల చరిత్ర కొనసాగింపులో విషాద అధ్యాయాన్ని జోడించడంగా మిగిలిపోతుంది. పెట్టుబడిదారులుగా మారడానికి ఉవ్విళ్ళూరుతున్న తెలంగాణ పెటీ బూర్జువా రాజకీయ వర్గంలోని 90 శాతం క్రూరత్వాన్ని విడిచి పైకి ప్రదర్శించే 10 శాతం ఉదార స్వరూపాన్ని బట్టబయలు చేయకుండా భజన చేసినంత కాలం తెలంగాణ సమాజం అతి సమీపంలోనే మరో చేదునిజం మాత్రను మింగాల్సిన దుస్థితి పొంచి ఉంది. రాజకీయ వ్యవస్థకు ధీటుగా ప్రత్యామ్నాయంగా ఉద్యమాల రూపం తీసుకోవడంలో ప్రజాసంఘాల నాయకులు తమ తమ అహాలను వర్గ అహంకారాలను విడిచి ఎలాంటి భేషజాలు లేకుండా ఐక్యతతో ప్రజలను నిర్మాణాత్మకంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది. అంతవరకు ఎప్పటిలాగే తెలంగాణలో రోజూ పొద్దు పొడుస్తుంది. పొద్దు గడుస్తుంది. పొద్దు గూకుతుంది. భోజనం చేస్తాం. రాత్రి నిద్ర పోతాం. తెల్లారి నిద్ర లేస్తాం. కానీ కండ్లు మాత్రం తెరువలేము గాక తెరువలేము. ■

*– జూకంటి జగన్నాథం*
అధ్యక్షుడు, తెలంగాణ రచయితల వేదిక

28–10–11, ఆంధ్రజ్యోతి

# టార్గెట్ తెలంగాణ నాయకులే

నేడు ప్రపంచంలోని కొన్ని దేశాల నియంతలను సాగనంపేందుకు పెల్లుబికిన ప్రజా పోరాటాల కన్నా ఎక్కువ కాలం నుంచే తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం కొనసాగుతుందనుటలో అతిశయోక్తి లేదు. తెలంగాణ ప్రజలు నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా కూడా ఇంత సుదీర్ఘ కాలం పాటు ఉద్యమించలేదు. భారత స్వాతంత్ర్యానంతర చరిత్రలో ఒక రాష్ట్ర సాధన ఉద్యమంలో ఇంతమంది అమరులైన చరిత్ర దేశంలోనే మరెక్కడ జరుగలేదు. తెలంగాణలో 98 శాతం ప్రజలు తమకు ప్రత్యేక రాష్ట్రం కావాలని కోరుకుంటున్నారు. ఇది ఇక్కడి ప్రజల చిరకాల ప్రగాఢ ఆకాంక్ష. ఒకవేళ తెలంగాణలో ప్రజాభిప్రాయ సేకరణ చేపడితే ఇది తప్పక రుజువవుతుంది. దురదృష్టం ఏమిటంటే మన దేశంలో ప్రజాభిప్రాయ సేకరణ ఏ విషయంలోనూ చేపట్టడం లేదు.

తెలంగాణ ప్రజలు రాష్ట్ర సాధన గురించి తమ పరిధిలో ఏం చెయ్యగలరో దానికి మించే ఇప్పటివరకు వాళ్ళు చేసింది చేస్తూ వస్తుంది. ఎన్నికలప్పుడు తెలంగాణకు కట్టుబడి ఉన్నామని నమ్మబలికిన ప్రతి పార్టీని విశ్వసించి రెండు సాధారణ ఎన్నికల్లో మరియు ఉప ఎన్నికల్లో ఓట్లు వేసి గెలిపించినా ప్రయోజనం శూన్యం. అందుకే ప్రజల్లో నిరాశ నిస్పృహలు పెరిగి దాదాపు 700 వరకు ఆత్మ బలిదానాలు జరిగినవి. ఇన్ని జరిగినా తెలంగాణ ప్రజల ఆకాంక్షలను సాకారం చెయ్యటంలో రాజకీయ పార్టీలు, ప్రజా ప్రతినిధులు, నాయకులు ఎందుకు ఘోరంగా విఫలమవుతున్నారు అన్నది ప్రశ్న. ఈ తరుణంలో తెలంగాణ ప్రజల మనస్సుల్లో మెదులుతున్నవి మూడే ప్రశ్నలు. అవి 1. 9 డిసెంబరు 2009 ప్రకటన పిదప కూడా తెలంగాణ అంశం ఎందుకు ముందుకు సాగుటలేదు? 2. తెలంగాణ అంశం ముందుకు సాగకపోవడానికు కారకులు ఎవరు? 3. తెలంగాణ రాష్ట్ర సాధనకై భవిష్యత్‌లో ఏం చేయాల్సి ఉంది?.

## ప్రజా సంఘాలు ఎక్కువ

పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ మనుగడకు మూలం రాజకీయ పార్టీలు. ఈ రాజకీయ పార్టీలు తాము నిర్వహించవలసిన పాత్రను అవి సరిగా నిర్వహించలేనప్పుడు ఆ బాధ్యతను భుజాన వేసుకున్నవి ప్రజా సంఘాలు. అందుకే తెలంగాణ ప్రాంతంలో ఉన్నన్ని ప్రజా సంఘాలు దేశంలో మరెక్కడా లేవు. వివిధ ప్రజా సంఘాల నేతృత్వంలో తెలంగాణ అంశం బలపడుతున్న విషయాన్ని గమనించిన రాజకీయ పార్టీలు స్పందించి తెలంగాణ వాదం బలపడి ఉద్యమ రూపం దాల్చింది. ఉద్యమం తారాస్థాయికి చేరుకున్న దశలో కేంద్రం దిగివచ్చి 9 డిసెమబరు 2009 నాడు తెలంగాణ రాష్ట్ర ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. విద్యార్థులు, ప్రజా సంఘాల ఉద్యమాల ఫలితంగానే 9 డిసెంబరు నాటి ప్రకటన వెలువడింది అన్నది నిర్వివాదాంశం. ఆ ప్రకటన రావటానికి కెసిఆర్ మరియు టిఆర్ఎస్ ల పాత్ర కూడా విస్మరించరానిది. కేంద్రం ప్రకటించిన పిదప కూడా ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్ర ప్రక్రియ ప్రారంభం కాలేదు. ఎందుకు అన్నది ప్రశ్న. డిశెంబరు 9 ప్రకటన పిదప తెలంగాణలో క్షేత్ర స్థాయిలో పెను మార్పులు చోటు చేసుకున్నాయి. రాజకీయ పార్టీలు ఎగిసి పడుతున్న ఉద్యమాన్ని దృష్టిలో ఉంచుకొని దాన్ని ఎలాగైనా నియంత్రించి ఉద్యమాన్ని తమ అధీనంలోకి తెచ్చుకొని లబ్ధి పొందాలనే ప్రయత్నంలో భాగంగా

కొన్ని కొత్త ఉద్యమ సంస్థలకు రూపకల్పన చేసినవి. అందులో భాగంగానే విద్యార్థులలో మరియు తెలంగాణ వాదులలో కొత్త ఉద్యమ సంస్థలు పుట్టుకొచ్చినవి అన్నది సత్యం. అంతకు ముందున్న ఉద్యమ సమస్థలను చీల్చడం కొత్త వాటిని ఏర్పాటు చేయడంతో ఉద్యమ సంస్థల సంఖ్య పెరిగి వాటి మధ్య ఐక్యత మరియు సమన్వయం లోపించింది. ఉద్యమ సంస్థల మధ్య ఐక్యత మరియు సమన్వయం లోపించడానికి ప్రధాన కారణం రాజకీయ పార్టీల వైఖరులే అన్నది నగ్నసత్యం.

తెలంగాణకు అనుకూలంగా వచ్చిన ప్రకటనను సాకారం చేసుకొనుటలో గత రెండు సంవత్సరాల కాలం నుండి ఉద్యమ సంస్థలు, రాజకీయ పార్టీలు, ప్రజా ప్రతినిధులు విఫలమవడానికి కారణం వాటి మధ్య ఐక్యత మరియు సమన్వయం లేకపోవడం. ఇప్పటికైనా తెలంగాణకు అనుకూలంగా వచ్చిన ప్రకటనను సాకారం చేసుకొనుటలో ఉద్యమ సంస్థలు, రాజకీయ పార్టీలు తమ మధ్య లోపించిన ఐక్యత మరియు సమన్వయాన్ని దృష్టిలో ఉంచుకొని విశాల ప్రాతిపదికన ఒక గ్రాండ్ అలయెన్స్‌గా ఏర్పడవల్సిన అవసరం ఉంది. లేనిచో ఉద్యమ సంస్థల మధ్య ఉన్న అనైక్యత పాలకులకు లాభించవచ్చు.

## స్వప్రయోజనాల కోసమే నేతల ఉద్యమాలు

తెలంగాణ అంశం ముందుకు సాగకపోవడానికి కారకులు ఎవరు? 'ఏదో ఒక రూపంలో ప్రజలు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నా, ఎవరో ఒకరు ప్రతిరోజు అత్మహత్యకు పాల్పడుతున్నా, ప్రజా ప్రతినిధులు రాజీనామాలు సమర్పించినా మనం ఆశించిన రాజకీయ సంక్షోభం ఎందుకు ఏర్పడటంలేదు? ప్రజలు, ప్రజాసంఘాల పిలుపు మేరకు ప్రజాప్రతినిధులు ఆడిన రాజీనామాల డ్రామా ఏనాటికైనా వారికి బెడిసికొట్టక మానదు. స్పీకర్ రాజీనామాలను తిరస్కరించడం వాళ్ళకు ఎంత ఆనందాన్ని కలిగించిందో చెప్పనలవికాదు. వారికి రాజీనామాలను ఆమోదింపచేసుకునే అవకాశమున్నా వాళ్ళు దానికి పాల్పడుటలేదు. అంటే వాళ్ళకు తెలంగాణ అంశం పట్ల ఉన్న నిబద్ధత ఏపాటిదో అర్థం అవుతుంది. తమ ప్రభుత్వాలకు కేంద్రంలో గానీ, రాష్ట్రంలో గానీ ధోకా లేనంత వరకు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోదు. రాజకీయపరమైన సంక్షోభమో, రాజ్యాంగపరమైన సంక్షోభమో లేదా తమ పార్టీ మనుగడే ప్రశ్నార్థకంగా మారినప్పుడో గానీ కాంగ్రెస్ నిర్ణయం తీసుకోదు. ముఖ్యంగా రాష్ట్రంలో ప్రభుత్వం మనుగడ సంక్షోభంలో పడనంతవరకు కేంద్రం ఏ నిర్ణయం తీసుకోదు. తెలంగాణ రాష్ట్ర ప్రక్రియ ప్రారంభం కాలేదు. ఎందుకంటే ఇప్పటివరకు రాష్ట్రంలో ప్రభుత్వం సుస్థిరంగా ఉంది కాబట్టే. రాష్ట్రంలో ప్రభుత్వం పని చేస్తుంది అంటే అది కోస్తాంధ్ర రాజకీయ ప్రజా ప్రతినిధుల మూలంగానె అని వాళ్ళను నిందించడం సబబుకాదు. ప్రభుత్వం సుస్థిరంగా ఉంది అంటే దానికి కారణం మన తెలంగాణ ప్రజా ప్రతినిధులు మాత్రమే. తెలంగాణ మంత్రులు ప్రభుత్వంలో భాగస్వామ్యం పంచుకున్నంత కాలం కేంద్రం ఏ నిర్ణయం తీసుకోదు. కోస్తాంధ్ర మంత్రులు, ప్రజా ప్రతినిధులు ప్రభుత్వం సాఫీగా నడిచేందుకు తోడ్పడవచ్చు. వాళ్ళను తప్పుపట్టలేము కానీ తెలంగాణ మంత్రులు మాత్రం క్షమార్హులు ఎంత మాత్రం కాదు. తెలంగాణ ప్రజాప్రతినిధులు చెబుతూ వస్తుంది ఒక్కటే. తామంతా తెలంగాణకు కట్టుబడి ఉన్నామని. రాష్ట్ర సాధన గురించి తాము చెయ్యని త్యాగం లేదని. రాష్ట్రం సిద్ధించకపోవడానికి కారణం ఆంధ్ర లాబీయింగ్ అని సెలవిస్తున్నారు. ఆంధ్రలాబీ పని ఆంధ్రలాబీ చేస్తుంటే మరి తెలంగాణ ప్రజా ప్రతినిధులు ఏం చేస్తున్నట్లు? ఆంధ్రలాబీ చేస్తున్నది వారి స్వప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని తెలంగాణ రాకుండా పావులు కదుపుతూ ఉంటే మరి మన ప్రజా ప్రతినిధులు ఏం చేస్తున్నట్లు? మన ప్రజా ప్రతినిధులకు తెలంగాణ అంశంపట్ల నిబద్ధత లేదు. వారిలో ఉన్నదల్ల తెలంగాణ అంశం పేరిట ఏ మేరకు రాజకీయంగా లబ్ధి పొందగలమో అన్న భావన తప్ప. వాళ్ళు పావులు కదుపుతుంది కూడా ఆ కోణంలోనే. పదవుల పందేరంలో నిస్సిగ్గుగా వ్యవహరిస్తూ పైకి తెలంగాణ జపం వల్లిస్తున్నారు.

## ప్రజా ప్రతినిధులే శత్రువులు

తెలంగాణ రాకపోవడానికి ఇంకో అడ్డంకి కేంద్రమంత్రి జైపాల్‌రెడ్డి. కేంద్రంలో తెలంగాణ ప్రాంతం నుండి ఉన్న ఏకైక క్యాబినెట్ ర్యాంక్ మినిస్టర్. జైపాల్ రెడ్డి జాతీయవాది. అతను ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతం దేశంలోనె వెనుకబడిన ఐదు జిల్లాల జాబితాలో స్థానం సంపాదించుకున్న పాలమూరు. కేంద్ర ప్రభుత్వంలో కదలిక రావాలంటే అతను ప్రభుత్వం నుండి వైదొలిగేటట్లుగా అతనిని రాజీనామా చేయించే దిశగా ఉద్యమాల ద్వారా అతనిపై తీవ్ర వత్తిడి తీసుకురావాలే. అతను కనుక కేంద్ర ప్రభుత్వం నుండి రాజీనామా చేసి వైదొలిగితే ఖచ్చితంగా ఢిల్లీలో కదలిక ప్రారంభమవుతుంది. తెలంగాణ ప్రాంత ప్రజాప్రతినిధులు కేంద్రంలోగానీ, రాష్ట్రంలోగానీ ఎక్కడ కూడా మంత్రి వర్గాలలో ఉండరాదు. తమ శాసనసభ సభ్యత్వానికి లోక్‌సభ సభ్యత్వానికి రాజీనామాలు చేసి ఆమోదింపచేసుకుంటే ఖచ్చితంగా ఢిల్లీ దిగివస్తుంది. తెలంగాణ అంశం పరిష్కారానికి ఒక బాట కూడా పడుతుంది. ఇది జరుగనంత వరకు ఢిల్లీలో కదలిక ఉండదు. దీనికై తెలంగాణ ప్రాంత ప్రజాప్రతినిధులనే టార్గెట్‌గా చేసి ఉద్యమ నిర్మాణాన్ని చేపట్టవలసిన అవసరముంది. ఉద్యమాలు అన్నీ వాళ్లను టార్గెట్‌గా చేసి నడిచినప్పుడే సమస్యకు పరిష్కారం లభిస్తుంది. మన శత్రువులు కోస్తాంధ్ర ప్రజాప్రతినిధులు ఎంత మాత్రం కాదు. మన శత్రువులు మన ప్రజాప్రతినిధులే, వాళ్లే తెలంగాణకి అడ్డంకి అన్న విషయాన్ని గమనించాలి.

తెలంగాణ రాష్ట్ర సాధనకు స్పష్టమైన వ్యూహం అనేది మనకు లేనందువల్లనే జాప్యం జరుగుతుందనేది సత్యం. నాయకులకు తోటి ఉద్యమ సంస్థలను కలుపుకుపోయే తత్త్వం లేదు. రాష్ట్ర సాధనకై తెలంగాణలోని ఉద్యమ సంస్థలు రాజకీయ పార్టీలు అన్నీకలిసి ఒక గ్రాండ్ అలయెన్స్‌గా ఏర్పడి అంతా కలిసికట్టుగా ఉద్యమించి ప్రజా ప్రతినిధులపై వత్తిడి పెంచాలి. బడుల బందు వల్లనో సినిమాటాకీస్‌ల బంద్ వల్లనో ప్రజాప్రతినిధులపై ఒత్తిడి పెరగదు. ఉద్యమ నిర్మాణం జరగవలసింది మన ప్రజాప్రతినిధుల చుట్టూ, కోస్తాంధ్ర ప్రజాప్రతినిధులను నిందించి ప్రయోజనం లేదు. మన ఇంటిని మనం సరిదిద్దుకోవాలి. రాజ్యాంగానికి లోబడి, ప్రజాస్వామ్యబద్ధంగా, అహింసామార్గంలో, ఐక్య ఉద్యమాల ద్వారా, మన ప్రజా ప్రతినిధులను దారిలోకి తెచ్చుకొని, వారి రాజీనామాలను ఆమోదింపచేసుకుని రాష్ట్ర సాధన మార్గంలో పయనించవలసిన సమయం ఆసన్నమైంది. రాష్ట్ర సాధనకు వేరే మార్గాలు లేవు. ఉన్నదల్ల ఇదొక్కటే మార్గం. మన ప్రజాప్రతినిధులను టార్గెట్ చేస్తూ ఏకోన్ముఖ ఐక్యఉద్యమానికి పూనుకోంది రాష్ట్రం సిద్ధించదు. దీనికై తగు ఉద్యమ కార్యాచరణ రూపొందించుకోవాల్సిన అవసరముంది. ■

***– ప్రొ॥ జి. లక్ష్మణ్, ప్రొ॥ బిక్షం గుజ్జా,***
***ప్రొ॥ బి. సత్యనారాయణ, ప్రొ॥ విష్ణువర్ధన్‌రెడ్డి,***
***ప్రొ॥ ఎస్. మల్లేష్, ప్రొ॥ ఎం. వెంకటేశ్వర్ రావు***



*సకల జనుల సమ్మెలో భాగంగా రసమయి బాలకిషన్ కళాప్రదర్శన. తేది : 20-09-2011.*



*సకల జనుల సమ్మెలో తెలంగాణ జె.ఎ.సి. నాయకులు*

# 'సకలం' సశేషం, పాఠాలు అనేకం

**– కె.ఎస్.**

సకల జనుల సమ్మె చరమాంకానికి వచ్చింది. విరమణ కాదు, వాయిదా అని సమ్మె సంఘాలు చెబుతున్నాయి కానీ, అవి అత్మ సంతృప్తికి చెప్పుకుంటున్న మాటలే. నెల రోజులకు పైగా సాగిన ఒక చరిత్రాత్మక ఘట్టం ముగింపునకు వచ్చిందన్నదే వాస్తవం. సమ్మెలు సడలుతున్న సమయంలో కూడా ఒక రోజు తెలంగాణ బంద్‌ను విజయవంతంగా నిర్వహించడం, విరమణ వల్ల కలుగుతున్న ఆశాభంగాన్ని సమర్థంగా తెలంగాణ ప్రాంత మంత్రుల మీదకు మళ్ళించడం – ఉద్యమస్ఫూర్తికి నష్టం కలగకుండా నాయకత్వం అనుసరించిన ఎత్తుగడలే.

అయితే, ఈ సకల జనుల సమ్మె పోరాటంలో గెలిచిందెవరు? ఓడిందెవరు? – ఈ ప్రశ్నలు తప్పనిసరిగా ముందుకు వస్తాయి, వస్తున్నాయి. ఒక సుదీర్ఘ ఉద్యమంలో ఒక ఘట్టం ఫలితాన్ని బట్టి, ఓటమి గెలుపులను నిర్ణయించవచ్చునా? అన్నది మరో ముఖ్యమైన ప్రశ్న. అంతిమదశలో మాత్రమే చేపట్టవలసిన బ్రహ్మాండమైన ఉద్యమ రూపాన్ని సమయం కాని సమయంలో రాజకీయ జెఎసి ప్రయోగించడం సరిఅయినదేనా? ఈ దశలో ఈ ఉద్యమరూపం ఫలితం ఇట్లాగే ఉండబోతుందని నాయకత్వానికి తెలియదా? విశాల ప్రజానీకం స్వచ్ఛందంగా పాలుపంచుకుంటున్న ఉద్యమం విషయంలో రాష్ట్ర పాలనా యంత్రాంగం, అధికార పక్షం వ్యవహరించిన తీరు సరి అయినదేనా? సమ్మెను భగ్నం చేయడానికి ప్రభుత్వం, పాలకపెద్దలు అనుసరించిన సందేహాస్పదమైన ఎత్తుగడలు, భవిష్యత్తులో ప్రజా ఉద్యమాలపై ఎటువంటి ప్రభావం వేయనున్నాయి?

ప్రశ్నలూ సందేహాలు ఎలాగూ వస్తాయి కానీ, ఒక ఉద్యమం నుంచి మొత్తం సమాజం నేర్చుకోదగినవి ఎన్నో ఉంటాయనికూడా గుర్తించాలి. ఒక ప్రాంతానికి చెందిన ప్రజలు తమ ఆకాంక్షలను వ్యక్తం చేయడానికి ఏఏ పద్ధతులను అనుసరించారు, ఆ వ్యక్తీకరణను భగ్నం చేయడానికో, బలహీనపరచడానికో ప్రభుత్వాలు, వ్యతిరేకులు ఏ వ్యూహాలను పాటించారు... అన్న అంశాలు.. భవిష్యత్తులో జరిగే (తెలంగాణకు అనుకూల నిర్ణయం వస్తే, సీమాంధ్ర ప్రాంత ప్రజలు చేయాలనుకుంటున్న ఉద్యమాలతో సహా) అన్ని ఉద్యమాలకూ పాఠాలుగానే పనికివస్తాయి. సమ్మెల వల్ల సమాజానికి కలిగే ఇబ్బందులను సామాజిక న్యాయదృష్టితో అన్ని ప్రజా ఉద్యమాలకూ ఈ దృష్టిని అన్వయిస్తే, పోరాటాల తీరే మారవలసి వస్తుంది. సకలజనుల సమ్మె సందర్భంగా చర్చకు వచ్చిన ఇటువంటి అనేక అంశాలు, మొత్తం సమాజం అనుభవ సంపుటిలో భాగం అవుతాయి. కొత్త విలువల అవతరణకు దోహదం చేస్తాయి.

సకల జనుల సమ్మెలో ముఖ్యమైన విశేషం.. ఒక రాజకీయమైన ఆకాంక్షకు మద్దతుగా ఉద్యోగ వర్గాలు ఆందోళనకు దిగడం, వేతనాల గురించి, పని పరిస్థితుల మెరుగుదల గురించి ఉద్యోగ సంఘాలు దీర్ఘకాలం సమ్మెకు దిగడం మనకు అనుభవమే కానీ, రాష్ట్ర విభజన వంటి రాజకీయ నిర్ణయాన్ని కోరుతూ వివిధ శ్రేణుల ఉద్యోగులు, కార్మికులు, సంస్థలు సమిష్టిగా ఉద్యమించడం అరుదైనది. అనేక అంచెల సామాజిక వ్యవస్థ, అంతరాల ఆర్థిక వ్యవస్థ కలిగిన ఒక ప్రాంతంలో, భిన్న వర్గాల మధ్య ఇంతటి ఉద్యమ ఐక్యత కూడా మునుపెన్నడూ కనిపించలేదు. ఉద్యమ నాయకత్వం మీద అనేక ఫిర్యాదులు, అసంతృప్తులు ఉన్నప్పటికీ, వివిధ సమాంతర ఉద్యమ సమస్థలు, బృందాలు ఉమ్మడి లక్ష్యం మీద ఏకాగ్రతతో వ్యవహరించిన సందర్భాలు కూడా అరుదు.

సకల జనుల సమ్మె – నిష్ఫలంగా ముగిసినప్పటికీ, ఉద్యమంలో మాత్రం నిస్పృహ కనిపించడంలేదు. ప్రతిరోజూ ఇద్దరో ముగ్గురో యువకులు ఆత్మహత్యలు చేసుకునే విషాదం కొనసాగుతూనే ఉంది కానీ, సకల సమ్మెను సుదీర్ఘకాలం కొనసాగించగలుగుతున్న సంతృప్తి అధిక సంఖ్యాకులను ఉత్తేజపరుస్తూ వచ్చింది. మరింత కాలం నిరీక్షణకు, మరింత విస్తృతమైన ఉద్యమ నిర్మాణానికి సంసిద్ధత, సంకల్పం గట్టిపడుతూ వచ్చాయి. సమ్మె సగానికి వచ్చేటప్పటికే,

కేంద్ర ప్రభుత్వం నుంచి కీలకమైన స్పందన ఏదీ త్వరలో రాబోవడం లేదన్నది ఉద్యమ శ్రేణులకు అర్థమైపోయింది. విఫలమవుతున్న పోరాట రూపాన్ని పట్టుకువేలాడటం కంటె, మరో దారిలోకి మళ్ళడం మంచిదని, అయితే, అది గౌరవప్రదమైన పద్ధతిలో ఉండాలని ప్రతిపాదనలు మొదలయ్యాయి. ఢిల్లీలో ఏమి ఉపదేశాలు లభించాయో తెలియదు కానీ, గత దసరా పండగనాటి నుంచి రాష్ట్ర ప్రభుత్వంలో చాణక్యం మొదలయింది. ఆర్టీసీలో చేసిన తొలిప్రయత్నం విఫలమయింది కానీ, మలివిడత రైల్ రోకోను భగ్నం చేయడంలో ప్రభుత్వం విజయం సాధించింది. ఇంతలో దీర్ఘకాలం బడులు మూసివేయడం గురించి రకరకాల శిబిరాల నుంచి ఉద్యమం మీద విమర్శ మొదలయింది. ఇరవయ్యో తారీఖు దాకా సమ్మె సాగితే తెలంగాణలో ఉద్యమకారుల మీద ప్రజలే తిరగబడతారు అని కొందరు కాంగ్రెస్ నేతలు చేసిన వ్యాఖ్యలు గమనిస్తే, అటువంటి అంతర్గత విభజనను తీసుకువచ్చే ప్రయత్నమేదో గట్టిగానే సాగిందని అర్థమవుతుంది. వీటన్నిటినీ సకల జనుల సమ్మెలో పాల్గొంటున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వివిధ వర్గాలవారు అర్థం చేసుకుని, దృఢంగా నిలబడడం ఆశ్చర్యమే, అందువల్లనే వారి శక్తి సన్నగిల్లిన తరువాత, సమ్మె విరమణ కోసం మార్గాలను వెదుక్కోవడాన్ని ఎవరూ తప్పు పట్టలేకపోయారు. నిజానికి వారు రాజీనామా చేసిన సకల రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులకు మద్దతుగా సమ్మె ప్రారంభించారు. వారు మాత్రమే పోరులో దూకితే, రాజకీయులు ఒడ్డునే ఉండిపోయారు.

సమ్మె ఔచిత్యాన్ని ప్రశ్నించినవారే, తెలంగాణ గురించి ఏ హామీ లేకుండా ఎందుకు విరమించినట్టు అని ప్రశ్నిస్తున్నారు. రాజకీయ దృష్టితో చూసినప్పుడు అటువంటి ప్రశ్నలు తలెత్తడం సహజమే. సమ్మె ఉపసంహరణ లేదా వాయిదా– అన్నది ఉద్యమ లక్ష్యానికి తగిలిన దెబ్బగా అభివర్ణించేవారు కొందరుంటారు. ప్రభుత్వం వ్యవహరించిన తీరు అయితే, పంతం పట్టినట్టుగానే కనిపించింది. ఏదో ఒక లక్ష్యం కోసం ఉద్యమం బాటలో ఉన్న ప్రజలతో ప్రభుత్వ యంత్రాంగం పోటీపడడం మంచిది కాదు. ప్రభుత్వం తరపున తనవంతు బాధ్యత నిర్వహించినప్పటికీ, ఒక్క బొత్స సత్యనారాయణ మాత్రమే, సమ్మె విరమణ వల్ల ఉద్యమ ఆకాంక్ష వీగినట్టు కాదు అన్న వ్యాఖ్య చేసి, ఉద్యోగ వర్గాలను కూడా గౌరవించారు. మెట్ట రైతులకు విద్యుత్ కొరతను కప్పించి, అందుకు సమ్మెదే బాధ్యత అన్నట్టు వ్యవహరించడం దగ్గరనుంచి, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు పోటీ పెట్టడం దాకా – ప్రభుత్వ వ్యవహారం ఎత్తుకు పైఎత్తు పద్ధతిలోనే సాగింది తప్ప సామరస్యపూర్వకంగా లేదు.

తెలంగాణ ప్రజలకు ఈ సమ్మె కాలంలో కలిగిన రాజకీయ జ్ఞానోదయం చిన్నది కాదు. ఢిల్లీలోని కాంగ్రెస్ పెద్దలు కానీ కేంద్ర ప్రభుత్వం కానీ ప్రజాస్వామ్యయుతంగా జరిగే ఒక ఉద్యమాన్ని ఎంతగా అలక్ష్యం చేయగలవో ఈ సమ్మె నిరూపించింది. సమ్మె ప్రభావాన్ని నిరాకరించడం దగ్గర నుంచి మొదలుపెట్టి, హడావుడి సంప్రదింపుల ప్రదర్శన దాకా కాంగ్రెస్ శాసన సభ్యులు, మంత్రులు ప్రజల దృష్టిలో బాగా పలచన అయ్యారు. నాలుగు గోడల మధ్య సమావేశాల్లో తప్ప మరెందుకూ పనికిరాని పదవులను వారు ఎందుకు పట్టుకు వేలాడుతున్నారో అర్థం కాదు. లాబీయింగ్ ద్వారానే తెలంగాణ సాధ్యం అన్న వైకరి నుంచి, ప్రజా ఉద్యమాలను అప్పుడప్పుడు తన ప్రాబల్యాన్ని పెంచుకోవడానికి వినియోగిమచుకునే దాకా మారుతూ వచ్చిన తెలంగాణ రాష్ట్ర సమితికి ఇంకా పోరాటం మీద పూర్తి విశ్వాసం కలిగినట్టు కనిపించదు. 'అన్నీ ఆయనకు తెలుసును' అని ప్రధానమంత్రి తెలంగాణ ప్రతినిధి వర్గంతో పదే పదే అన్న మాటలు కెసిఆర్ వైఖరిపై అనేక సందేహాలను కలిగించాయి. ఎన్నికలు వచ్చి, పదే పదే గెలవడం ద్వారానే ప్రాబల్యాన్ని విస్తరించుకోవాలని, 2014 దాకా అదే పద్ధతిలో కొనసాగితేనే ఫలితం ఉంటుందని టిఆర్ఎస్ నమ్ముతోందని అనిపిస్తోంది. తెలంగాణ ఉద్యమంలో టిఆర్ఎస్ ఒకానొక భాగస్వామి మాత్రమేనని, పరిణామాలను శాసించగలిగిన ఇతర రాజకీయ, రాజకీయేతర శక్తులు అనేకం ఉన్నాయని సకల జనుల సమ్మె నిరూపించింది. అన్ని శక్తులను కలుపుకుని మరింత బలమైన సంఘటనగా ఏర్పడడానికి రాజకీయ జెఎసి ప్రయత్నించవలసి ఉన్నది. కోదండరామ్‌ను ఉద్యమశ్రేణులు తగినంతగా గౌరవిస్తున్నప్పటికీ, ఆయన నుంచి మరింత స్వతంత్రమైన, అందరినీ కలుపుకునిపోయే వైఖరిని కూడా వారు ఆశిస్తున్నారు. ■

**– కె.ఎస్.**

19.10.2011, ఆంధ్రజ్యోతి

# విరమణ విద్రోహం కాదు

**– నారదాసు లక్ష్మణ్‌రావు**

**'కెరటం నాకు ఆదర్శం. పడుతున్నందుకు కాదు, పడినా లేచి నిలుస్తున్నందుకు' – శ్రీశ్రీ**

మేమొక సుదీర్ఘ యుద్ధం చేస్తున్నామని తెలుసు. శత్రువు బలమైన వాడని తెలుసు. లక్ష్యం సులభతరమైనది కాదనీ తెలుసు. మేము పయనిస్తున్న దారిలో కత్తుల వంతెనలు దాటాల్సి ఉందని తెలుసు. కుట్రల వైకుంఠ పాళీల్ని ఛేదించాల్సి ఉంటుందని తెలుసు. బాహ్య శత్రువుతో పాటు అంతర్గత శత్రువుతోనూ పోరాడాల్సిన విషాద పరిస్థితి ఉందనీ తెలుసు. అయినా మేం ఈ యుద్ధం చేయాలి. చేసి గెలిచి తీరాలి.

నాటి తొలిదశ ఉద్యమం నుంచి నేటి మలి దశ వరకు వేలాది బిడ్డల్ని కోల్పోయి తెలంగాణ తల్లి యుద్ధభూమిలో నిలబడి రోదిస్తున్నది. ఆ యోధుల్ని గన్న వీరమాతల గర్భశోకానికి ముగింపు పలకాల్సిన బాధ్యత ప్రతి తెలంగాణవాది పైనా ఉంది. నేలకొరిగిన వీరుల స్వప్నాలను సాకారం చేస్తూ, అంతిమ విజయాన్ని వారికి అంకితమివ్వాల్సిన కర్తవ్యం మన అందరిపైనా ఉంది. అందుకే ఈ యుద్ధంలో విజయతీరాలకు చేరే వరకు విరామముంటుంది. కానీ విరమణ ఉండదు. ఎత్తుగడలు మారుతాయి కానీ ఎత్తిన జెండాను దించము. ఒక అడుగు వెనక్కి వేస్తామేమో కానీ వెన్ను చూపడం ఏనాటికీ ఉండదు.

సకల జనుల సమ్మె సత్యాగ్రహ సముద్రాన్ని తలపించే సరికొత్త పోరాట రూపం. ప్రపంచాన స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను కాంక్షించే ఏ ప్రాంత ప్రజలకైనా స్ఫూర్తినిచ్చే చారిత్రక ఉద్యమం. 42 రోజులు కొనసాగిన ఈ సమ్మె సాధించిందేమిటంటే ప్రశ్నతో పాటు, వేరు వేరు వర్గాల వారు వేరే వేరు ప్రయోజనాలతో అనేక ప్రశ్నలు వేస్తున్నారు. ఉద్యమాన్ని నిజాయితీగా నడిపిన వాళ్ళు, అత్యంత విశ్వాసాన్ని కనబరిచిన వాళ్ళు, అనేక త్యాగాలకు సిద్ధపడిన వాళ్ళు ఒక్కసారిగా ఆత్మావలోకనం చేసుకోవాల్సిన ఆవశ్యకత, సమ్మెను విశ్లేషించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తర్కానికి నిలువని ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేకపోయినా, భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకోవడానికైనా విశ్లేషణ అవసరమే.

సకల జనుల సమ్మె యావత్ తెలంగాణ జాతిని ఒక్కతాటిపై నిలిపి, వారి సాహసోపేతమైన పోరాట పటిమను లోకానికి చాటింది. రాజకీయాధికారాన్ని తమ గుప్పిట్లో కేంద్రీకరించుకొని యథేచ్ఛగా సీమాంధ్రులు సాగిస్తున్న దోపిడీని అర్థం చేసుకొని, నిలదీసి, నిగ్గుదేల్చి, ఎదిరించే రాజకీయ చైతన్యాన్ని రగిలించింది. ముఖ్యంగా తెలంగాణవాదం పట్ల నిరాక్షరాస్యులకు కూడా లోతైన అవగాహన కల్పించి, అన్ని వర్గాల ప్రజల్లో భావచైతన్యాన్ని పెంపొందించింది. ఆత్మగౌరవ కాంక్షను నరనరాల్లో నింపింది. స్వార్థ రాజకీయనేతల్ని నగ్నంగా నడి బజారులో నిలబెట్టింది. కేంద్ర ప్రభుత్వంలో ప్రకంపనలు సృష్టించింది. పునాదులు కదిలించింది. ఇక రాష్ట్రాన్ని ఏమాత్రం కలిపి ఉంచే పరిస్థితులు లేవన్న విషయాన్ని తెలంగాణ ఇవ్వాల్సిన అనివార్యతను కేంద్రం గుర్తించేటట్టు చేసింది. ప్రజలకు పార్టీలపై గల భ్రమలను తొలగించేటట్టు చేసింది. నేడు ఒక రాజకీయ డిమాండ్ కోసం సమ్మె చేయడం ద్వారా కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల్లో మానసిక ధైర్యం పెరిగి, వృత్తిపరంగా, వ్యవస్థాపరంగా ఎంతటి దౌర్జన్యాన్నైనా ఎదిరించగల మనోనిబ్బరాన్ని వారి గుండెల నిండా నింపింది. ముఖ్యంగా సామాన్య ప్రజలు ఎవరి

దైనందిన జీవితాల్లో వారు మునిగిపోయిన సందర్భంలో, ఒక లక్ష్య సాధన కోసం ఐక్య సంఘటనగా ఏర్పడి, ఎవరికి వారు సమ్మెలో పాల్గొనడం ద్వారా ఒక సామాజిక బాధ్యతలో భాగస్వాములయ్యే నిబద్ధతను పెంచింది. నాలుగు గోడల మధ్య గడిపిన వ్యక్తిగత జీవితం నుంచి నాలుగు రోడ్ల కూడలిలో గొంతెత్తే చైతన్యాన్ని, అణచివేతకు వ్యతిరేకంగా నలుగురితో కలిసి పిడికిలి పైకెత్తే ధైర్యాన్ని వారిలో నింపి పోరాట శక్తులుగా ఎదిగేట్లు చేసింది. న్యాయమైన తెలంగాణ పోరాటంవైపు ప్రపంచ దృష్టిని మరల్చేట్లు చేసింది.

సమ్మె ఎందుకు విరమించాల్సి వచ్చింది? ఈ ప్రశ్నకు సమాధానాన్ని వెదుక్కొనే సందర్భంలో, ఉద్యమాల స్వరూప స్వభావాలను బుద్ధి జీవులందరూ అవగాహన చేసుకోవాల్సి ఉంటుంది. ఏ ఉద్యమంలోనైనా భావజాల వ్యాప్తిని పటిష్ట నిర్మాణాన్ని చేయడంలో ఎన్ని ఆటుపోట్లు ఉంటాయో, ఉద్యమాన్ని నడిపించి విజయతీరాలకు చేర్చడంలో అంతకు రెట్టింపు ఒడిదొడుకులు, ఆటంకాలు ఉంటాయి. శత్రువు బలబలాల సమీక్షలు, ఎన్నో వ్యూహాలు, మరెన్నో ఎత్తుగడలు, ఒక అడుగు వెనక్కు, రెండు అడుగులు ముందుకు, కొంత విరామం, ఆపై విజృంభణ, అన్నీ పోరాటంలో భాగమే! మిలటరీ భాషలో చెప్పాలంటే, యుద్ధంలో సైన్యం పూర్తిగా లొంగిపోవడమో లేదా తిరిగి యుద్ధం చేసే సంకల్పాన్ని విడనాడడమో మాత్రమే ఓటమి అవుతుంది. కానీ సకల జనుల సమ్మె విరమణ, ఉద్యమంలో స్వల్ప విరామం మాత్రమే. విరమణ విద్రోహం కాదు. ఊపిరి పీల్చుకొని కొత్త శక్తిని నింపుకొని మరో మహా సంగ్రామానికి మనను మనం సన్నద్ధం చేసుకోవడంలో ఓ ఎత్తుగడే ఈ విరమణ. యుద్ధంలో సైన్యాన్ని ముందుకు నడపడమే కాదు, సమయానుకూలంగా వెనక్కు మరల్చే విజ్ఞత కూడా అవసరమే. ఆ విజ్ఞత చూపక పోవడంవల్లే చరిత్రలో నెపోలియన్, హిట్లర్ లాంటి మహాశక్తిమంతుల సేనలు కూడా మట్టికరవక తప్పని పరిస్థితి వచ్చింది. ఉద్యమాన్ని నడిపే వారికి, ఉద్యమంలో పాల్గొనే వారి శ్రేయస్సు గురించి ఆలోచించాల్సిన ప్రధాన బాధ్యత కూడా ఉంటుందని మరువకూడదు. కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు తెగించి కొట్లాడారు. అయితే ప్రధాన భూమిక పోషించవలసిన తెలంగాణ రాజకీయ నేతలు అవకాశవాదంతో, వంచనతో, ఉద్యమకారులను నడిరోడ్డుపై దిక్కుతోచని సంక్లిష్ట స్థితిలోకి నెట్టివేశారు. ఆర్టీసీ, సింగరేణి కార్మికుల భవితవ్యం, ఉద్యోగ, ఉపాధ్యాయుల శ్రేయస్సు దృష్టిలో ఉంచుకొనే సమ్మె విరమించాల్సి వచ్చింది.

జపాన్‌కు వ్యతిరేకంగా చైనా సాగించిన యుద్ధంకానీ, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా సాగిన భారత జాతీయోద్యమం కానీ, దీర్ఘకాలికంగా నడిచాయేకానీ, నిరంతరంగా, విరామం లేకుండా సాగినవి కావు. దీర్ఘకాలిక యుద్ధం, సరియైన వ్యూహం, ఎత్తుగడల ద్వారా, ఆంధ్రప్రదేశ్ కన్నా చిన్నదైన వియత్నాం, అగ్రరాజ్యమైన అమెరికాను ఓడించగలిగింది. ఇక్కడ అర్థం చేసుకోవలసిన విషయాలు కొన్ని ఉన్నాయి. రాజకీయాల కొనసాగించే యుద్ధం, రక్తపాతం లేని యుద్ధమే రాజకీయాలు. యుద్ధ సూత్రాలు తెలంగాణ సాధన కోసం జరిగే పోరాటానికి పూర్తిగా అన్వయించడం సాధ్యం కాదు. ప్రాచీన చైనా మిలటరీ యుద్ధ సిద్ధాంతకర్త సన్ జూ తన పుస్తకం (శీనీలి బిజీశి ళితీ గీబిజీ) లో చెప్పినట్లు శత్రువును అర్థం చేసుకొని, తనను తాను సరిగా అర్థం చేసుకుంటే, వంద యుద్ధాలైనా ఓటమి లేకుండా గెలువవచ్చు.

మొండిగా, మూర్ఖంగా ముందుకు సాగి ప్రజానీకాన్ని కష్టనష్టాల పాలు చేసి ఉద్యమ లక్ష్యాలను దెబ్బ తీయవద్దు. ముఖ్యంగా అవకాశవాదులు, ఉద్యమంలోని దుందుడుకు వాదులు, శత్రువుతో పాటు అవహేళనలకు, దుర్మార్గపు ప్రచారానికి పాల్పడతారు. అయినా ఏమాత్రం ఆవేశపడకుండా జాగ్రత్తగా వ్యవహరించాలి. ఉద్యమంలో పోరాట రూపాలను ప్రజలే ఆవిష్కరిస్తారు. ఆవిధంగా ఆవిష్కరించిన పోరాట రూపాలను ఉద్యమ నాయకత్వం ఉపయోగించుకోవాలి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం పోరాటం చేస్తున్న జేఏసీ నాయకత్వం ఈ ఉద్యమ సూత్రాలన్నింటిని జాగ్రత్తగా అమలు చేస్తూ ముందుకు సాగుతున్నది.

లెనిన్ మాటల్లో చెప్పాలంటే, ఏ ఉద్యమమైనా అంతర్గత ద్రోహాన్ని ఎదిరించి ముందుకు సాగినపుడు అది గెలిచినట్టే లెఖ్క. ఆర్టీసీ సమ్మె విచ్ఛిన్నానికి పోలీసు ఎస్కార్ట్‌తో బస్సులు నడిపినా, ఒక్క ప్రయాణీకుడూ ఎక్కకుండా తిరస్కరించారు. సింగరేణిలో ఒక్క మస్టర్‌కు 2, 3 అదనపు మస్టర్లు బోనస్‌గా ఇస్తామన్నా, ఒక బొగ్గుపెల్లా

పెగలలేదు. ఎన్ని భయాందోళనల ప్రకటనలు గుప్పించినా, డీజీపీ హెలికాప్టర్‌లో పర్యవేక్షించినా పట్టాలపై రైళ్ళు పరుగెత్తనే లేదు. ఇదంతా సమ్మె నైతిక విజయంకాదా? 1905లో రష్యాలో జార్ చక్రవర్తికి వ్యతిరేకంగా కార్మిక వర్గం తిరుగుబాటు చేస్తే మద్దతు తెలిసిన రైతులు, సైనికులు, 1917లో జరిగిన అక్టోబర్ మహావిప్లవంలో ప్రత్యక్షంగా పాల్గొని చరిత్రను సృష్టించారు. ఇప్పుడు కూడా ఈ సకల జనుల సమ్మె విరమించినా ఈ పోరాట స్ఫూర్తితో రేపు జరుగబోవు మరో ఉద్యమంలోకి మరిన్ని శక్తులు వచ్చిచేరి తెలంగాణను తప్పక సాధిస్తాయి. రాబోవు మహా ఉద్యమానికి ప్రేరణగా నిలబడటమే సకల జనుల సమ్మె సాధించిన విజయం.

శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా, ఇంత పెద్ద ఎత్తున జరిగిన సమ్మె పట్ల ప్రజల ఆకాంక్షల పట్ల ఏమాత్రం స్పందించని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గానీ, సీమాంధ్ర నేతల కుయుక్తులను గానీ, తెలంగాణ ప్రాంత మంత్రులు ఎమ్మెల్యేల నీచ రాజకీయాలను గానీ విమర్శించకుండా సమ్మెలో మమేకమైన సకల జనుల ప్రయోజనాల రీత్యా సమ్మె విరమించిన ఉద్యమకారులపై కొందరు స్వార్థపరులు విమర్శలు గుప్పించడం వెనుక ఎవరి స్వార్థం ఎంత ఉందో తెలంగాణ సమాజం గుర్తిస్తునే ఉంది. ఈ సమ్మె విఘాతం వెనుక ఎవరెవరి కుట్రలు ఎంత ఉన్నాయో అన్నీ ప్రజల మెదళ్ళలో నిక్షిప్తమై ఉన్నాయి. సమయమొచ్చినప్పుడు ప్రతీకారం తీర్చుకోక తప్పదు.


ప్రపంచ ఉద్యమాల్లో నాటి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం తరువాత నేటి సకల జనుల సమ్మె చరిత్రలో తన అత్యున్నత స్థానాన్ని పదిలపర్చుకొంది. ఇప్పుడు ఈ ఉద్యమంలో అడుగులు కలిపిన ప్రతిబిడ్డా నేతల దగాకోరు తనంతో గాయపడ్డ పులి బిడ్డ. ఆంధ్ర సర్కారు కసికొద్దీ కరెంటు సరఫరా చేయకపోవడం వల్ల పంటలు ఎండి పోయినా రైతులు ఉద్యమానికి మద్దతు తెలిపారు. పండుగలను, సంబురాలను త్యాగం చేసి సమ్మెకు ఊపిరి ఊదారు. కార్మికుల జీతాలను పణంగా పెట్టి ఉద్యమించారు. కేసులకు భయపడక సమ్మెకు అంకితమయింది మా ఉద్యోగులు, ఉపాధ్యాయులు. వీరి త్యాగం వృథా కాదు. నేతల మోసం మాసిపోదు. లెక్క తేల్చుకోక తప్పదు. మీ మోసానికి వడ్డీతో సహా మూల్యం చెల్లించుకోక తప్పదు.

సకల జనుల సమ్మెకు విద్రోహం చేసిన ద్రోహులందరికీ మాదొక్కటే సమాధానం. ఈ నేలపై దౌర్జన్యం పరాకాష్టకు చేరినప్పుడల్లా, చీమల దండులా కదలి పామును చంపిన చైతన్యం కలిగిన వాళ్ళం. అల్లకల్లోల పరిస్థితిలోంచే ఆశయాలను రూపొందించుకుంటున్న వాళ్ళం. అణచివేత అధికమయినప్పుడల్లా ఆయుధాన్ని ఆసరాగా చేసుకున్న వాళ్ళం. అలజడి మా జీవితం, ఆందోళన మా ఊపిరి, తిరుగుబాటు మా వేదాంతంగా అలవర్చుకున్న వాళ్ళం. శత్రువు మాపై యుద్ధం ప్రకటించిన ప్రతిసారీ, ఈ మట్టిలోని తడి ఆరని నెత్తురు మాకు కర్తవ్యబోధ చేస్తూనే ఉంటుంది. మమ్మల్ని విజయ తీరాలకు చేరుస్తూనే ఉంటుంది. ■

**– నారదాసు లక్ష్మణ్‌రావు**

ఎం.ఎల్.సి, తెలంగాణ రాష్ట్రసమితి నాయకులు

28–10–11, నమస్తే తెలంగాణ



*సకల జనుల సమ్మెకు విద్యుత్ ఉద్యోగుల శంఖారావం.*
*తేది: 20-9-2011.*



*సకల జనుల సమ్మెలో భాగంగా రాంనగర్‌లో వినూత్న నిరసన.*
*తేది : 20-9-2011.*

# సకల జనులకు నీరాజనం

**– ఎన్. వేణుగోపాల్**

సకల జనుల సమ్మెలో భాగంగా చరిత్రాత్మకమైన, విశిష్టమైన, నిర్ణయాత్మకమైన పోరాటం సాగిస్తున్న తెలంగాణ కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు నీరాజనం. ప్రత్యేకంగా హైదరాబాద్, ఢిల్లీ మాయల మరాఠీల ప్రాణాలు గోదావరి లోయ భూగర్భంలోనూ, ఆర్థిక ప్రయోజనాలలోనూ ఉన్నాయని గుర్తించి అక్కడి చిలుకను పట్టుకుంటున్న సింగరేణి కార్మిక వర్గానికీ, ఇతర కార్మిక, ఉద్యోగ సోదరులకూ జేజేలు.

తొమ్మిది రోజులుగా తెలంగాణ ప్రజలు ప్రదర్శిస్తున్న ఈ సమరశీల పోరాట స్ఫూర్తి అద్భుతంగా, ఉత్సాహభరితంగా, ఆశాసూచికగా ఉన్నది. తెలంగాణ ప్రజా ఉద్యమం ఆరు దశాబ్దాల ఆకాంక్షల వ్యక్తీకరణలూ, ఐక్యతా ప్రదర్శనలూ, నిరసన ప్రకటనలూ దాటి సెప్టెంబర్ 13న ఒక మలుపు తిరిగి సకల జనుల సమ్మెగా ప్రతిఘటనా మార్గాన్ని చేపట్టింది. ఈ ప్రతిఘటన ఇప్పటికే తెలంగాణ వైరి వర్గాలలో భూకంపం పుట్టిస్తున్నది. మహా ఘనత వహించిన ముఖ్యమంత్రి వర్యులు సచివాలయంలోకి దొడ్డిదారిన ప్రవేశించిన ఘట్టం ఆర్తనాదములు శ్రవణానందకరముగనున్నవి అని మాయాబజార్ ఘటోత్కచుడు అన్నట్టు కనులవిందుగా ఉన్నది.

ఈ అద్భుత, అపూర్వ సన్నివేశంలో మరచిపోకుండా గుర్తించవలసిన, ఎత్తిపట్టవలసిన అంశాలు కొన్ని ఉన్నాయి. అవి గుర్తించి, విస్తరించినప్పుడు మాత్రమే, ఉన్నతీకరించినప్పుడు మాత్రమే తెలంగాణ స్వప్నం సాకారమయే దిశలో మరొక ముందడుగు వేయగలుగుతాం. సకల జనుల సమ్మె ప్రారంభంలో అది ఏమిటి, ఎలా జరగాలి, సకల జనులంటే ఎవరు, కార్యక్రమం ఎలా ఉంటుంది లాంటి ప్రశ్నలతో గందరగోళ స్థితి కొంత ఉండింది. బహుశా ఆ కారణం వల్లనే అనుకున్న సమయానికి ప్రారంభం కాకపోవడం, వాయిదా పడడం జరిగింది కాని ఆ కృత్యాద్యవస్థను దాటి సకల జనుల సమ్మె సెప్టెంబర్ 13న 65,000 మంది సింగరేణి కార్మికుల సమ్మెతో, నాలుగున్నర లక్షల రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల సమ్మెతో ప్రారంభం కావడం అద్భుతమైన నాంది. ఎందుకంటే తెలంగాణ ప్రత్యేక అడ్డంకిగా ఉన్న శక్తుల ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీయకుండా పోరాటం ముందుకు కదలడం సాధ్యం కాదని తెలిసిన స్థితిలో సింగరేణి సమ్మె ఆ పనిని సాధించింది. సింగరేణి విశిష్టమైనది, ప్రత్యేకమైనది. అది దక్షిణ భారత దేశం మొత్తంలో ఏకైక బొగ్గు గని. వందలాది ప్రభుత్వ, ప్రైవేటు విద్యుదుత్పత్తి కేంద్రాలకు, పరిశ్రమలకు బొగ్గు సరఫరా చేసే గని. నాలుగు జిల్లాలు వ్యాపించిన, లక్ష కుటుంబాల జీవనాధారమైన విశాలమైన బొగ్గు గని. కనీసం ఏడు దశాబ్దాలుగా వీరోచితమైన పోరాట సంప్రదాయం ఉన్న గని అది మూతబడితే ఆ మేరకు ప్రభుత్వానికీ, పరిశ్రమలకూ, కాంట్రాక్టర్లకూ గంగవెర్రులెత్తుతాయి. అందువల్లనే సింగరేణి కార్మికులు, వారితో పాటు రాష్ట్ర ప్రభుత్వోద్యుగులు సమ్మెలో దిగడం ప్రభుత్వాన్ని స్తంభింపజెసింది.

తర్వాత ఒక్కొక్కరుగా థియేటర్ కార్మికులు, ఒక లక్షా డెబ్బైవేల మంది ఉపాధ్యాయులు, అరవై వేల మంది ఆర్‌టిసి కార్మికులు, రెంటు లక్షల మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, విద్యుత్ ఉద్యోగులు, వేలాదిగా అనేక ఇతర వర్గాల ఉద్యోగులు, ఆటో డ్రైవర్లు, పారిశుధ్య కార్మికులు, న్యాయవాదులు, విద్యార్థులు కూడ సకల జనుల సమ్మెలో దిగడం రాష్ట్ర ప్రభుత్వానికి ఇది సరైన శిక్ష.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో సింగరేణి, ఆర్‌టిసి, విద్యుత్తు మూడు రంగాలూ అతి ప్రధాన స్థానంలో ఉన్నాయి. ఈ మూడు రంగాలలో ప్రతిష్టంభన ఏర్పడితే మొత్తం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థే దెబ్బతింటుంది. రాష్ట్ర ప్రభుత్వ మనుగడే ప్రశ్నార్థకమవుతుంది. అలా రాష్ట్ర ప్రభుత్వం సంక్షోభంలో పడినప్పుడే తెలంగాణ ఆకాంక్షలను గౌరవిమచడం, తానే 2009 డిసెంబర్ 9న చేసిన వాగ్దానాన్ని అమలుపరచడం ఎంత అవసరమో కేంద్ర

ప్రభుత్వానికి తెలిసి వస్తుంది. అందువల్ల ఈ అపురూప పోరాటాన్ని సమర్థించచడం, ఎత్తిపట్టడం, అది ఆగిపోకుండా చూడడం, దాన్ని విస్తరించడం, దాని మీద అమలవుతున్న భయంకరమైన, చట్ట వ్యతిరేకమైన నిర్బంధాన్ని ఖండించడం ఇవాళ ప్రతి తెలంగాణ బిడ్డ బాధ్యత. తెలంగాణకు బయటి ప్రజాస్వామిక వాదుల బాధ్యత.

అట్లాగే ఒక విశాల ప్రజా ఉద్యమంలో కార్మికవర్గ పాత్ర ఎంత కీలకమైనదో కూడ సకల జనుల సమ్మె స్పష్టంగా చూపుతున్నది. కార్మిక వర్గం ప్రత్యక్షంగా పాలకుల మనుగడకు అవసరమైన ఆర్థిక మూలాలను అందజేస్తుంది గనుక కార్మికవర్గం తన పని ఆపితే ఏలినవారి ప్రాణవాయువు నిలిచిపోతుంది. కార్మికవర్గ నిరంతర శ్రమమీదనె ఏలినవారి పటాటోపమంతా ఆధారపడి ఉంది గనుక ఆ కార్మికవర్గం కళ్ళెర్రజేస్తే ఏలినవారి అధికారచక్రం కీచుమంటూ ఆగిపోతుంది. ప్రపంచ చరిత్రలో ఎన్నోసార్లు రుజువైన ఈ సత్యాన్ని తెలంగాణ నడిబొడ్డు మీద తెలంగాణ బిడ్డలు మరొకసారి ప్రకటిస్తున్నారు.

అయితే ఇప్పటికి సకల జనుల సమ్మెది పాక్షిక విజయమే. ఇది సంపూర్ణ విజయం దిశగా పయనించాలంటే ఇవాళ సకల జనుల సమ్మెలో పాల్గొంటున్న దాదాపు పది లక్షల మంది కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ, అసంఘటిత రంగ సోదరులతో మిగిలిన నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజలు చెయ్యీ చెయ్యీ కలపవలసి ఉంది. ప్రతి ఒక్క తెలంగాణ బిడ్డా తన వంతుగా ఏమి చేయగలిగితే అది చేయవలసి ఉంది.

ఇది ఇంకా పాక్షిక విజయమే అనడం ఎందువల్లనంటే తెలంగాన ప్రత్యర్థులు నలుగురుండగా అందులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అనే ఒక్క ప్రత్యర్థి మీద మాత్రమే సకల జనుల సమ్మె ప్రభావం ఉన్నది. మిగిలిన ముగ్గురు ప్రత్యర్థులు భారత ప్రభుత్వం; కోస్తాంధ్ర, రాయలసీమ కుబేరులు; తెలంగాణ దళారులు కూడ దిగివచ్చే పోరాట రూపాలను తెలంగాణ ప్రజలు చేపట్టినప్పుడే సకల జనుల సమ్మె సార్థకమవుతుంది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష సాకారమవుతుంది. ఈ ముగ్గురు ప్రత్యర్థుల రాజకీయ ఆర్థిక ప్రయోజనాలను అడుగడుగునా అడ్డుకోవడమే, తద్వారా వారిని లొంగదీయడమే ఇవాళ్టి కర్తవ్యం.

తెలంగాణలో ఉన్న, తెలంగాణ మీదుగా వెళ్తున్న కేంద్ర ప్రభుత్వ సేవలను, సంస్థలను, వ్యాపారాలను కూడ అడ్డుకుని, డిసెంబర్ 9 ప్రకటన అమలు చేసేవరకూ కెంద్ర ప్రభుత్వ ఆర్థిక ప్రయోజనాలు కూడ అడ్డుకుందామని ప్రకటించవలసి ఉంది. అలాగే కోస్తాంధ్ర, రాయలసీమ వ్యాపారులు తెలంగాణ వనరులను కొల్లగొట్టి కుబేరులయి, రాజకీయాలలోకి దిగారు. వారి రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలు తెలంగాణలో ఇక చెల్లవని అడుగడుగునా ప్రకటించవలసి ఉంది. ప్రతిఘటించవలసి ఉంది. తెలంగాణను వ్యతిరేకిస్తున్న, తెలంగాణ పట్ల అవకాశవాదం నడుపుతున్న రాజకీయ నాయకుల రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలు ఇక నెరవేరనివ్వబోమని ప్రతిఘటించవలసి ఉంది. అదే విధంగా తెలంగాణలో పుట్టి కూడ తెలంగాణ వ్యతిరేకులుగా, ద్రోహులుగా ఉన్నవారి రాజకియ, ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీయడం ప్రారంభించినప్పుడే వారు దారికి రాగలరు. ఈ పనులన్నీ తెలంగాణలోని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులూ, తెలంగాణ ప్రజలూ ఎక్కడికక్కడ చేయవచ్చు.

ఇటువంటి విస్తృతమైన సకల జనుల సమ్మెలో ప్రతి మనిషికీ పాత్ర ఉమది. ఆ పాత్ర నిర్వహించడం ద్వారానే సింగరేణి, ఆర్‌టిసి, విద్యుత్, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమ్మెను బలోపేతం చేయగలుగుతాం. అప్పుడు మాత్రమే వారి మీద సాగుతున్న అమానుష నిర్బంధాన్ని తగ్గించగలుగుతాం. అప్పుడు మాత్రమే తెలంగాణ రాష్ట్ర సాధనకు దగ్గరవుతాం. ■

23.09.2011, నమస్తే తెలంగాణ

**– ఎన్. వేణుగోపాల్**

వీక్షణం సంపాదకులు

# తెలంగాణ సకలజనుల సమ్మె అంటే సర్వజనుల ఉద్యమమే

**– చిక్కుడు ప్రభాకర్**

ఉద్యమం తీవ్రస్థాయిలో ఉన్నది. నాయకత్వ శక్తులు విడివిడిగా ఉన్నాయి. ఇప్పటికే తెలంగాణ ముద్దు బిడ్డలు దాదాపు 600పై చిలుకు అసువులు బాసారు. రాష్ట్రం ఏర్పడదనే నిస్పృహతో ఇంకా ఆత్మహత్యలు కొనసాగుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాలేదు. కాని, కెసిఆర్ కుటుంబానికి అన్ని వనరులు సమకూరినాయి. ప్రజాపోరాటం సకలజనుల సమ్మె రూపంలో రాష్ట్ర ఏర్పాటుకు ఒక డిమాండ్‌గా ముందుకు వచ్చింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమం నాలుగుకోట్ల ప్రజల కర్తవ్యాన్ని మరోకసారి గుర్తు చేస్తూ, నవంబర్ 30,2009 నాటి స్ఫూర్తిని ప్రదర్శించండంటూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కొరకు అసువులు బాసిన అమరుల ఆశయాలు గుర్తు చేస్తున్న తరుణంలో నేను రాసిన వ్యాసం ఆగస్టు16న, ప్రచురించబడింది. నా రాజకీయ అవగాహనకు అనుగుణంగా వందలాది అమరులు తెలంగాణ గడ్డ మీద తమ రక్తాన్ని అర్పించి తెలంగాణ ప్రాంతంలో ఒక కారంచేడు, చుండూరు, నీరుకొండ, వెంపెంట జరుగకుండ తమ ప్రాణలను తృణపాయంగా భావించినారు. తెలంగాణలో దొరల,బడాపెట్టుబడిదారుల, పాలేగాళ్ళ రాజ్యం రాకుండ ఎలా పోరాటం చేశారో వివరిస్తూ, "ప్రత్యేక ప్రజాస్వామిక తెలంగాణ స్ఫూర్తితోనే తెలంగాణ ఐక్యకార్యచరణ కమిటీ అగ్రనాయకునిగా,తెలంగాణ జె.ఎ.సిల సమన్వయ ఫ్రంట్ నాయకునిగా, తెలంగాణ ప్రజాఫ్రంట్ కార్యదర్శిగా నిజమయిన సామాజిక, ప్రజాస్వామిక స్ఫూర్తి తోనే ఆ వ్యాసం రాశాను.అలాగే నేను 'తొలి మెట్టు' 'ముందు షరతు' అన్నాను కాని భౌగోళిక తెలంగాణలోనే అన్ని సాధ్యమయితాయి అని అనలేదు.అననివి అన్నట్లు ఊహించుకోవడం ఆ వ్యాసంలో ఉన్న "భౌతిక వాస్తవికతకు" దూరంగా ఆలోచించడమే అవుతుంది. ఏ ఉద్యమానికైన అంతిమ లక్ష్యసాధనకు నిర్ధిష్ట ఎత్తు గడలుంటాయి, అందులో తొలి లక్ష్యమైన మొదటి మెట్టులో భాగమే "సకల జనుల సమ్మె"గా ఇప్పటికీ కట్టు బడివున్నాను.

అలాగే నాటి నా వ్యాసంలో 3వ పేరలో కిందనుండి 9వ లైన్‌లో చిన్న అచ్చు పొరపాటు జరిగింది. "తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అడ్డుపడడమంటే, తెలంగాణ 90 శాతం ప్రజలు హుందాగా జీవించాడానికి అడ్డుపడడమే" అని చదువుకోవాలని పాఠకులను కోరుతున్నాను.

అయితే ఆగస్టు19న, మిత్రులు ఉ.సాంబశివరావు, ఆగస్టు 29న మిత్రులు డా॥జిలకర శ్రీనివాస్ గారు మరియు సెప్టెంబర్ 6న మిత్రులు పావని నాగరాజు, వెంకటనారాయణ గార్లు నా వ్యాసానికి స్పందన గారాసిన వ్యాసాలలోని రూపం–సారం చూసిన తరువాత స్పందిస్తున్నాను."వేయి ఆలోచనలు సంఘర్షించని, నూరుపూలు వికసించని" అనే సూక్తికి కట్టుబడి ఆచరణలో అగ్రభాగాన నిలబడి ముందుకు పోతున్నాను. ఏ విషయాన్నైనా, సమగ్ర పరిశీలనచేసి స్వీయత్మకతకు గురికాకుండా, వస్తుగతంగా విశ్లేషణ చేయడమే మార్క్సిస్టు విశ్లేషణ అంటారు. కాని పై మిత్రుల విశ్లేషణ అందుకు విరుద్దంగా ఉన్నది. ఉద్యమం యొక్క తొలి ఫలితాలు, అంతిమ ఫలితాలు ఉన్నట్లే, ఉద్యమ తొలి లక్ష్యం, అంతిమ లక్ష్యం ఉంటుంది. అంతిమ లక్ష్యం యొక్క ఫలితానికి తొలి లక్ష్యం ముందుషరతుగా ఉంటుంది తప్ప, దశల సిద్ధాంతం చెప్పడం లేదు. రూపం–సారం రెండు సమగ్రంగా పరిశీలించినప్పడే ఆ విషయంపైన సమగ్ర అవగహనగా ఉంటుంది. ఈ ఏప్రిల్ నెలలో సీమాంధ్ర భూస్వామ్య

పెట్టుబడి దారులతో కుమ్మక్కయిన ఈ ప్రాంత సూడో సామాజిక వాదంలో అగ్రభాగన నిలబడుతున్న మంత్రులు, డిప్యూట్ స్పీకర్,ఎంపీలు,ఎంఎల్ఏలు, ఇంకొందరు చోటమోట నాయకులు కొందరు కేంద్రం లోని తెలంగాణ వ్యతిరేక శక్తులను కలిసి అభివృద్ధి చెందిన తెలంగాణ కావాలని, దొరల తెలంగాణ వద్దని, ఇస్తేగిస్తే సామాజిక తెలంగాణ ఇవ్వాలనే వితండ వాదంతో తెలంగాణ ఉద్యమానికి చిచ్చుపెట్టి ప్రయత్నం చేశారు. ఈ వార్త ఆంధ్రజ్యోతి దినపత్రికలో కూడా ప్రచరించబడింది. ఇందులో భాగంగానే మంత్రి రాజనర్సింహ్మాకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వడం జరిగింది.తెలంగాణ సంబంధించిన పార్లమెంటు సభ్యులందరు రాజీనామా చేసినా మల్కాజిగిరి లోక్‌సభ సభ్యుడు సర్వేసత్యనారయణ రాజీనామ చేయకపోవడం, జైపాల్ రెడ్డి వంటి వారు కూడా రాజీనామా చేయక పోవడం ఇందులో భాగమే అనే విషయం తెలంగాణ ప్రజలందరు గ్రహించారు. వారి బాటనే నడిచే 'కొందరు' సామాజిక తెలంగాణ ఉద్యమకారుల్లాగా ముందుకు వచ్చి ఇపుడు తెలంగాణ కనుక వస్తే సామాజిక తెలంగాణ రావాలి అని అంటున్నారు.దొరల తెలంగాణ వద్దని అనడం వెనక తెలంగాణ రాకుండా అడ్డుపడే కుట్ర దాగి ఉన్నది. నిజమయిన సామాజిక పునాది కలిగిన 'ప్రత్యేక ప్రజాస్వామిక తెలంగాణ' లోనే సామాజిక కులాలకు న్యాయం జరుగుతుందని, నిజమయిన సామాజిక పునాది భావజాలాన్ని విస్తృతంగా ఉద్యమంలో చొప్పిస్తూ, నిర్మాణంలోనూ ఈ విషయాన్ని అగ్రభాగన నిలబెడుతూ ఉద్యమ క్రమాన్ని కొనసాగిస్తున్నాం. తెలంగాణ ఉద్యమంలో ప్రతి మలుపును సమగ్రంగా పరిశీలించి ఉద్యమ ఉధృతికి పాటుపడుతున్నాం. ఉద్యమంలో గత కొద్ది సంవత్సరాలుగా వస్తున్న మితవాద అవకాశవాద, అతివాద దుందుడుకు విధానాలను, ఉద్యమ వ్యతిరేక ధోరణులను స్పష్టంగా వ్యతిరేకిస్తూ నిర్ధిష్ట కార్యాచరణతో ముందుకు పోతున్నాం. అందులో భాగమే నాడు నేను రాసిన వ్యాసం కూడా. ఇక ఊ.సా. గారు నేను టి.వి. చర్చలో చెప్పిన విషయానికి నేను రాసిన వ్యాసానికి భిన్నంగా ఉన్నట్లు రాసారు. నాడు తెలంగాణ ఐక్యకార్యాచరణ కమిటీ అనే 'ఐక్య సంఘటన' ఏర్పాటులో ఉద్యమ మౌళిక అంశాలయిన "తెలంగాణ వనరుల రక్షణ – తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు" కొరకు ఉద్యమం చేయాలని నిర్ణయించుకుని ముందుకు పోతూ, తెలంగాణ జెఏసిల సమన్వయ ఫ్రంటు లోను, తెలంగాణ ప్రజాఫ్రంట్ ఏర్పాటులోను అదే విషయం కొనసాగిస్తూ, సామాజిక న్యాయ పునాదిని పతిష్ట పర్చుకుంటూ వరంగల్ డిక్లరేషన్ స్ఫూర్తిని కొనసాగిస్తూనే, చేతనైనంతగా ఉద్యమానికి నాయకత్వం వహించే ప్రయత్నం చేస్తున్నాను తప్ప, ఊ.సా.గారంత సమయస్ఫూర్తి కలిగిలేను. అలాగే ఆయన వాదిస్తున్న సామాజిక న్యాయాన్ని అర్థం చేసుకోగలను. ఊ.సా. గారు అమరుడు మారోజు వీరన్నకు సన్నిహితులుగా పదే పదే తన రచనలలో పేర్కొంటారు. ఆయన అనుసరించిన సిద్ధాంతాన్నే ఇప్పటికి అమలు పర్చుతున్నాను అంటారు. కాని ఆ స్ఫూర్తి కూడ తన స్పందనలో ప్రదర్శించ లేక పోయారు.అమరుడు మారోజు వీరన్న "ప్రపంచమంత సమతా మానవుడు ఉద్భవించాలని కలలుకన్నారు. ఆకళలకు సాకరమిచ్చే ప్రపంచ సోషలిస్టు విప్లవంలో భాగంగ ఈ దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవం సాధించాలనుకున్నారు. అదిసాధించాలంటే హిందు అగ్రవర్ణ బ్రహ్మణీయ ఆధిపత్య భావజాల భూస్వామ్యాన్ని తొలగించాలని ఇక్కడి స్థల, కాల పరిస్థితులకు అనుగుణంగా ఎం.ఎల్.ఎం ను జోడించాలని చెబుతూ లక్ష్యసాధనకు సంపూర్ణ ఎత్తుగడలు రూపొం దించుకునే సమయంలో అమరుడయ్యారు.ఆయనంటే మాకు ఆపారమైన గౌరవం ఉన్నది. కాని, ఆయన బతికుండగా విడుదల చేసిన సూర్యపేట డిక్లరేషన్‌కు, ఊ.సా. గారి నాయకత్వంలో జనవరి 21, 2010న విడుదల చేసిన హైద్రాబాద్ డిక్లరేషన్‌కు వ్యత్యాసంఉంది. హైద్రాబాద్ డిక్లరేషన్ లోని 14వ పేజీలో "ఉత్తర ప్రదేశ్‌ను మూడు రాష్ట్రాలుగా విభజించడానికి ఇటీవల కాంగ్రెస్ వేసిన అగ్రకుల రాజకీయ ఎత్తుగడల్ని చిత్తు చేయడానికి మాయావతి సారథ్యం లోని బీఎస్పీ మూడు రాష్ట్రాల ఏర్పాటుకు సిద్ధమేనని గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇదే కార్యరూపం దాల్చితే ఏకకాలంలో మూడు చోట్ల భోగోళిక రాష్ట్రాలతో పాటు బహుజన రాష్ట్రాలు కూడా ఏర్పడుతాయి. 'యథా నాయక తథా ఉద్యమం' అన్నట్లు 1996లో శ్రామిక దళిత బహుజన సామాజిక తెలంగాణవాదుల సారథ్యంలో ఉద్యమం మొదలైంది. గనుక ఆ ఉద్యమం భౌగోళిక, సామాజిక, ప్రజాస్వామిక తెలంగాణ ఉద్యమంగా నడిచింది. వారి

సారథ్యంలోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే, అది సామాజిక తెలంగాణ ప్రజారాజ్యం గానే ఆవిర్భవిస్తుంది". అలాగే 18వ పేజీలో "గతంలో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం, తెలంగాణలో సామాజిక న్యాయం కోసం ఉద్యమించిన ప్రజా ఉద్యమ శక్తులు రాజకీయ శక్తులుగా మారకపోవడం, మారిన శక్తుల్ని ఎదగనీయకపోవడం, అణచివేతకు గురి కావడం వలన ప్రత్యామ్నాయ రాజకీయరంగంలో శూన్యం ఏర్పడింది". ఇంకా ఇదే పేజీలో "ఒక వైపు ప్రజా ఉద్యమ శక్తులు ముందుకు తెచ్చిన భౌగోళిక – సామాజిక తెలంగాణ ఉమ్మడి ఎజెండాని స్వీకరించకుండా, కనీసం రాజకీయ రంగంలో వారి ఆకాంక్షల్ని నెరవేర్చేందుకు చర్యలు చేపట్టకుండా నూతన రాజకీయ శక్తులు (నవ తెలంగాణ, ప్రజారాజ్యం) తాను ప్రతిపాదించిన సామాజిక న్యాయ ఎజెండాను స్వంతం చేసుకొని అధికారంలోకి రాలేకపోయాయని తెగబాధపడిన మిత్రులు ఊ.సా. గారి సిద్ధాంతం ద్వారా తెలంగాణ ప్రజలకు ఒరిగేదేమీ లేదు. కేసీఆర్ తెలంగాణ పేరు మీద ఓట్లు–నోట్లు దండుకున్నది వాస్తవం. ఈయన లాగే ఒక దేవేందర్ గౌడ్, చిరంజీవిలు కూడా రెండు దన్నుకుని అధికారంలోకి వస్తే మాత్రం ఇటు తెలంగాణ లోని, అటు సీమాంధ్ర లోని అణగారిన, వెనుకబడిన కులాలకు, మైనారిటీలకు దక్కేది ఏమీ లేదు. గతంలో 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం' అనే ఈ వర్గవాది సిద్ధాంతం ఇటు తెలంగాణ ప్రజలకు, అటు సీమాంధ్ర ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదు. ఈ సిద్ధాంతమే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పేరు మీద సీమాంధ్ర అగ్రవర్ణ భూస్వామ్య పెట్టుబడిదారులకు స్వర్గధామంను ఏర్పాటు చేసింది. రెండు ప్రాంతాల్లోని సకల వనరులు దోచుకొని అంతర్జాతీయ సామ్రాజ్యవాదంతో, బడా పెట్టుబడిదారులతో కుమ్మక్కయి ఇటు తెలంగాణలో, అటు సీమాంధ్రలో మొలకెత్తిన ప్రతీ ప్రజాఉద్యమాన్ని నాశనం చేసింది. అలాగే నేడు ఊ.సా. గారు చెపుతున్న ప్రత్యేక తెలంగాణలో ప్రజారాజ్యం సిద్ధాంతం తెలంగాణలోని దళిత, వెనుకబడిన, మైనారిటీలకు ఎటువంటి ప్రయోజనం ఉండకపోగా, ఆయా సామాజిక కులాల లోని ప్రజలను దోచి అధికారం లోకి వచ్చిన, వస్తున్న వారికీ ఉపయోగపడుతుంది.

డాక్టర్ జిలకర శ్రీనివాస్ గారు పాలకవర్గంలోని శక్తులను, ప్రజా ఉద్యమ శక్తులను ఒకే గాటన కట్టే ప్రయత్నం చేస్తూ, తాను పాలకవర్గాల పంచన చేరిన శక్తులను మోసే ప్రయత్నం చేస్తున్నారు. తను మోస్తే తనకు సంతృప్తి కావచ్చు కానీ, తన జాతి మొత్తం మోస్తుంది అని కితాబునివ్వడం గతంను, వర్తమానంను, భవిష్యత్‌ను నిరాకరించడమే అవుతుంది. నేను పైన చెప్పినట్లు తెలంగాణ నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్షగా ముందుకు వచ్చిన "సకల జనుల సమ్మె"లో పాల్గొని దళిత, వెనుకబడిన, మైనారిటీలకు చెందిన హక్కుల రక్షణ ఉద్యమించడం ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది అని అన్నాను. అదే విధంగా నేడు ఆ సమ్మెను సర్వజనుల ఉద్యమంగా మార్చి కేంద్ర ప్రభుత్వం దిగివచ్చేలా చేసి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు బిల్లును పార్లమెంటులో పెట్టే విధంగా మన పాత్రను అర్థవంతంగా తీర్చిదిద్దుదామని అని అంటున్నాను. కాని, కేసీఆర్‌తోనో, చంద్రబాబుతోనో, కిరణ్‌కుమార్ రెడ్డితోనో అధికారం కొరకు పొత్తు పెట్టుకొని వారితో అంటకాగమని చెప్పలేదు. అలాగే గత 15 సంవత్సరాలుగా ప్రతీ ఎన్నికలలో ఎవరో ఒకరు అగ్రకులాల నాయకులతో చెట్టపట్టాలేసుకొని అధికారం లోకి ఎక్కించేందుకు కృషి చేస్తూ, ఆఖరుకు అత్యంత అవినీతిపరునిగా నేడు చరిత్రలోకెక్కిన అగ్రకుల పాలేగాన్ని (వైఎస్ఆర్ పార్టీ నేత జగన్)ను కూడా గెలిపించమని కోరిన నాయకత్వాన్ని మోస్తూ, ఇదే పోరాటమని, ఈ చదరంగమే జాతి వికాసానికి తోడ్పడుతుందని, దీన్నే కొనసాగిస్తామని బల్ల గుద్ది వాదించడం ద్వారా తను ఎవరి పంచన చేరుతున్నారో మిత్రులు శ్రీనివాస్ గారు గుర్తించాల్సిందిగా కోరుతున్నాను. తెలంగాణలో దళిత, వెనుకబడిన, మైనారిటీలు "బాంచన్ దొర నుంచి తలెత్తుకు తిరగడానికి" తమ ప్రాణాలను తృణప్రాయంగా భావించి అసువులు బాసిన అమరుల వారసత్వాన్ని కొనసాగిస్తున్న వారిగా తెలంగాణ నాలుగు కోట్ల ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షను నెరవేర్చే అంతిమలక్ష్యానికి ఒక్కటొక్కటిగా అడుగులు వేస్తున్నాం, తప్ప పై పాలకవర్గాలు అధికారంలోకి వచ్చేందుకు ఆడుతున్న చదరంగంలో ఎన్నడు పావు కాలేదు. మీలాంటి వారు కూడా కావద్దని, ఉద్యమించడం ద్వారా వచ్చే చైతన్యంతో మొత్తం సమాజ వికాసంలో మన పాత్రను అగ్రభాగాన నిలబెట్టాలని కోరినాను. అలాగే ఇప్పటి వరకు ఈ రాజకీయ పార్టీలు తాము అధికారంలోకి

వచ్చేందుకు దళిత, వెనుకబడిన, మైనారిటీలను ఓట్లు కాసే చెట్లుగానే చూశాయి కానీ, వారి 'సమగ్ర వికాసం' కోసం కనీస కృషి చేయలేదు. అటువంటి వారితో ఏఏ రూపాలలో ఒప్పందాలు చేసుకున్నా, అవి సీమాంధ్ర, తెలంగాణ పెద్ద మనుషులు చేసుకున్న ఆరుసూత్రాల, అష్టసూత్రాల ఒప్పందాల మాదిరిగానే బుట్టదాఖలు అవుతాయి తప్ప, ఈ ప్రాంతంలోని అశేష ప్రజానీకానికి ఒరిగేదేమీ లేదు. డాక్టర్ శ్రీనివాస్ గారు ప్రతిపాదించిన అంశాలన్ని రాజ్యాంగబద్ధంగా ఒప్పదం చేసుకున్నా, అమలు కానీవ్వని చరిత్ర నేటి పాలకులది. ఇక రాజ్యాంగ ఆమోదం లేకుండ చేసుకునే ఒప్పందాలు, పథకాలు "నీటి బుడగలు" గానే మాయ మావుతాయనే చారిత్రక వాస్తవాన్ని ఉన్నత విద్యావంతులయిన, తెలంగాణ సామాజిక ఉద్యమ కారులందరు గ్రహిస్తారని ఆశిస్తున్నాను. అటు యు.పిలోను, ఇటూ తెలంగాణలోను అగ్ర వర్ణ సంపన్న పాలకులతో గాని లేదా ఆయా సామాజిక కులాలలోని అభివృద్ధి చెంది అధికారాన్ని చేజిక్కించుకున్న పాలకులతో గాని చేసుకున్న ఒప్పందాలు ఆ తర్వాత అమలు పర్చలేరు. ఉద్యమం ద్వారా మాత్రమే తెలంగాణ లోని దళిత, వెనుకబడిన మైనార్టీల హక్కులు రక్షించబడుతాయి. ఈ పాలకుల నైజాన్ని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారు నాడే గ్రహించారు. ఈ శక్తులను నమ్మకుండ 1952లోనే రాజ్యసభలో " ఈ దేశదళిత, వెనుకబడిన, మైనారిటీలకు ప్రధాన జీవనాధారం అయిన భూమి సమస్య పరిష్కారం గూర్చి మాట్లాడుతూ ఈ రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు నా ప్రజలకు దక్కని రోజున" ఈ రాజ్యాంగంను తగలబెట్టాలి, అలా తగల బెట్టే వానిలో మొదటి వానిగా నేను ఉంటాను అని అన్నారు. ఈ దేశప్రజలకు పై హక్కులు దక్కకపోగా, కనీసం రాజ్యాంగంలోని అధికరణ 3 ప్రకారం తెలంగాణ ప్రజల ప్రజాస్వామిక హక్కును కూడా కాలరాస్తున్న సీమాంధ్ర భూస్వామ్యపెట్టుబడిదారుల ఆర్థిక మూలలాను దెబ్బకొట్టే "సకల జనుల సమ్మె"లో పాల్గొని దీనిని "సర్వజనుల ఉద్యమం"గా మార్చాల్సిన చారిత్రక బాధ్యత నాలుగు కోట్ల తెలంగాణ భూమి పుత్రులుగా మన అందరి పై ఉన్నది.

పొలిటికల్ జెఎసి, అందులో భాగమయిన టి.ఆర్.ఎస్ ఉద్యమాన్ని సరిగా నడిపించనందుకు, తమ స్వంత ప్రయోజనానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నందుకు నేడు కాకున్నా, రేపైన ప్రజలలో వారు ఎండ గట్టబడుతారు. అయితే, వారితో ఉద్యమంలో ఐక్యత – మిగతా విషయాలలో పోరాటం ప్రాతిపదికగా ఉద్యమశక్తులతో కలిసి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధించాలి. అదేవిధంగా "గోంగట్లో అన్నం తింటూ వెంట్రుకలు రాకుండ చూసుకునే" తీవ్ర ప్రయత్నం వల్ల ఫలితం ఉండదు. నిజమైన సామాజిక న్యాయ పునాది కల " ప్రత్యేక ప్రజాస్వామ్య తెలంగాణ" లోనే దళిత, వెనుకబడిన, మైనారిటీల వికాసం ఉంటుందనే సమగ్ర అవగాహన కలిగిఉండాలి. అలాగే ఉద్యమంతో దాగుడుమూతలు ఆడే శక్తులపట్ల అప్రమత్తంగా ఉంటూ ఎక్కడైతే మడమ తిప్పే ప్రయత్నం వారు చేస్తారో, అక్కడ నుండి నిజమైన ఉద్యమ శక్తులుగా ఉద్యమ ఉధృతిని పెంచే విధంగా తెలంగాణ ప్రజలందరు చేస్తున్న పోరాటానికి "వ్యాన్‌గార్డ్" పాత్ర మనం పోషించాలి. అటువైపు తెలంగాణ ఉద్యమశక్తులందరం చేయి చేయి కలసినడుద్దాం, తెలంగాణ ప్రజలను సకలం దోచిన సీమాంధ్ర భూస్వామ్య పెట్టుబడిదారులను ఓడించి ప్రజా ఉద్యమమే సకల సమస్యలను పరిష్కరిస్తుందనే చారిత్రక వారసత్వాన్ని తెలంగాణ ముద్దు బిడ్డలుగా మరోసారి నిజమని నిరూపిద్దాం. ఈ లక్ష్యసాధనలోనే తెలంగాణ అమరుల కలలను సాకరం చేద్దాం. ఈ "సకల జనుల సమ్మెను సర్వజనుల ఉద్యమంగా" మార్చి సీమాంధ్ర అగ్రవర్ణ సంపన్న భూస్వామ్య పెత్తందారి విధానాన్ని పారదోలుదాం. ■

**– చిక్కుడు ప్రభాకర్**

తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి

# తెలంగాణ దుక్కుల్లో హక్కుల మొక్కలు నాటాలి

**– డా॥ చెరుకు సుధాకర్**

కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు. 1969 ఎప్పటికీ 2001 కాదు. 2001కి 2009కి ఎంతో తేడా! 369 మంది విద్యార్థుల బలిదానం ఎగజిమ్మిన రక్తం లెక్క హైదరాబాద్ నడిబొడ్డున తెలంగాణ అమరవీరుల స్థూపంగా నిలబడి ఉన్నది. వచ్చిన ప్రభుత్వాలు స్థూపం చుట్టూ గడి మొక్కలు పెట్టి గన్‌పార్కును పర్యాటక కేంద్రంగా మార్చి రాలిన గడ్డిపూలను, గాయపడ్డ పక్షులను మరిచిపోవడానికి అన్ని పనులు నిరాటంకంగా కొన సాగించారు.

పనిలో పని 1969లో తెలంగాణ విద్యార్థి ఉద్యమంపై ఉక్కుపాదం మోపినవాళ్ళు మరో 3 దశాబ్దాలు తెలంగాణలో వందలాది గ్రామాలలో నక్సలైట్ల పేరుమీద కొనసాగించిన హత్యాకాండ, రక్తపాతం చెప్పనలవి కాదు. అట్లా తెలంగాణ గడ్డమీద యుద్ధ వాతావరణాన్ని సృష్టించి మిలటరీ అణచివేతకు పాల్పడుతున్నప్పుడు ప్రజా కళాకారులు పాడి వినిపించిన పాట గుర్తు చేస్తూ దాని రిలవెన్సు కొనసాగిస్తాను. 'దుక్కులు నాటే రైతు చేతికి బేడిలెందుకురో అన్నా! మొక్కలు నాటిన రైతు కూలీని జైలులోన పెట్టింర్రోన్నా! ధర్మ యుద్ధం జరుగుతుంది మీరెటువైపోరన్నా!' నిజంగానే తెలంగాణ నాగేటి చాళ్లల్లో మొలిచిన హక్కుల ప్రశ్నలకు.... పిడికెళ్ళకు పాలకులు చీకటి రాజ్యం రుచి ఎన్నోసార్లు చూపెట్టింది.

## తొలి దశలోనే ఉద్యమం జోరుగా సాగింది

తెలంగాణ మలి దశ ఉద్యమంలో 1995 ఆగస్టు 11న తెలంగాణ మహాసభ వేలాది మందితో సూర్యాపేటలో తెలంగాణ పోరుకేకను నలు దిశలకు వినిపించింది. తరువాత తెలంగాణ జనసభ, ఇందిరారెడ్డి ప్రయత్నం, తెలంగాణ ఐక్యవేదిక, 2001 ఏప్రిల్ 27 తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భావం – ఉద్యమ రాజకీయ పార్టీల పదేళ్ళ ప్రస్తానం పార్లమెంటు, అసెంబ్లీలో టిఆర్ఎస్ ప్రాముఖ్య స్థానం – బలమైన పార్టీగా నిలబెట్టుకొనే యత్నం, గద్దర్‌తో పాటు అనేక మంది ప్రజా వాగ్గేయకారుల నిబద్ధతతో పాటు కొనసాగిన తెలంగాణ యుద్ధ గీతి ప్రస్థానం–2009 నవంబర్‌లో కెసిఆర్ నిరాహార దీక్ష, కల్లోల తెలంగాణ క్యాంపస్‌లు, విద్యాలయాలు, బలిదానాలు, అమరత్వాలు – డిసెంబర్ 9, చిదంబరం ప్రకటన పక్షం రోజులు తిరగకుండానే 'యూటర్న్' ......రివర్స్‌టర్న్‌కు మా బాధ్యత లేదని కాంగ్రెస్, తెలుగుదేశం దొంగనాటకం, అనేక పరిణామాలు–పరిహాసాలు, పర్యవసానాలు శ్రీకృష్ణకమిటీ 'పల్లెక్కం' రిపోర్టు ఉత్తుత్తి రాజీనామాలు, పరస్పర దూషణలు ఎట్టకేలకు తెలంగాణ ప్రజాసంఘాలతో పాటు బలమైన తెలంగాణ ఐక్యరాజకీయ కార్యాచరణ కమిటీ అన్ని అస్త్రాలు కార్యాచరణ తరువాత తెలంగాణ ఉద్యోగుల సహాయ నిరాకరణ అన్నీ గుణపాఠాలతో సంబంధించిన మరో అస్త్రం – – 'సకల జనుల సమ్మె' కొనసాగుతూ అప్పుడే నెల రోజులయింది. అక్టోబర్ విప్లవం గుర్తుకు తెచ్చే ఈ మాసంలోనే 15వ తేదీ నుండి 3 రోజుల రైల్ రోకోకు తెలంగాణ బిడ్డలు సిద్ధమవుతూ ఉంటే కిరణ్‌కుమార్, డిజిపి దినేష్‌రెడ్డి అరెస్టులు – అణచివేతకు సిద్ధమవుతున్నారు. రైల్ రోకో మేమే ముందుండి పాల్గొంటామని తెలంగాణ కాంగ్రెస్ ఎంపిల ప్రకటన ఇప్పటికే తీవ్ర వత్తిడికి గురవుతున్న తెలంగాణ ఉద్యమ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. నెలరోజుల సకల జనుల సమ్మెలో ఉద్యోగులు మొదటూహించిన

దానికంటే అద్భుతంగా ఉద్యోగుల కదలిక, ఆర్‌టిసి, సింగరేణి, ఉన్నతశ్రేణీ ఉద్యోగులు తెలంగాణకై కలబడి నిలబడిన తరుణమిది. ఇట్లా ఉంది కాబట్టే ఢిల్లీకి సెగతగిలి తెలంగాణపై ఏదో ఒక నిర్ణయాన్ని ప్రకటించే వాతావరణం ఒకటైతే, అలవాటుగా పాలకులు యథాస్థితి కొనసాగించడం కోసం 'తీవ్ర అణచివేత ప్రయోగం మొదలెట్టినారు'.

## చెరసాలకు వడివడి అడుగులు

సకల జనుల సమ్మెలో నిజానికి ఏ స్వతంత్ర్య తెలంగాణా ట్రేడ్ యూనియన్ బలంగా లేకపోయినప్పటికీ యూనియన్లకు అతీతంగా సమ్మె బలపడడం, పోలీస్ బాస్ దినేష్‌రెడ్డికి మరీ కోపం తెప్పించింది. ఆయన ఆర్‌టిసి ఎండిగా ఉన్న కాలంలో ఇబ్బడి ముబ్బడిగా ఎదిగిన సీమాంధ్ర ప్రైవేట్ బస్సు లాబీ, ఇప్పుడు అదును చూసి తెలంగాణ ఆర్‌టిసి ఐక్యతమీద దెబ్బకొట్టదలుచుకునే సకల జనుల సమ్మె బారసాల రోజు విజయవాడ నుండి హైదరాబాద్ 'ట్రయల్ రన్' ఇవ్వడం ఊహించని ప్రతిఘటన, నిరసనదారులు, రెచ్చిపోయిన పోలీసుల అణచివేత ఇప్పుడు కోదాడ నుండి హైదరాబాద్ దాకా రోడ్డు మీద ఊరున్న ప్రతిపల్లె చెరసాలకు దగ్గరయి వందల మంది అక్రమ కేసులలో జైళ్ళకు నెట్టబడ్డారు. రేపు రైల్ రోకోకు ముందే అనేక ప్రాంతాలలో జెఎసి నాయకులను అరెస్టు చేస్తున్నారు. దినేష్‌రెడ్డి ప్రజలు రోడ్ల మీదికి రావడానికి జడుసుకోవాలని ఇండియన్ పీనల్ కోడ్, రైల్వే చట్టంలోని సెక్షన్లను బిగ్గరగా చదువుతూనే ఉన్నాడు. అక్టోబర్ 3న సీమాంధ్ర బస్సులపై దాడి కేసులో సాధారణ కేసులకు బదులు అటెంప్టు మర్డర్ సెక్షన్ 307 పెట్టి జిల్లా ఎస్‌పిని కాదని డిఐజి నాగిరెడ్డి 14 రోజుల రిమాండ్‌కు పంపారు. మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచిన తరువాత నాగం జనార్ధన్‌రెడ్డి, హరీశ్వర్ రెడ్డి, వేణుగోపాలాచారి ప్రజా తెలంగాణ ఫ్రంట్ పాదూరి కరుణ తదితరులు రిమాండ్‌కు ముందు నల్లగొండ పోలీస్‌స్టేషన్‌లో కలిసినప్పుడు ఒక ముఖ్య సూచన చేయడం జరిగింది. తెలంగాణ ప్రజాసంఘాలు, పార్టీలు కలిసి ఐక్య ఉద్యమం చేయడంతో పాటు భవిష్యత్తులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనసాగిస్తున్న అణచివేతను దేశ ప్రజల దృష్టికి తీసుకుపోవలసిన అవసరం న్యాయ వ్యవస్థ ముందు దోషులుగా నిలబెట్టవలసిన అవసరం, అన్నింటి కంటే ముఖ్యంగా చట్టాన్ని అతిక్రమించి, పోలీసులు అణచివేతకు పూనుకుంటే పౌర, ప్రజాస్వామ్య హక్కుల కోసం 'తెలంగాణ ఉద్యమ హక్కుల పరిరక్షణ సంస్థ' ఒకటి అవసరమున్నది. రానున్న కాలంలో ఈ అవసరం ఇంకా పెరుగుతుంది. సమిష్టిగా, సీరియస్‌గా చేయవలసిన కృషి ఉన్నదని పేర్కొన్నారు.

## దేశంలోనే అతి పెద్ద పౌర ఉద్యమం

తెలంగాణలో 4 దశాబ్దాలు పైబడిన పౌరహక్కుల ఉద్యమం దేశానికే అనేక విలువైన పాఠాలను బోధించడంతో పాటు హక్కులకు సంబంధించిన సోయి తెలంగాణలోనే ఎక్కువ ఉండటానికి కారణమయింది. ఇవ్వాళ తెలంగాణ ఉద్యమం దేశంలోనే కొనసాగుతున్న అతి పెద్ద పౌర ప్రజాస్వామిక ఉద్యమం. దేశంలో ఉన్న అన్ని జాతీయ ప్రాంతీయ పార్టీలను ఆకర్షించినా, అవి తమ బాధ్యతను సక్రమంగా నిర్వహించిన దాఖలా లేదు. అంతర్జాతీయ సమాజానికి కూడా ఇప్పుడు తెలంగాణలో ఏమి జరుగుతున్నదీ తెలియాలి.

భారతీయ జనతా పార్టీ, భారత కమ్యూనిస్టు పార్టీ, న్యూడెమోక్రసీ పార్టీ ఇలా భిన్న ధృవాల పార్టీలన్నీ ఉద్యమ ఐక్య కార్యాచరణలో భాగస్వాములై, అనేక స్వచ్ఛంద సంస్థలు ముందు నిలబడి పని చేస్తున్నా ఈ ఉద్యమాన్ని మావోయిస్టు సానుభూతిపరులు నడుపుతున్నారని అబద్ధపు ప్రచారాన్ని మొదలు పెట్టి అణచివేత పునాదుల మీద అర్ధ శతాబ్దం రాజకీయాన్ని కొనసాగించిన పార్టీ కొత్త ఎత్తుగడలు – వ్యూహాలు రూపొందిస్తున్నది.

వరంగల్‌లో తెలంగాణ విద్యార్థి యాకుబ్‌రెడ్డిని చిత్రహింసలు పెట్టి హంటర్ రోడ్డు పాత రోజులను గుర్తు చేసింది. నల్లగొండలో కనబడ్డవాళ్ళ మీద కేసుల కోసం ఉవ్విళ్ళూరుతున్నారు. అణచివేత, చట్టవ్యతిరేక చర్యలపైన ప్రచారం చేస్తూనే మానవహక్కుల సంఘానికి ఫిర్యాదు చేయడం, న్యాయస్థానాలను బలమైన సంఘీభావ ఉద్యమంతో

పోలీసు, న్యాయవ్యవస్థలలో తిష్ఠవేసుకున్న సీమాంధ్ర అధికారుల పక్షపాతానికి చెక్ పెట్టటం కూడా ఇక అవసరమే.

## పాలకులపై ధ్వజమెత్తడం ఒక కొత్త ఉద్యమం

ప్రజా పోరాటాలు ఉవ్వెత్తున లేచినప్పుడు, పాలకులు అనుసరించిన నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ 'మూవ్‌మెంట్ ఎగైనెస్ట్ రిప్రెషన్' (ఎంఎఆర్) పేరుతో ఢిల్లీ కేంద్రంగా గొప్ప ఉద్యమం జరిగింది. అలాంటి నెట్‌వర్క్ ప్లాట్‌ఫాం యొక్క అవసరం ఇప్పుడు అర్జెంట్‌గా ఉన్నది. అంతర్జాతీయ సమాజంలో కూడా ప్రచారం అవసరం. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువాళ్ళంతా సంఘటితమవ్వడం పాత ముచ్చటయితే, తెలంగాణ బిడ్డలంతా ఏకమవటం, తెలంగాణ ఆడబిడ్డలు బతుకమ్మ ఆడటం కలిసి తమ ఐక్యతను ప్రదర్శన ద్వారా చాటటం క్రొత్త ముచ్చట. ఇంతటితో ఆగితే ఇప్పుడున్న సీమాంధ్ర లాబీకి వచ్చే నష్టం లేదు. వీళ్ళ డబ్బు సంచులతో ఢిల్లీలో నడుస్తున్న గోల్‌మాల్‌కు చెక్ పెట్టాలంటే తెలంగాణ ఎడల పార్లమెంట్, అసెంబ్లీలో ఉన్న చట్టసభల ప్రతినిధుల నీతి బాహుళ్య, ద్వంద్వ ప్రమాణాలను, అణచివేత, సాచివేత ధోరణులను ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం చేయాలి. అంతర్జాతీయ సమాజంలో ప్రపంచంలోనే పార్లమెంట్ వ్యవస్థ ఛాంపియన్‌షిప్ పొజిషన్ కోసం ఆరాటపడే మన వాళ్ళకు ఈ ప్రచారం ముచ్చెమటలు పట్టిస్తుంది. ఇక్కడ క్షేత్ర స్థాయిలో తెలంగాణ ప్రజలకు గొప్ప నైతిక స్థైర్యాన్ని కలిగిస్తుంది.

మరో ప్రయత్నం తెలుగు నేల అంతటా, తెలుగు ప్రజల మధ్య, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సానుకూలతను అనివార్యతను సృష్టించడం అంతిమంగా కావడిబద్దలుగా కలిసి ఉందాం – కావడి కుండల్లా విడిగా ఉందాం అని ఒప్పించడం, పిడికెడు మంది పెట్టుబడిదారులకు ఇష్టంలేని రెండు తెలుగు రాష్ట్రాలను ఏర్పాటు చేసుకోవడం కోసం సిద్ధమవుదాం. ■

**– డా॥ చెరుకు సుధాకర్**

టిఆర్ఎస్ పొలిట్‌బ్యూరో సభ్యులు

18-09-2011, వార్త

### గత ఉద్యమ జ్ఞాపకాలు

## పోలీసు కాల్పుల్లో మిత్రుడిని కోల్పోయాను



**1969** సంవత్సరంలో తెలంగాణ ఉద్యమం ఊపందుకుంది. అప్పుడు నా వయస్సు 23 సంవత్సరాలు. హైదరాబాద్‌లోని మల్కపేట ముంతాజ్ కాలేజీ అధ్యక్షుడిగా పనిచేస్తున్నాను. డిగ్రీ చదువుతున్న రోజులు. కాలేజీ అధ్యక్షుడిగా అటు హైదరాబాద్, ఇటు భువనగిరిలోనూ తెలంగాణ ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తున్నాను. భువనగిరిలో నన్ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అప్పటి సీఐ రాజు, టౌన్ ఎస్ఐ పుల్లారెడ్డిలు 5 గంటల పాటు స్టేషన్‌లో ఉంచుకొని వదిలి పెట్టారు. తర్వాత హైదరాబాద్‌లో ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొం టున్న వారి వివరాలు సేకరించారు. నన్ను, నాతో పాటు నా స్నేహితుడు సత్తిరెడ్డిల వివరాలు పోలీసుల వద్ద ఉన్నాయి. దీంతో కొన్ని రోజుల పాటు తప్పించుకుని తిరిగాం. ఒక రోజు పోలీసుల కంటపడ్డాం. పారిపోతుండగా వారు కాల్పులు జరిపారు. ఆ కాల్పుల్లో నా స్నేహితుడు బలైపోయాడు. నేను తప్పించుకున్నా. మంచి స్నేహితుడిని కోల్పోవడం బాధాకరం.

– పైళ్ల యాదిరెడ్డి, రిటైర్డ్ ఎంఈవో, చాడ, ఆత్మకూరు(ఎం)

# ‘సకల’ం మిథ్య అంటే సరిపోతుందా?

**– కె. శ్రీనివాస్**

ఏదైనా ఒక ఉద్యమం మంచిదా చెడ్డదా అన్న ప్రశ్న వేసుకుని జరిగిన ఇష్టాన్ని బట్టి ఏ సమాధానమైనా చెప్పుకోవచ్చు. ఎందుకంటే అది అభిప్రాయం మాత్రమే. కానీ ఏదైనా ఉద్యమం ఉధృతంగా సాగుతోందా, చప్పగా జరుగుతోందా అన్న ప్రశ్న వేసుకుని ఇష్టమొచ్చిన అభిప్రాయం చెప్పుకోవడానికి కుదరదు. ఎందుకంటే, అక్కడ వాస్తవం చెప్పాలి.

మూడున్నర లక్షలమంది రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు, లక్షన్నరమంది ఉపాధ్యాయులు, అరవై ఏడు వేలమంది సింగరేణి కార్మికులు, యాభై ఎనిమిదివేల మంది ఆర్టీసీ కార్మికులు, ఇంకా ప్రభుత్వాసుపత్రుల వైద్యులు సమ్మెలో ఉన్నారు. ఇంకా ఆటోడ్రైవర్లు, పూజారులు, రజకులు, భవన నిర్మాణ కార్మికులు, పాఠశాలల యాజమాన్యాలు, ప్రభుత్వ డ్రైవర్లు సంఘీభావ సమ్మెలు చేస్తున్నారు. రోజుకో సమూహం కొత్తగా వచ్చి ఆందోళనలో చేరుతున్నది. ఏక కాలంలో సమ్మెచేసి జనజీవనాన్ని స్తంభింపజేసిన ఇటువంటి ఉద్యమం గతంలో ఎప్పుడైనా ఏ సమస్యల పరిష్కారం కోసమైనా జరిగిందా? ఇన్ని రోజులు నిలకడగా సాగిందా? ఉద్యమం తీరు మీద, నాయకత్వం మీద ఎన్ని విమర్శలు విభేదాలు ఉన్నప్పటికీ–సమాజంలోని ఇన్ని వర్గాలు, శ్రేణులు ఒక్కుమ్మడిగా ఒక ఆకాంక్ష సాధనకోసం ఉద్యమించడం మునుపెన్నడైనా విన్నామా? తెలంగాణ ఉద్యమం గురించి ఎటువంటి అభిప్రాయం ఉన్నవారైనా , ఇప్పటి సకలజనుల సమ్మె తీవ్రతను, ఉధృతిని అంగీకరించడానికి అభ్యంతరం

ఉండకూడదు. ఎందుకంటే, హైదరాబాద్ వీధుల దగ్గర నుంచి, ఆదిలాబాద్ అడవుల దాకా వాస్తవమేమిటో కళ్ళ ఎదుట కనిపిస్తున్నది. మరి రేణుకాచౌదరికీ, అభిషేక్ సింఘ్వికి సమ్మె ప్రభావం ఏమీ లేదని ఎందుకు అనిపించింది? ఇదంతా చల్లారిపోయే వేడి అని ముఖ్యమంత్రిగారికి ఎందుకు అనిపిస్తోంది?

చల్లారిపోవచ్చు. ఏ విజయమూ లేకుండానే అణగారిపోవచ్చు. కానీ, ముగిసిపోయిందనుకున్నది మళ్ళీ మళ్ళీ మొలుచుకు వస్తున్నప్పుడు, ఇది ఇంతటితో ఆగేది కాదన్న కనీస అవగాహన ఉండాలి. అణచివేతతోనో, అసహాయతతోనో ఆందోళనలు విరమించుకున్నప్పటికీ, ఆకాంక్షలు నెరవేరని ఆశాభంగం, కనీస స్పందన కూడా దొరకని అరణ్య రోదనం– ఆయా జనవర్గాల మనసులో ఎటువంటి ఉద్వేగాలకు, ఆవేశాలకు కారణమవుతాయో – సమాజానికి బాధ్యత వహించేవారికి తెలిసి ఉండాలి. గుంపును చెదరగొట్టి విజయం సాధించామని పోలీసులు అనుకోవచ్చు, సమ్మెను చెదరగొడితే సమస్య సమసిపోతుందని ప్రభుత్వాధినేతలు అనుకుంటే అది న్యాయం కాదు. మీరు వ్యక్తం చేస్తున్న ఆకాంక్షను ఆలకించాము, సమస్యను పైవారికి నివేదిస్తాము, పరిష్కారం సత్వరం జరిగేటట్టు మా ప్రయత్నం మేం చేస్తాము– అని చెప్పవలసింది పోయి, సమ్మెవల్ల కలుగుతున్న కష్టాలను చూపించి, చట్టాలతో భయపెట్టి, తాయిలాలతో ఆశపెట్టి సంక్షోభాన్ని గట్టెక్కాలనుకోవడం అంత గొప్ప పరిపాలనా వ్యూహమూ, రాజకీయ విజ్ఞతా కావు.

మరి సమ్మెవల్ల కష్టాలు లేవా? చాలా ఉన్నాయి. లెక్కలేనన్ని ఉన్నాయి. సమ్మె ఎట్లా పరిణమిస్తుందో తెలియదు కానీ, నెలాఖరుకు జీతాలు వచ్చే అశలేదు. వచ్చే నెల దసరా, దీపావళి పండగలు, పిల్లల చదువులు దెబ్బతింటున్నాయి.

పదోతరగతి, ఇంటర్ పిల్లల తల్లిదండ్రులకయితే మరీ టెన్షన్. రోడ్లమీద చిల్లర వ్యాపారం దెబ్బతింటున్నది. షోరూమ్‌లలో అమ్మకాలూ పడిపోయాయి. రవాణా సదుపాయం లేక రోగులు మెరుగైన వైద్యం పొందలేకపోతున్నారు. సింగరేణి సమ్మె ప్రభావం నిజంగా మొదలయిందో ప్రభుత్వం మాయచేస్తోందో తెలియదుకానీ, ఇవాళ కాకపోతే రేపయినా విద్యుత్ కొరత విరుచుకుపడుతుంది. ఇప్పటికే గృహ వినియోగం కోత పడింది. సమ్మె పేరు చెప్పి సేద్యానికీ కోత వేయవచ్చు. జీవితం స్తంభించడం అంటే ఏమిటో తెలంగాణ జిల్లాలను చూస్తే తెలుస్తుంది. ఏ సమ్మెకైనా బాధితులంటూ ఉంటే వారు ప్రధానంగా స్థానికులే అయి ఉంటారు. అలాగే, ఈ సకల జనుల సమ్మె కూడా తెలంగాణ సకల జనులను ఇబ్బందులు పెట్టడంలో ఆశ్చర్యమూ అసహజమూ ఏమీ లేదు.

మరి తెలంగాణ వారు తమను తాము ఎందుకు బాధించుకుంటున్నారు? సమ్మె చేసేవారూ బాధలు పడేవారూ వేరు వేరా? ప్రభుత్వోద్యోగులకూ సింగరేణి కార్మికులకూ కుటుంబాలూ పిల్లలూ వాళ్ళ చదువులూ అన్నీ ఉంటాయి. కరెంటు కోత వస్తే అందుకు బాధితులయ్యేవారిలో ఉద్యమకారులూ ఉంటారు. ఆంతెందుకు, వీరందరూ జీతాలు కోల్పోవడానికి, ప్రభుత్వ చర్యలకు సిద్ధపడే సమ్మెకు దిగారు కదా? తమను తాము బాధించుకుంటున్నామని వారికి తెలియదా? గొప్పదని తాము అనుకున్న ఆశయాన్ని సాధించడానికి వాళ్ళు ఆ ఇబ్బందులు పడడానికి సిద్ధపడి ఉద్యమిస్తున్నారు. ఇది మీకే నష్టం, మీకే కష్టం – అనడమంటే, ఉద్యమాలు ఎట్లా జరుగుతాయో, ఏ ఏ సంసిద్ధతలతో జరుగుతాయో తెలియని అజ్ఞానమే అవుతుంది. తమను తాము కాకుండా ఇతరులను మాత్రమే బాధించే ఉద్యమాలు చేస్తే, ఈ విమర్శకులు ఆహ్వానిస్తారా? అప్పుడు వాటిని మరో పేరుతో పిలవరా?

ఒక అపూర్వమైన ప్రజాందోళనతో వ్యవహరించవలసిన తీరు ఇది కాదు. ఆ ఆందోళన ఆశయాలతో ఏకీభావం లేకున్నా, ఇందులో పాల్గొంటున్న విస్తృత ప్రజా రాశిని మొదట గౌరవించాలి. తరువాత ప్రజాస్వామికంగా సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేయాలి. అందుకు జరగవలసింది – ముందు ఉద్యమం ఉనికిని గుర్తించాలి. కళ్ళు మూసుకుంటే మాయమయిపోయేది కాదు, ఈ ఉద్యమం. ఉధృతంగా లేదనుకూటే, బలహీనపడిందనుకుంటే, మెజారిటీ ప్రజలు ఇందుకు సుముఖంగా లేరనుకుంటే, అది ఆత్మ సంతృప్తిని ఇవ్వవచ్చు, ఇతర ప్రజానీకాన్ని మభ్యపెట్టడానికి పనికిరావచ్చు. కళ్లెదుట కనిపిస్తున్న వాస్తవాన్ని నిరాకరిస్తూ, సబ్ ఠీక్ హై అనుకుంటే, అది ఉష్ట్రపక్షి మనస్తత్వమే అవుతుంది. ఉద్యమం ఉనికిని గుర్తించడం మాత్రమే కాదు, అందులో కనిపించే మంచి లక్షణాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. 1969 నాటి ఉద్యమం ఇంతకంటే తీవ్రతతో సాగింది. సందేహం లేదు. నెలల తరబడి విద్యాలయాలు మూతబడ్డాయి, వీధులు రణరంగంగా మారాయి. హింసాత్మక సంఘటనలూ జరిగాయి. నేటి ఉద్యమంలో అంత తీవ్రత కనిపించకపోవచ్చు, కానీ విస్తృతి కనిపిస్తుంది. నాటితో పోలిస్తే, అనేక రెట్లు జనం ఉద్యమంలో పాలుపంచుకుంటున్నారు కానీ, నేటి సంయమనం, నిగ్రహం నాడు లేవు. ఇన్ని శ్రేణులు, ఇన్ని సంఘాలు, ఇన్ని ఐక్యవేదికలు ఒకే ఉద్యమంలో అంతర్భాగంగా ఉన్నా, ఏ వైపు నుంచి కూడా హద్దుమీరిన దాఖలాలు లేవు. కానీ, ఉద్యమమే మిధ్య అనేవారు ఒకవైపు, ఉన్న ఉద్యమం ఉద్రేకాలను రెచ్చగొడుతున్నదనేవారు మరోవైపు – వీరు వాస్తవాన్ని ఎవరినుంచి దాచిపెడుతున్నారు? వీరి మాటలు నమ్మితే, మోసపోయేది ఎవరు?

అటూ ఇటూ ప్రగల్భ శూరులు లేరని కాదు. ఆచరణకు ప్రత్యామ్నాయంగా ఆవేశ ప్రకటనలను ఒక పద్ధతిగా పాటిస్తున్న వారు అన్ని వైపులా ఉన్నారు. కానీ, నిజంగా జనం అటువంటి మాటల వల్ల ఉద్రిక్తులవుతారా? ప్రాణాలిస్తామని చెప్పేవాళ్ళు పదవులు కూడా వదలరని, ఆత్మాహుతి దాడులు చేస్తామనేవారి కాళ్ళు గడప కూడా దాటవని, దళాలు ఏర్పాటు చేస్తామనడం, ఊచకోతలు కోస్తామనడం, నాలుక తీస్తామనడం – కేవలం వేదికలమీద వాగాడంబరాలేనని జనానికి తెలియదా? ఆ మాటల వల్ల కాదుకనీ, నిర్ణయాలు తీసుకోవలసినవారి నిర్లప్తత వల్ల, సత్యం చెప్పవలసిన వారి నోట అసత్యాల వల్ల, కనిపిస్తున్న వాస్తవానికి కళ్ళు మూసుకోవడం వల్ల – ఉద్రిక్తతలు చెలరేగుతాయి. ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా చేయగలిగినంత చేస్తున్న ఉద్యమానికి పాషాణ హృదయమే సమాధానమైతే, అది ఎంతటి నిస్పృహను, తెగింపును కలిగిస్తుందో ఏలినవారికి తెలియవద్దా? రెచ్చగొట్టడానికి

మాటలే కానక్కరలేదు. మౌనం చాలు. నిర్లిప్తత చాలు. శాంతపరచాడానికి అన్ని వేళలా పూర్తి పరిష్కారమే అక్కరలేదు, కాసింత సానుభుతి, కొన్ని అనునయ వాక్యాలు చాలు. అశను మిగిలిస్తే చాలు. ఒక అడుగైనా ముందుకు పడితే చాలు.

ఇంతటి మహోద్యమానికి పాలకుల ప్రతిస్పందన ఇట్లా ఉంటే, ఉద్యమ ప్రజలకు ప్రాతినిధ్యం వహించే నేతల ధోరణి మరీ దారుణంగా ఉంది. చిన్నపాటి సాంత్వన వాక్యం, కొద్దిగా సంఘీభావం, కాసింత నిజాయితీ కనబరిస్తే చాలు, గజమాల వేయడానికి సిద్ధంగా ఉన్నారే ప్రజలు, చరిత్ర కల్పించిన అవకాశానికి ఎందుకింత పెడమొహం పెడుతున్నారు? రాష్ట్ర స్పీకర్ రాజీనామాలు తిరస్కరించినదే మహా భాగ్యం అనుకుని ఊరుకున్నారు. లోక్‌సభ స్పీకర్ పెండింగ్‌లో పెడితే, సభకు వెళ్ళి వస్తూనే ఉన్నారు. రాజీనామాలు పరిష్కారం అని కాదు, తాము చేసిన పనులకే కట్టుబాటులేనితనం ఎందుకు? నిన్న ఆత్మహత్యలతో, నేడు ఆత్మహింసతో ఆకాంక్షలను ప్రకటిస్తున్న ప్రజల కాలిగోరుకైనా సరిపోలగలరా వీరు? తమతో కలవమని జనం చేస్తున్న విజ్ఞప్తికి వీరు ఇస్తున్న స్పందన ప్రభుత్వ స్పందన కంటే ఏరకంగా భిన్నమైనది? సమస్యకు పరిష్కారం కావాలి. నిజమే. అంతకంటే ముందు కనీసం స్పందన కావాలి. ■

**– కె. శ్రీనివాస్**
ఆంధ్రజ్యోతి సంపాదకులు

25.09.2011, ఆంధ్రజ్యోతి

# తెలంగాణ సాధిద్దామని ప్రమాణం చేద్దాం

అరువై ఏండ్ల తండ్లాటల బతుకు తెలంగాణది
ఏ జిల్లాకు పోయినా ఏడుపే
ఏ పల్లెను కదిలించినా దుఃఖమే
ఏ మనిషిని మందలించినా వలపోతే
అరువై ఏండ్ల ఆధిపత్య ఆంధ్ర వలసపాలనలో
వంచించబడుతున్నది మన తెలంగాణ
పాతాళానికి కుచించబడుతున్నది తెలంగాణ
తెలంగాణ రాష్ట్రం కోసం
ప్రాణాలర్పించిన అమరవీరుల నెత్తుటి మరకలు
మనల ప్రశ్నిస్తూనే వున్నాయి!
కలలు కన్న రాష్ట్రాన్ని ఎప్పుడు సాధిస్తారని?
ఓ అమరవీరులారా! మీ త్యాగం వృధాకాదు
మీరు కలలుకన్న ప్రత్యేక రాష్ట్రం
ఎంతో దూరంలో లేదు
తెలంగాణ పది జిల్లాల్లో
ఆరుట్లకమలమ్మఅగ్గిమంటైమండుతూనె ఉన్నది
సాకలి ఐలమ్మ పోరుదండు సాగుతూనే ఉంది
బండి యాదగిరి గుండె మంటలు
మండుతూనే ఉన్నయి
వట్టికోట ఆళ్వార్‌స్వామి ప్రభోదాలు
వినిపిస్తూనే ఉన్నయి
సుద్దాల హన్మంతన్న గుండె గీతిక
గండు తుమ్మెదలు మోగిస్తూనె ఉన్నయి
కాళోజీ, దాశరథుల కలలు నెరవేరబోతున్నయి
ఉద్యోగులు మేధావులు మేలుకున్నరు
విద్యార్థులు కంకరరాళ్ళై కవాతు చేస్తున్నరు
కవులు కళాకారులు, ఆడి, పాడి
ధూం ధాం లతో దుమ్ములేపుతున్నరు
'జై తెలంగాణ' నినదిస్తున్నరు

**– నేర్నాల కిశోర్**

# వ్యూహం లేని ఉద్యమం

– సుదర్శన్ బాలబోయిన

**సాంఘీకార్థిక లక్ష్యాన్ని సాధించేందుకు,**
**తన ప్రజలకు సహాయాన్ని నిరాకరించే పద్ధతులు,**
**నిరాహార దీక్ష లాంటి ఉద్యమ తీరుతెన్నులు సరైనవి కావు.**
**– డా॥ బి.ఆర్. అంబేద్కర్**

అమెరికాలో నల్లజాతీయులు బస్సు సీట్లో కూర్చుని ప్రయాణించడం నిషేధం. పొరపాటునో, అనారోగ్య పరిస్థితుల్లో కూడా సీట్లో కూర్చోవడానికి వీలులేదు. ఈ వివక్షతో విసుగుచెందిన బ్లాక్స్ మార్టిన్ లూథర్ కింగ్ నాయకత్వంతో ఏకమయ్యారు. రక్తపాతం లేకుండానే ప్రభుత్వంపై తిరుగుబాటుకు ఉద్యమ వ్యూహాన్ని రుపొందించుకున్నారు. మరుసటి రోజు నుండి ప్రభుత్వ బస్సుల్లో మనం ప్రయాణించవద్దని, దీన్ని అందరూ అనుసరించాలని నల్లజాతి ఉద్యమకారులు తీర్మానించుకున్నారు. ప్రజలకు ఈ విషయాన్ని స్పష్టంగా బోధించారు. అంతేకాదు తమ ప్రజల ప్రయాణావసరాలకు ఇబ్బందులు కలగకుండా ప్రైవేటు బస్సులను ఆపరేట్ చేశారు. ప్రభుత్వ ఛార్జీలకంటె తక్కువకే పైగా సగర్వంగా సీట్లో కూర్చోని ప్రయాణించారు. ఎన్నిరోజులు ఉద్యమం చేస్తారు చచ్చుకుంటా నల్లోళ్ళు కాళ్ళ బేరానికొస్తారని ప్రభుత్వం పట్టించుకోలేదు. అయినాసరే బ్లాక్స్ ప్రభుత్వానికి లొంగలేదు. ప్రైవేటు ఆపరేటర్లపై కేసులు బనాయించి బెదిరింపులకు దిగి ఉద్యమాన్ని అణిచిపెట్టింది. మరింత ఎక్కువ ఛార్జీలు చెల్లించి వేరే ప్రైవేటు ఆపరేటర్స్‌తో తన ప్రజల అవసరాలను తీర్చింది బ్లాక్ మూమెంట్. చచ్చుకుంటూ... కాళ్ళబేరానికొచ్చింది ప్రభుత్వం. బ్లాక్స్ సగర్వంగా, చట్టబద్ధంగా సీట్లో కూర్చోని ప్రయాణించారు. తన ప్రజలకు కష్టాలను కలిగించకుండానే, శత్రువు(ప్రభుత్వం)ను లొంగదీసి లక్ష్యాన్ని సాధించిన స్ట్రాటజీ ఆఫ్ బ్లాక్ మూమెంట్ జిందాబాద్. మనం వాళ్ళనుండి ఏమైనా నేర్చుకున్నామో లేదో చూద్దాం.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం 2009 నవంబర్ అనంతరం ఇప్పటివరకు జరిగిన ఆందోళనలన్నింటికి విపరీతమైన ప్రాచుర్యం పొందిన పోరాట రూపం తెలంగాణ సకల జనుల సమ్మె. ప్రపంచంలో ఇప్పటివరకు ఇలాంటి అద్భుతమైన పోరాటం జరగలేదని పొలిటికల్ జెఎసి నాయకులు, పొలిటికల్ పార్టీ లీడర్స్ ఆకాశానికెత్తుతున్నారు. ప్రపంచంలోనే ఇలాంటి పోరాటం లేదని చెప్పడమంటే గొప్ప లక్ష్యాలను సాధించిన మహోద్యమాలన్నీ దీనికింద దిగదుడుపేనని, అహంకారపూరితంగా చెప్పడమే అవుతుంది. మంచి పేరు ప్రఖ్యాతులున్న యూనివర్సిటీ అధ్యాపకులు, కార్మిక వర్గ లక్ష్యాల కోసం నిబద్ధ ఉద్యమాలను చేపట్టిన సంఘాల నాయకులు కూడా ఈ ఉద్యమానికి లేని పవిత్రతను ఆపాదించి మాట్లాడుతుండటం, వ్యాసాలు రాయడం వారిలోని బాధ్యతారాహిత్యంగా భావించాలి. మన లక్ష్యం ఎంతటి ఉన్నతమైనదైనప్పటికీ అందుకోసం అనుసరిస్తున్న పద్ధతులు, వ్యూహాలు లక్ష్యాన్ని మరింత సులభంగా చేరుకునేట్లుగా, తన ప్రజలను సుదీర్ఘకాలం ఉద్యమంలో కొనసాగగల చైతన్యాన్ని అందించేదిగా పోరాట రూపాలుండాలి. కాని ఈ ఉద్యమంలో మొదటి లోపం విద్యార్థులు పాల్గొనకపోవడం. సకల జనుల సమ్మె కాలంలో ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీ విద్యార్థుల భాగస్వామ్యం పూర్తిగా నిల్. సమ్మె నుండి విద్యా

సంస్థలను మినహాయించాలని పొలిటికల్ జెఎసికి అనుకూలంగా, (మరో మాటలో చెప్పాలంటే అనుబంధంగా) ప్రవర్తిస్తున్న ప్రధానమైన విద్యార్థి జెఎసి కోరింది. సకల జనుల సమ్మెలో విద్యార్థులు సంపూర్ణంగా భాగస్వాములు కావాలంటె విద్యాసంస్థలు మూతపడకూడదని విద్యార్థి నాయకులు వాదించారు. విద్యార్థుల చేతుల్లోకి మరోమారు ఉద్యమ నాయకత్వం వెళ్ళొద్దని భావించిన నాయకులు స్కూళ్ళు, కాలేజీలను తాళాలు కూడా తెరవనివ్వలేదు. దీంతో సకల జనుల సమ్మె ఉద్యమం అంతా కేసీఆర్ దయా, కృపాకటాక్షాలతో ఒంటి చేత్తో కోదండరాం నాయకత్వం చెలాయించినట్టుగా తలచి ఇంత పెద్ద ఉద్యమం కేవలం ఆయన వల్లనే సాధ్యమనే సంకేతాలిచ్చారు. ఇలాంటి పద్ధతి ఏ ఉద్యమానికైనా ప్రమాదాలనే కొనితెస్తుంది. ఈ ఉద్యమంపట్ల సానుకూలత వ్యక్తమవడంలో నాయకుల కృషి ఎంతైనా ఉండవచ్చునుగాని, ఉద్యమానికి జీవాన్నిచ్చేది ప్రజల చైతన్యమే అంతిమం కదా! లక్ష్యాన్ని చేరుకోవాలనే ప్రజల నిబద్ధతను పక్కనపెట్టి కేవలం నాయకుడే అన్నింటిని సృష్టించగలడనేది ఏ ఉద్యమానికైనా ఉపద్రవాన్ని తెస్తుంది. అధికార (కాంగ్రెస్) పక్షం అమ్ములపొదిలో అద్భుతమైన వజ్రాయుధం కెసిఆర్, కోదండరామ్‌లు. ప్రత్యేక రాష్ట్రం తెలంగాణ ప్రజల స్వప్నం. ప్రధాన స్రవంతి రాజకీయాల్లోని అగ్రకుల వర్గ నాయకులకు తెలంగాణ ఒక క్రీడాంశం. అయితే సామాజిక అంశాన్ని అవగాహన చేసుకునే విషయంలో పాలకవర్గ ధృక్పథం, సామాన్య ప్రజల ధృక్పథాలమధ్య భిన్నమైన వైరుధ్యాలుంటాయి. ప్రజల అవగాహనే సంపూర్ణమైంది. ఈ విశాల ప్రజారాశుల ఆకాంక్షలే రాజకీయ నిర్మాణాలకు పునాదులౌతాయి. ఆ రాజకీయాలు అనేకమార్లు ప్రజాభీష్టానికి, ఆకాంక్షలకు విరుద్ధమైన ఘర్షణలను లేవదీస్తాయి. అసలు లక్ష్యాన్ని ప్రదర్శిస్తూ అగ్రకుల, వర్గ సమూహాలు తమ పొలిటికల్ ఎజెండాను ముందుకు తెస్తుంటాయి. సామాజిక లక్ష్యం నిత్యం చర్చనీయాంశంగానే ఉంటుంది. కాని అది అందజేసే ఫలితాలు సామాన్యులకు (సకలజనులకు) తక్కువగా. ప్రముఖ ఉద్యమ రాజకీయ నాయకులకు అధికంగా అందజేయబడ్తాయి. అయితే ప్రజలెప్పుడూ తమ అంతిమ లక్ష్యం కోసమే నిబద్ధతతో నిలబడుతారు. కాని సాధనా మార్గాలను సంపూర్ణంగా వారు మాత్రమే నిర్ణయించలేరు. రాజకీయ క్రీడలాడుతున్న నాయకత్వం ప్రజలను నామమాత్రం చేసి, వారి చైతన్యాన్ని తొక్కిపెట్టె వ్యూహాలను ఉద్యమాలుగా ఎంచుకుంటుంది.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనకోసమే పార్టీగా అవతరించామని చెప్పుకుంటున్నా కెసిఆర్‌ను 2002లో ఒక ప్రముఖ టీవీ ఛానల్ ఇంటర్వ్యూ చేసింది, ఆనాటి ఇంటర్వ్యూలో ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాలకు ప్రస్తుతం ఆయన కార్యాచరణకు మధ్య పెద్దగా వైరుధ్యం, వైవిధ్యం కన్పించడంలేదు.

మీ. ప్ర : నిజాం షుగర్ ఫ్యాక్టరీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సవాల్ విసిరిన మీరు, దమ్ముంటే షుగర్ ఫ్యాక్టరీ టెండర్స్ వేయాలని సవాల్ చేశారు. మరి ఇప్పుడేమో ఆ సంగతే మర్చిపోయినట్లున్నారు.

కెసిఆర్ : వియ్ డునాట్ వాంట్ స్ట్రీట్ ఫైట్, వాట్ వియ్‌ఆర్ డూయింగ్ ఈజ్ స్టేట్ ఫైట్. టెండర్స్ వేసే దగ్గర కాలర్స్, చొక్కాలు పట్టుకొంటె కాదు. కరెక్ట్ కాదు.

మీ. ప్ర : అసలు పోరాటమే పక్కన పెట్టినట్లుంది.

కెసిఆర్ : ఎస్, మేము పక్కనపెడ్తం, డెఫినిట్‌గా ఎందుకంటె తెగేదాక లాగం కదా!

మీ. ప్ర : బిడ్డర్స్‌తో మీరు మిలాఖత్ అయినట్లుంది.

కెసిఆర్ : అలా మాట్లాడేవాళ్ళను నేను సీరియస్‌గా తీసుకోను. అలాంటి వాళ్ళు ఆంధ్రోళ్ళిచ్చే డబ్బుతో మాట్లాడుతారు.

మీ. ప్ర : ఎన్నిక రాజకీయాలకు ప్రాధాన్యతనిచ్చి ప్రజా ఉద్యమాలను మర్చిపోయినారు?

కెసిఆర్ : ఉద్యమం అంటే రాళ్ళెత్తి కొట్టడమో, బస్సులు కాల్చడమో, ఆందోళనలు చేయడమో కాదు. మేము ఇష్యూ బేస్‌డ్ ఫైట్ చేసాం. (ఇదే మాటను పదేళ్ళుగా విద్యావంతుల వేదిక ప్రచారం చేసింది. మరిప్పుడేమో సమ్మెల గురించి మాట్లాడుతుంది.) తెలంగాణ రావడం రాజకీయ ప్రక్రియ ద్వారానే సాధ్యం, ఇతరత్రా రాదు. ప్రజలను రాజకీయ శక్తిగా, వాహికగా అవతరింపచేసి, వ్యూహాత్మకంగా వ్యవహరిస్తాం.

ఆయన మాటల్లోని చివరి వాక్యాలను స్పష్టంగా అర్థం చేసుకోగలిగితే రెండు ప్రధానమైన అంశాలు ఉద్యమకారులకు బోధపడతాయి. ఒక్కటి విశాల ప్రజానీకాన్ని సమీకరించి ఉద్యమించే పద్ధతులకు ఆయన పూర్తి వ్యతిరేకం. విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు, కార్మికులు, కుల సంఘాలు ఉద్యమాన్ని తమ కార్యాచరణగా ప్రణాళిక రచించుకున్న ప్రతిసారి ఈ నాయకుని అసంతృప్తి, అయిష్టత, బయటపడింది. ఓ.యు. జెఎసి మరియు టిఎస్ జెఎసి 2010లో నిర్వహించిన విద్యార్థి గర్జన సభను రద్దు చేసుకోమని ప్రభుత్వంతో పాటు కెసిఆర్ కూడా తీవ్రమైన వత్తిడి చేశారు. ఆయన్ను ఆ సభకు ఆహ్వానించడానికి విద్యార్థుల తరపున ప్రతినిధులుగా వెళ్ళిన యూనివర్సిటీ అధ్యాపకులే అందుకు ప్రత్యక్ష సాక్షులు. ఒక దశలో ప్రొఫెసర్లపై ఆగ్రహం కూడా వ్యక్తం చేశాడు. ఆయన బెదిరింపులకు భయపడి సభను వాయిదా వేసుకుందామని విద్యార్థులకు నచ్చచెప్పడానికి ప్రయత్నించిన వాళ్ళుకూడా కొంతమంది ఉన్నారు.

ఇలాంటిదే మరో సంఘటన, తెలంగాణా సాధనకోసం రాష్ట్ర రాజకీయాలను సవాల్ చేస్తూ టిఎస్ జెఎసి మరియు ఒయు జెఎసి చలో అసెంబ్లీకి పిలుపునిచ్చింది. టిఎస్ జెఎసిలొ తెలంగాణ రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం (టిఆర్ఎస్వి) కూడా ప్రధాన భాగస్వామ్య సంస్థ విద్యార్థుల సృజనాత్మకమైన ఉద్యమ రూపాల మూలంగా క్షీణిస్తున్న తన రాజకీయ ఎదుగుదలకు తిరిగి ప్రాణం పోసుకోవడానికి కొంతమంది విద్యార్థి నాయకులను లొంగదీసుకుంటున్న దశ అది. సరిగ్గా ఇలాంటి సమయంలో చలో అసెంబ్లీ విజయవంతమైతే, నిలబెట్టుకుంటున్న తన అధికారం మరోప్రక్కనుంచి కూలుతోందని భావించారు. అందుకే చలో అసెంబ్లీని రద్దు చేసుకోవాలని విద్యార్థులను హెచ్చరించాడు. కెసిఆర్తో మొదటినుండి దూరంగా ఉంటున్న సమూహాలు టిఎస్జెఎసిలో అధికంగా ఉండటం మూలంగా అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం రద్దు కాలేదు. అసెంబ్లీ ముట్టడివల్ల పోలీసు కాల్పులు జరుగుతాయని, అందుకే టిఆర్ఎస్వి అందులో పాల్గొనబోదని, మా కార్యకర్తలెవ్వరూ పాల్గొనరని విద్యార్థి సంఘ నాయకుని ద్వారా ప్రకటన చేయించారు. కానీ తీర్మానంలో వారి సంఘానికే చెందిన మరో నాయకుడు అంగీకరించాడు.తెలంగాణ పేరుతో రాజకీయ క్రీడలాడాలనుకుంటున్న వారిని అదే సమయంలో వ్యక్తిగత ప్రతిష్ఠ, పేరు ప్రఖ్యాతులు, కీర్తి గడించటంకోసం పాలకులాడుతున్న కొంతమంది ఉద్యమ నాయకులపై ప్రజలు విశ్వాసం ఉంచుతూనే నిత్యం ముళ్ళుకర్రతో పొడుస్తున్నట్లుగా అనేక సంఘటనలు రుజువుచేసాయి. అందులో ఒక సంఘటన మిలియన్ మార్చ్. అయితే ఈ మిలియన్ మార్చ్ వల్ల ప్రజల, ఉద్యమకారుల లక్ష్యం దెబ్బతిన్నది. కోస్తాంధ్ర , తెలంగాణ రాజకీయ నాయకుల పెట్టుబడిదారుల లక్ష్యం నెరవేరింది. అంతిమంగా ఉద్యమకారుల దృష్టి ఇతరత్రా విషయాలపై మరలకుండా పోలీసులే సహకరించి విగ్రహాలను నేలమట్టం చేయించారు. ఉద్యమకారుల అమాయకత్వం నాయకులకు అపర వరంగా మారిపోయింది. లేకుంటే విగ్రహాలు కూల్చడానికి సాధారణ కార్యకర్త, విద్యార్థి, కార్మికుడి నుండి మొదలు పోలీసు అధికారి వరకు పరస్పరం సహకరించుకోవడం వింతగా లేదూ. ఈ విషయంలో అంతిమంగా ప్రభుత్వం, కాంగ్రెస్దే విజయం. అందుకు అన్ని విధాల ఉపయోగపడ్డ ఇన్స్ట్రుమెంట్స్ కెసిఆర్, కోదండరామ్లు. ప్రజల ముందు తమ విశ్వసనీయతను ప్రకటించుకోవడానికి వీరిద్దరికి ఈ సంఘటన మరింత బలాన్ని చేకూర్చిపెట్టింది. మిలియన్మార్చ్కు లక్షలాదిగా తరలిరాకుండా వ్యూహాన్ని రచించిన నాయకుడు, రియల్ పొలిటిషియన్ కెసిఆర్. ఈమధ్యకాలంలో మన కళ్ళముందే కనిపిస్తున్న నగ్నసత్యం పోలవరం ప్రాజెక్టు టెండర్స్. 2002లో నిజాం షుగర్ ఫ్యాక్టరీలను తొలగించడానికి వేసిన టెండర్స్లో లోపాయికారిగా వ్యవహరించి బిడ్డర్స్కు అమ్ముడుపోయిన నాయకుడు 2011లో స్వయంగా తన పార్టీ నాయకత్వమే పోలవరం టెండర్స్ దక్కించుకునే లాభసాటి కార్యాన్ని చేపట్టాడు. ఆదివాసీల జీవితాలను సర్వనాశనం చేస్తున్న బడాపెట్టుబడిదారి వర్గంలోనే టిఆర్ఎస్ భాగస్వామ్యం కావడం అత్యంత దుర్భరమైన సన్నివేశం. రాజకీయ ఎజెండాను ముందుపెట్టి ప్రజలను తెగనమ్ముకోవడమంటె ఇదే. లాటిన్ అమెరికా, ఆఫ్రికా ఖండాల్లోని విలువైన ఖనిజ సంపదను బడాబాబులకు, మల్టీనేషన్ కంపెనీలకు కట్టబెట్టడానికి తనజాతి ప్రజలను ఊచకోత కోస్తున్న అరాచక ఆయుధ ముఠాలు గుర్తుకొస్తాయి. కసాయివాడు మేత వేసి మేక

తల తెగనరికినట్టే, పోలవరం, పులిచింతల ప్రాజెక్టులు నిర్మిస్తే నెత్తురు ఏరులై పారుతుందన్న ఈ (మహా) నాయకుడే ప్రాజెక్టు నిర్మాణంలో భాగం కావడం ఎలాంటి చాతుర్యమో. దీన్ని ప్రశ్నించిన వాళ్ళు ఎవరైనా(నికార్సైన తెలంగాణవాదులైనా) సరే ఆంధ్రులకు అమ్ముడుపోయినట్లే. హిందూ ఉన్మాదుల దేశభక్తికి, తెలంగాణ వాదుల ప్రాంతీయ భక్తికి పెద్ద తేడా కన్పిస్తలేదు.

గత చారిత్రక సందర్భాలను సంఘటనలతో సహా చర్చించడంలోని ఉద్దేశ్యం ఆయా వర్గాలకు తెలంగాణ ప్రజా ఉద్యమాన్ని నిర్మించడం ప్రాధమికంగానే (వ్యూహం) ఇష్టంలేదు. అలాంటి శక్తులు, సంస్థలు, వ్యక్తులు, వారి రాజకీయాలతో పాటు అలయెన్స్‌లు కట్టడమంటె ప్రజల చైతన్యాన్ని తెగనమ్మటమే. ఇక్కడే చర్చించాల్సిన మరో ప్రధానమైన విషయం. ప్రస్తుతం రాజకీయ జెఎసికి నాయకుడుగా వ్యవహరిస్తున్న కోదండరాం, ఆయనగారి వానరసేనకు కూడా ఉద్యమాన్ని కొనసాగించడం ఇష్టంలేదు. అయినా కొన్ని సందర్భాలలో ప్రజావత్తిడి వల్ల ఉద్యమ కార్యక్రమాలను రూపొందించాల్సివచ్చింది. జెఎసి ఏర్పడటానికంటె ముందు కోదండరామ్ తెలమగాణ విద్యావంతుల వేదికకు నాయకుడు. ఈ సంఘ నిర్మాణంలో అత్యధికులు రాడికల్ లెఫ్ట్, మరియు అగ్రకుల విద్యావంతులే అధికం. ఈ సంస్థ ఏర్పడినది మొదలు ఈనాటి వరకు రాజకీయ ప్రక్రియ, లాబీయింగ్ ద్వారానే తెలంగాణ సాధ్యం ఇతరత్రా మార్గాలతో అసాధ్యం, వృధా ప్రయత్నమని చెప్తూ వచ్చారు. ఎన్ని ఉద్యమాలు చేసినా రాజకీయ ప్రక్రియ అనివార్యం (తప్పనిసరి) కాబట్టి టిఆర్ఎస్‌తో ఐక్యతగా వ్యవహరిస్తున్నామని ఇవ్వాళ చెప్తున్నారు. కాబట్టి టిఆర్ఎస్‌కు ఓట్ల సాధనా యంత్రంగా పనిజేస్తూ వేలాది కార్యకర్తలను నిబద్ధతతోనడిపిస్తున్న పటిష్ఠమైన నాయకుడాయన. మరి రాజకీయ ప్రక్రియను ఒకవైపునుండి గుర్తిస్తూనే పాలకులు తెలంగాణ ప్రజల ఆకాంక్షను గుర్తించాల్సిన, నెరవేర్చాల్సిన అనివార్య పరిస్థితి సృష్టించాలంటే ప్రజా ఉద్యమం అనివార్యమని చెప్తున్న వివిధ పోరాట రూపాలను తన స్థాయిలో నిర్మిస్తూ వస్తున్న తెలంగాణ ఐక్యకార్యాచరణ కమిటితో ఎందుకు అలయెన్స్ కట్టలేదొ.

ఇక సకల జనుల సమ్మెను రూపకల్పన చేసిన ఆధిపత్య (కుల, వర్గ) శక్తుల సహజ మూలాలనుండి సామాన్య జనులు (కొంతమంది పెటీ బూర్జువాలు కూడ) పెద్దఎత్తున పాల్గొన్న సమ్మెను గురించి మాట్లాడుకుందాం. మొత్తం సకల జనుల సమ్మె విజయం వెనుక బలమైన రాజకీయేతర శక్తి సింగరేణి కార్మికులు. 2009–10 విద్యార్థుల మహాఉద్యమం తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సీరియస్ ఆలోచనలోకి నెట్టిన ఉద్యమ కార్యక్రమం సింగరేణి కార్మికుల సమ్మెయే. దీనికి కారణం బొగ్గుగని పారిశ్రామిక రంగం గత నేపథ్యంకూడా కారణమై ఉండవచ్చు. అనేక దశాబ్దాలుగా బొగ్గుగనులు నిక్షిప్తమైన ప్రాంతంలోని అనేక రకాలైన నిబద్ధ సంఘర్షణలు భూమికగా పనిచేసి ఉండవచ్చు. సకల జనుల సమ్మె ఎలాంటి విజయాలు, ఫలితాలు సాధించకపోయినా సింగరేణి కార్మికవర్గం తెలంగాణ ప్రజలకు, ఉద్యమకారులకు అందించిన ఆత్మవిశ్వాసం అనంతమైనది. సింగరేణి కార్మికుల్లో అనేక సమూహాల అస్థిత్వాలు, ఆధిపత్యాలు ఉన్నప్పటికీ మొత్తం సమ్మెకు నైతిక బలంతో పాటు ఉద్యమ నిబద్ధతను అందించగల్గింది. ఎంతటి ఘనమైన ఉద్యమంలోనైనా చిన్నవో, పెద్దవో లోపాలుంటాయి. సింగరేణి కార్మికులతోపాటు, ఆర్‌టిసి, ఎంప్లాయిస్, టీచర్స్ సమ్మె విరమణ కాలంలో ప్రభుత్వం ముందుంచిన ఒప్పందం, మొత్తం ఉద్యమ (సమ్మె) స్ఫూర్తినే దెబ్బతీసేదిగా, అవమానించేదిగా మారింది. కొన్ని రోజుల సింగరేణి సమ్మె కనీసం పర్యావరణ పరంగా ఆ ప్రాంతంలోని ప్రజలకు ప్రశాంతతను కల్పించింది. ఇంకా కొద్ది మొత్తంలోనైనా బొగ్గు నిల్వలను ఖర్చు చేయకుండా కాపాడుకోగల్గాం.

ఇకపోతే ఆర్‌టిసి కార్మికుల సమ్మెను తన ప్రజలకు తానే సహాయాన్ని నిరాకరించిన దృష్టాంతంగా అర్థం చేసుకోవాలి. ఆర్‌టిసి కార్మికుల బ్రతుకులు ఆ కార్పొరేషన్ దయా దాక్షిణ్యాలు, అభివృద్ధిపైనే ఆధారపడిఉన్నాయి. ఇప్పటికే బొత్స సత్యనారాయణ "అన్నిసార్లు ఆర్‌టిసిని ఆదుకోలేము కదా!" అని బెదిరిస్తున్నాడు (చేతులెత్తేస్తున్నాడు). కార్పొరేషన్ ఖచ్చితంగా ఉంటె కార్మికుల కుటుంబాలు కళకళలాడుతాయి. వాళ్ళ జీవితాలు ఫణంగాపెట్టి సమ్మెలోకి

దించిన వైనం అత్యంత దుర్మార్గమైనది. మీరుకూడా సమ్మెలోకి వస్తె మూడు రోజుల్లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రకటన వస్తుంది అని ఆర్టిసి కార్మికులను రెచ్చగొట్టి, వారిని అమాయకంగా ముగ్గులోకి దించారు. తెలంగాణ సాధించే క్రమంలో మన భాగస్వామ్యం కూడా ఉంటుందనే కీర్తికోసం కార్మికులను ఉద్యమంలోకి దింపారు కాని అమెరికన్ బ్లాక్స్ మూమెంట్‌ను ఆదర్శంగా తీసుకొనిఉంటే ఆదర్శవంతమైన ఉద్యమాన్ని నడపటమే కాకుండా సమ్మె కాలంలో ఆర్టిసి రెట్టింపు లాభాలను సమకూర్చుకుని ఉండేది. ప్రస్తుత సమ్మె సక్సెస్‌కంటే ఎక్కువగా కార్మికులు (ఆర్టిసి) పెద్దగా ఇబ్బంది పడకుండానే ప్రభుత్వాలను, సీమాంధ్ర రవాణా పెట్టుబడిదారులను తీవ్రంగా నష్టపర్చి ఉండేది. వ్యూహమో ఎత్తుగడలో రచించకుండా సమ్మె రూపకల్పన చేయడంవల్ల తెలంగాణ ప్రజలు, ఆర్టీసి కార్మికులే తీవ్రంగా నష్టపోయారు. తెలంగాణ పేద ప్రజల (ప్రయాణికుల నుండి) నుండి ఈ ప్రాంతానికే చెందిన చిన్నా చితకా ప్రైవేటు ఆపరేటర్స్ రెట్టింపు ఛార్జీలను వసూలు చేసి ఇబ్బందులకు గురి చేశారు. సీమాంధ్ర ప్రైవేటు, ప్రభుత్వ బస్సులను తెలంగాణ సరిహద్దులకు మాత్రమే అనుమతించి ఉంటే బాగుండేది. వేల సంఖ్యలో సీమాంధ్ర బస్సులు తెలంగాణ భూభాగం నుండే ప్రయాణించాల్సి ఉంది. వాటిని నిలుపుదల చేసివుంటే తెలంగాణ ఆర్టీసీ డిపోలకు కోట్లలో అధికంగా ఆదాయం సమకూర్చుకుని సీమాంధ్ర ప్రైవేటు బస్సు ఆపరేటర్లను, ప్రభుత్వాన్ని వ్యూహాత్మకంగా దెబ్బకొట్టగల్గేవారిమి. కాని ఈ సమ్మెలో ఆర్టీసి కార్మికులు సంపూర్ణంగా పాల్గొనడంవల్ల మన ప్రజలకు మనమే అనేక కష్టాలు కల్పించడమే కాకుండా, దయాదాక్షిణ్యం లేకుండా ముక్కులుపిండి అధికంగా వసూళ్ళు చేసే ప్రైవేట్ ఆపరేటర్లకు అవకాసం కల్పించాం. ప్రజలు, కార్మికవర్గం తీవ్రంగా నష్టానికి గురైనారు. నల్లజాతిని ఆదర్శంగా తీసుకునేరోజు తెలంగాణ ఉద్యమాల్లో భవిష్యత్తులోనైనా రావాలని ఆశగా ఎదురుచూద్దాం. సామాజిక, ఆర్థిక, విద్యా, న్యాయ, మీడియా రంగాల్లో ప్రముఖులైన వ్యక్తుల భాగస్వామ్యం ఈ సమ్మెలో ఉన్నప్పటికి, వివిధ రంగాల ప్రముఖులు ప్రణాళికాబద్ధంగా రూపొందించిన క్రమబద్ధత, క్రమశిక్షణ , వ్యూహాత్మక నైపుణ్యం ఏమాత్రం ఈ సందర్భంలో కన్పించలేదు. రాజకీయ జెఎసి సమ్మెను మరింతకాలం నడపలేక చేతులెత్తేస్తూ “ఇది విరమణ కాదు విరామం” అని ప్రకటించారు. కాని కాలం కలిసిరాక, చేసేది ఏమిలేక, నిరాశ, నిస్పృహలతో ప్రభుత్వం ముందు తప్పనిసరి పరిస్థితులలో మోకరిల్లిన వైనం ప్రజలకు బాగానే అర్థం చేయించగలిగారు. వీరి ఉద్యమం ఎంతకాలం కొనసాగగలదనే ఆలోచనలు ప్రభుత్వానికి స్పష్టంగా ఉన్నాయి. కాబట్టి పెద్దగా బెంబేలెత్తినట్లుగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం కనిపించలేదు. మందీ మార్భలంతో ఢిల్లీ వెళ్ళిన కెసిఆర్ “ప్రధాన మంత్రికి తెలంగాణలో ఏం జరుగుతుందో చాలా స్పష్టంగా అర్థమయింది. ఇది చాలా మంచి పరిణామం” అని తెగ మురిసిపోయారు. ఏలినవారు మనగోడు వినడానికి కూసింత సమయం ఇవ్వడం మన నాయకులకు తెగ ఆశ్చర్యం కల్గించి, తెలంగాణ వచ్చినంత సంబరపడిపోయారు.

కార్మికవర్గ ఉద్యమాల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న నాయకులు, మేధావులు కూడా సమ్మెలో మెళుకువలను సృష్టించలేకపోయారు. శంకర్‌గుహ నియోగి, దత్త సామంత్ లాంటి కాకలుదీరిన కార్మికవర్గ యోధులు, నిబద్ధులులేకపోవడం కూడా ఈ ఉద్యమాన్ని సరికొత్త దిక్సూచిగా మలచలేకపోవడానికి కారణమై ఉండవచ్చును.

సీమాంధ్ర పెట్టుబడిదారి వర్గాన్ని ఆర్థికపతనం దిశగా నడిపించగల మహత్తరమైన ఉద్యమాన్ని నిర్మించలేకపోవడానికి నాయకత్వం యొక్క అవగాహనారాహిత్యంగా అర్థం చేసుకోవడం మూరఖత్వమే అవుతుంది. తెలంగాణ ఉద్యమ నాయకత్వం సీమాంధ్ర పెట్టుబడిదారీ వర్గాన్ని తిట్టిపోయడం నిత్యకృత్యం. కాని ఆ అగ్రకుల (కమ్మ, రెడ్డి, రాజు) వర్గ పెట్టుబడిని విధ్వంసం చేయకుండానే ఈ ఉద్యమం అనేక మలుపులు తిప్పబడ్తుంది. దీన్ని ఖచ్చితంగా మార్క్సిస్టు, అంబేధ్కరిస్టు ధృక్పథం నుంచి పరిశీలన చేసినపుడు స్పష్టమౌతుంది. ఉద్యమం ప్రజల చేతుల్లోకి,వారి బిడ్డలైన ఓయు, కేయు విద్యార్థుల చేతుల్లోకి వెళ్ళినప్పుడల్లా అతిపెద్దకుదుపులతోమలుపులు తిప్పే ప్రయత్నం జరుగుతుంది.

తెలంగాణలో రాజకీయ నాయకత్వానికి (అగ్రకుల, వర్గ) అతీతంగా ప్రజలే స్వతంత్రంగా

ఉద్యమిస్తున్నారనుకున్నప్పుడే పాలకులు పరిశీలించే ధృక్పథం పాజిటివ్‌గా ఉంటుంది. ప్రజా ఉద్యమాన్ని రాజకీయ నాయకత్వం అదుపు చేయగలదనుకున్నప్పుడు సమస్యకు పరిష్కారం ఉండకపోగా, రసవత్తరమైన రాజకీయ ప్రక్రియ (పొలిటికల్ గేమ్) నాటకీయంగా నడుస్తుంది. అయితే రాజకీయ అవసరాల కోసం సమస్యను సజీవంగా నడపడం, పరిష్కరించడం అనేది దీనికి పూర్తిగా భిన్నమైనది. మూడు రాష్ట్రాలను ఏర్పాటు చేసిన బిజెపి తెలంగాణ, యు.పి.ల విభజనకొచ్చేసరికి అనుసరించే వైఖరి లాంటిది. తన రాజకీయ అవకాశాలకుచిన్న రాష్ట్రాల డిమాండ్ బాగా వర్కవుట్ అవుతుందనుకుంటే జాతీయస్థాయిలో పెద్దఎత్తున చర్చ, ఉద్యమాన్ని కాంగ్రెస్సే సృష్టించగలదు. కాని ఇపుడు అది పరిష్కరించాల్సిన అంశాలు (చిన్న రాష్ట్రాల డిమాండ్స్‌కాకుండా) అనేకం ఉన్నాయి.

అయితే సకల జనుల సమ్మెలో పెద్దయెత్తున ప్రజలు, ఉద్యోగులు, కార్మికులు భాగస్వాములవ్వడం చాలా అద్భుతమైన స్పందనే. కాని ఉద్యమంలో విస్తృత భాగస్వామ్యం అందిస్తూనే నడిపిస్తున్న నాయకత్వాన్ని సంపూర్ణంగా విశ్వసించలేకపోతున్నాయి. దీనికి కారణం ఉద్యమించడం ద్వారానే లక్ష్యాన్ని సాధించగలమనే సహజ స్వభావం ఉన్న రాజకీయ నాయకత్వం లేకపోవడం. కేవలం రాజకీయ ప్రక్రియ మాత్రమే అనివార్యంగా రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తుందనే నాయకత్వం సృష్టించిన సునామి సమ్మె ప్రజలకు నష్టాన్ని కాకుండా లాభాన్ని ప్రయోజనాన్ని చేకూరుస్తుందని మనం ఎలా ఆశించగలం. నిత్య పోరాట చైతన్యాన్ని వ్యక్తీకరిస్తున్న తెలంగాణ జనసామాన్యానికి నీరాజనాలు. ప్రజల ఆకాంక్షలను అసాధ్యం చేస్తూ ఉద్యమాల్ని నాటకీయంగా మలుస్తున్న రాజకీయ (యేతర) నాయకత్వం పట్ల కూడా నిత్య చైతన్యశీలత ప్రదర్శించబడాలి. ■

**– సుదర్శన్ బాలబోయిన**
రిసెర్చ్ స్కాలర్, (ఔస)
ఉస్మానియా యూనివర్సిటీ
ఇ మెయిల్: sudaou@gmail.com




*సకల జనుల సమ్మె సందర్భంగా జల సౌధలో నినాదాలు చేస్తున్న శ్రీధర్ దేశ్‌పాండే, వెంకటేశం తదితరులు. తేది : 24-09-2011*

# విభజన సీమాంధ్రకే మేలు

**– కారుమంచి చైతన్య, అయ్యంగారి రాఘవశర్మ**

'దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్' అన్న గురజాడ మాటలను మనం సరిగ్గా అర్థం చేసుకున్నామా? రాష్ట్ర విభజన అంటే మట్టి విభజనే కానీ మనుషుల విభజన కాదు కాదా. ఇన్ని సంవత్సరాలుగా కలసివున్నా సఖ్యత కుదరలేదు. అందువల్ల సమైక్యతా లేదు. సఖ్యత లేని సమైక్యత ఆధిపత్యమే అవుతుంది కాని నిజమైన సమైక్యత కాదు. పెట్టుబడిదారులకు లాభాపేక్ష తప్ప ఆత్మ గౌరవం ముఖ్యం కాదు. వారు సమైక్యమన్నా జాతీయ జెండా భుజాన వేసుకుని జాతీయ వాదమన్నా దాంట్లో వారి లాభాపేక్ష దాగి ఉంది. కావున వారు విభజనను తమ స్వభావరీత్యా వ్యతిరేకిస్తారు. అయితే గత కొన్నేళ్ళుగా 'జాగో–భాగో', 'మొత్తం సీమాంధ్రులు అంతా వలసవాద దోపిడీదారులు' అని, 'అడ్డమొస్తే నరుకుతామని' ....ఇలా పలురకాలుగా తెలంగాణ వాసులు తమ అయిష్టతను వ్యక్తం చేస్తున్నారు. సీమాంధ్రులను బాహాటంగా ఛీదరిమచుకుంటున్నారు. ఇలా సీమాంధ్రుల ఆత్మ గౌరవానికి సవాళ్ళు విసురుతూ ఉంటే, ఏమైనా ఫరవాలేదులే మీరు తిట్టినా, కొట్టినా నిస్సిగ్గుగా ఇంకా కలిసే ఉండాల అని మనం (సామాన్య సీమాంధ్రులు) వాదిస్తే మనకంటూ ఒక ఆత్మగౌరవం ఉన్నట్టా? లేనట్టా? ఈ సందేహం సహజంగానే కలుగుతుంది. తెలంగాణ వాళ్ళు అన్నట్టు మనమందరం ఆత్మగౌరవం లేని వాళ్ళుగా అంటే పెట్టుబడిదారులు, దోపిడీదారులు, వలసవాదులుగా మిగిలిపోవాల్సినదేనా? ఇంతకీ విభజన జరిగితే మనకొచ్చే నష్టం ఏమిటి? మనం ఆలోచించాల్సిన అవసరం లేదా? జాగ్రత్తగా ఆలోచించి, ఖచ్చితమైన ప్రతిపాదనలు ముందుంచి అది విభజనకు అంగీకరిస్తే సీమాంధ్రకు లాభమే కాని నష్టం వాటిల్లదు.

విభజన జరిగితే నదీజలాల సమస్య తలెత్తగలదని సీమాంధ్రలో అనుమానాలు ఉన్నమాట వాస్తవం. అయితే తెలంగాణ విడిపోతే సీమాంధ్రకు అసలు నీళ్ళు రావని అనడం రాజకీయం కాని వాస్తవం కాదు. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు నదీ జలాలను పంచుకొంటున్నాయి. ఉదాహరణకు నైలు నదీ జలాలను పదకొండు దేశాలు వాడుకొంటున్నాయి. మన దేశంలో గంగ, గోదావరి, నర్మద, కృష్ణ, కావేరీ నదీ జలాలను పలు రాష్ట్రాలు పంచుకుంటున్నాయి. నదీ జలాల పంపకాలపై అంతర్జాతీయ, జాతీయ చట్టాలు ఉన్నాయి. ఆ ప్రకారంగానే రేపు, కృష్ణా, గోదావరి నదీ జలాలను తెలంగాణ, సీమాంధ్రుల మధ్య పంపకం చేయవచ్చు. అయితే ఇక్కడ సమస్యలేమీ ఉండవని అర్థం కాదు. సమస్యలు ఉంటాయి, కానీ వాటి పరిష్కారానికి మెరుగైన మార్గాలను ఎంచుకోవడంలో చాకచక్యత చూపించాలి. ఉదాహరణకు ప్రస్తుతమున్న ట్రిబ్యునల్ వ్యవస్థలోని లోపాలను సరిదిద్దే ఆలోచనలు చేయాలి. నదీ జలాల సమస్య జాతీయ సమస్య కాబట్టి ఒక రాజ్యాంగ / చట్టబద్ధ జాతీయ నదీ జలాల అధారిటీని పార్లమెంటు ద్వారా ఏర్పాటు చేయాలి. దానికి సంపూర్ణ అధికారాలు ఇచ్చి దేశంలోని నదుల నీటిని పంచే బాధ్యతను అప్పగించాలి. ఈ పంపకంలో రాష్ట్రాల ప్రమేయం లేకుండా చేస్తే నదీజలాల సమస్యలు తీరే అవకాశం ఉండవచ్చు. కావున వీటికి సంబంధించిన నిర్దిష్టమైన ప్రతిపాదనలు పెట్టాలి.

హైదరాబాద్ నగరం నేడు సీమాంధ్ర విద్యావంతులకు ప్రధాన మజిలీగా మారింది. ఇందులో సందేహం లేదు. విభజన జరిగితే ఈ సౌలభ్యం చేజారుతుంది అనుకోవడం ఒక అపోహ మాత్రమే. చదువుకున్న, నైపుణ్యత

కలిగిన యువతకు నేటి ప్రపంచీకరణ నేపథ్యంలో మజిలీలు దేశ విదేశాలలో చాలా ఉన్నాయి. అంత మాత్రాన వాటిపై రాజకీయ ఆధిపత్యం కోరుకోవడం లేదే! మరి ఒక్క హైదరాబాదు పైనే ఎందుకు? హైదరాబాదును మనమే (సీమాంధ్రులు) అభివృద్ధి చేసినాము అనడం కూడా రాజకీయమే కాని చారిత్రక వాస్తవం కాదు. హైదరాబాద్‌లో వివిధ రాష్ట్రాల, దేశాల వారు పెట్టుబడులు పెట్టి వారి వ్యాపారాలు వారు చేసుకున్నారు. అలాగే సీమాంధ్ర పెట్టుబడిదారులు వ్యాపారులు కూడా. విభజన జరిగితే హైదరాబాదుపై సీమాంధ్రుల రాజకీయ పెత్తనం మాత్రమే పోవచ్చు కాని వ్యాపార నష్టం జరగదు. ఎందుకంటే సీమాంధ్రుల పెట్టుబడి వ్యాపారాలు కేవలం హైదరాబాదుకు పరిమితం కాలేదు. పలు రాష్ట్రాలలో, దేశాలలో (ఒక్క సీమాంధ్రలోనే అంతగా లేవు!) నిర్విఘ్నంగా కొనసాగుతున్నాయి. వాస్తవంగా ఆలోచిస్తే నేటి ప్రపంచీకరణ నేపథ్యంలో ఒక అంతర్జాతీయ నగరంగా రూపుదిద్దుకున్న హైదరాబాద్‌కు ఎప్పుడూ కూడా నైపుణ్యత కలిగిన సీమాంధ్ర, ఇతర రాష్ట్రాల యువతకు కూడా మజిలీగా కొనసాగే లక్షణాలు ఉన్నాయి. అవి కనుమరుగయ్యే అవకాశాలే లేవు. పోగా కొత్త సీమాంధ్ర రాష్ట్రం ఏర్పడితే కొంగొత్త అవకాశాలు (తెలంగాణకు సాధ్యం కాని) సీమాంధ్ర యువతకు మెండుగా వస్తాయి.

రాష్ట్ర విభజన జరిగితే ప్రస్తుతం హైదరాబాదు ఇతర తెలంగాణ ప్రాంతాలలో ప్రభుత్వ రంగంలో (ప్రైవేట్ రంగంలోని వారిని, కేంద్ర ప్రభుత్వరంగం వారిని, ఇతర స్వచ్ఛంద రంగాలవారిని ముట్టుకోవడం కుదరదు) పనిచేస్తున్న సీమాంధ్ర వారినందరినీ వారి వారి ప్రాంతాలకు తరలిస్తారు అనడం ఆచరణ సాధ్యం కాదు. ఇప్పటికే అమలులో ఉన్న చట్టాల ప్రకారం వీరంతా స్థానికులు అయినారు.

సీమాంధ్ర రాష్ట్ర నూతన రాజధానిని ప్రస్తుతమున్న ఏ సీమాంధ్ర నగరంలో ఏర్పాటు చేయరాదు. ఇరు ప్రాంతాలకు అనుకూలంగా ఉండే ప్రాంతంలో నూతన రాజధాని నిర్మించాలి. తద్వారా కొత్త ప్రాంతంలో నూతన రాజధాని నిర్మించాలి. తద్వారా కొత్త ప్రాంతంలో నిర్మాణ రియల్ ఎస్టేట్ వ్యాపారాలతో పాటు ఉపాధి అవకాశాలు కూడా ఉత్పన్నమవుతాయి. ఇవన్నీ సీమాంధ్రులకే దక్కుతాయి. కొత్త రాజధానిలో కొత్త సచివాలయం, హైకోర్టు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు అవడం వల్ల మరల తెలంగాణ వారికి లేని కొంగొత్త ఉద్యోగ అవకాశాలు సీమాంధ్ర యువతకే లభ్యం కాగలవు. కొత్త రాజధాని నిర్మాణం పూర్తయ్యేవరకు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఉండాలి.

విభజన జరిగి కొత్త రాజధాని వస్తే దానిలో, సీమాంధ్రలోని ఇదివరకే అభివృద్ధి చెందిన నగరాలలో కొత్త పెట్టుబడులు వ్యాపారాలు మొదలయ్యే అవకాశాలు కూడా చాలా ఉండవచ్చు. అక్కడ ఏర్పడే కొత్త ప్రభుత్వ చొరవ, సంకల్పం, పనితనం, సామర్థ్యాలపై (నిజానికి ఇవి సీమాంధ్రులు తలచుకుంటే అసాధ్యమైనవి కావు) ఇవి ఆధారపడే ఉంటాయి. ఇవే కాకుండా తెలంగాణకు లేని ప్రకృతి వనరులతో కూడిన పొడవైన తీరప్రాంతం సీమాంధ్రకు ఉంది. ప్రపంచ అభివృద్ధి చరిత్రలో తీరప్రాంతాలు అభివృద్ధి చెందినంతగా భూపరివేష్టిత ప్రాంతాలు అభివృద్ధి చెందలేదు. ఇంతవరకు సీమాంధ్ర తీరప్రాంతం అభవృద్ధికి నోచుకోక పోవడానికి ఇక్కడి పాలకుల, పెట్టుబడిదారుల సంకల్ప లోపమే కారణం. కొత్త సీమాంధ్ర రాష్ట్ర ఏర్పాటు వీటిని అధిగమించే అవకాశాలను ఇస్తుంది.

రాయలసీమ అభివృద్ధి అంశానికి సంబంధించి ఈ ప్రాంతం ప్రస్తుత రాష్ట్ర ఇతర ప్రాంతాలకంటే వెనుకబడినది. రాజకీయంగా చూస్తే నీలం సంజీవరెడ్డి మొదలుకొని కిరణ్ కుమార్ రెడ్డి దాకా రాష్ట్రానికి అత్యధిక ముఖ్య మంత్రులను అందించిన ప్రాంతం రాయలసీమే. ఇంతమంది దిగ్గజాలు ఉన్నా ఆ ప్రాంతం అభివృద్ధికి దూరంగా ఉండడానికి కారణం నాయకుల స్వప్రయోజనాలే. వాస్తవాలను పరిశీలిస్తే వెనుకబడ్డ ప్రాంతం కాదు, వెనుకబడవేయబడ్డ ప్రాంతంగా చెప్పాల్సి ఉంటుంది. ఇక్కడ ఉన్న ఖనిజ సంపద ఇతర ప్రాంతాలలో లేదు. ఇక్కడ అపారమైన ఖనిజ వనరులు, ఇనుము, యురేనియం, బంగారం, స్టెయటైటు, క్వార్ట్జు, టన్గుస్టను, గ్రనేటు మొదలైనవి ఉన్నాయి. ఇవన్నీ కూడా ఈ ప్రాంతానికి ప్రకృతి ప్రసాదించిన వనరులే. అయినప్పటికీ వీటిలో ఇక్కడి ప్రజల భాగస్వామ్యం, హక్కులు కోల్పోయి కేవలం ప్రయివేటు ప్రయోజనాలకే కొల్లగొట్టబడుతున్నాయి. అందువల్లనే ఇక్కడి రాజకీయ

నాయకులు అత్యంత ధనవంతులు కాగలుగుతున్నారు. ప్రజలు మాత్రం వారి భూస్వామ్య, ఫాక్షను రాజకీయాలకు బలి పశువులు అవుతున్నారు. కావున ఈ ప్రాంతం, ఇక్కడి ప్రజలు అభివృద్ధికి ఇక్కడి రాజకీయనాయకులు వారి సంకుచిత, స్వార్ధ రాజకీయాలే కారణం ఇక్కడి ప్రజల రాజకీయ చైతన్య స్థాయి పెరిగి ఇక్కడి రాజకీయ నాయకులను, రాజకీయాలను ఎదుర్కొన్న నాడే ఈ ప్రాంతం బాగుపడగలదు.

సీమాంధ్రలో సాధ్యం కాగల పైన తెలిపిన అవకాశాల గురించి ఆలోచించకుండా సామాజిక, ఆర్థిక, రాజకీయ చతురతతో కూడిన ప్రతిపాదనలను ముందుంచకుండా, వాటిపైన చర్చించకుండా, కేవలం ఎప్పటికీ సఖ్యత ఒనగూరని సమైక్యరాగాలాపన చేయడం సీమాంధ్ర సామాన్య ప్రజలకు (రాజకీయ నాయకులకు, పెట్టుబడిదారులకు కాదు) ఒక వృథా ప్రేలాపనే అవుతుంది.

రాష్ట్రంలోని రెండు ముఖ్య పార్టీలు కాంగ్రెస్, తెలుగుదేశం వారి వారి ఓట్ల రాజకీయాలకు, పెట్టుబడి వ్యాపారాలకే ప్రాధాన్యమిస్తున్నాయి. కాని ప్రజల చిరకాల సమస్యలకు కాదు. చివరికి 'ప్రజలే ప్రభువులు', 'అధికార వికేంద్రీకరణ', 'సుపరిపాలన' అని గంభీర ఉద్ఘాటనలు చేసే లోక్‌సత్తా కూడా సముచిత నిర్ణయం తీసుకోక పోవడం ద్వారా తన పరస్పర విరుద్ధ భావ దారిద్ర్యాన్నే చాటుకున్నది. సమస్యను తెగేదాకా లాగి ఇప్పటికే పెరిగిన ద్వేషాలను మరింతగా పెంచి పోషించడం వలన ఏ ప్రాంతానికీ ప్రయోజనాలు ఉండవు. మట్టిగా విడిపోయి మనుషులుగా ఉండాలనుకుంటే రాష్ట్ర విభజన జరగాలి. దీనితోనే ఇర ప్రాంతాల ఆత్మగౌరవం నిలబడగలదు. అభివృద్ధి చెందగలదు. శాంతి నెలకొనగలదు అన్న సత్యాన్ని గ్రహించాలి. కావున సిమాంధ్ర ప్రజలు శాస్త్రీయంగా ఆలోచించి రాజకీయ పార్టీలకు అతీతంగా అడుగులు ముందుకు వేయాల్సిన కాలం ఆసన్నమైనది. ■

***–కారుమంచి కృష్ణ చైతన్య (గుంటూరు)***

***అయ్యంగారి రాఘవశర్మ (చిత్తూరు)***

(న్యూఢిల్లీలోని జెఎన్‌యు, ఢిల్లీ వర్సిటీలో పరిశోధక విద్యార్థులు)

27.09.2011, ఆంధ్రజ్యోతి

# కూలగొట్టుడే ........

పూరించు
తెలంగాణ సమర శంఖం
మోగించు
విజయభేరీ......మృదంగం
సాగించు
సాంస్కృతిక వైభవ సంరంభం
శోధించు
అమర వీరుల త్యాగాల అంతరంగం
కువారాల పొత్తులతో / కుతికెలు బిగించిన వైనం
కూడుపెట్టని వ్యవస్థను / కూలగొట్టుడే నిర్ణయం

***– మంత్రి లక్ష్మినారాయణ***

# అణచివేస్తే తిప్పికొడదాం!

– శ్రీరాముల శ్రీనివాస్

సకల జనుల సమ్మెలో భాగంగా ముందువరసలో నిలబడి తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చడానికి ఉద్యుక్తులైన సిమగరేణి కార్మికులకు, లాయర్లకు, ఉద్యోగులకు, ఆర్టీసీ కార్మికులకు, డాక్టర్లకు, ఉపాధ్యాయులకు, ప్రైవేట్ పాఠశాలలకయాజమాన్యాలకు, విద్యార్థులకు, యువజనులకు విప్లవాభివందనాలు.

1969 తెలంగాణ ఉద్యమంలో 369 మంది అమరులు కాగా, 2009 నుంచి నేటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వాల అవకాశవాద, సాచివేత, అణచివేత విధానాలతో, సీమాంధ్ర పెట్టుబడీదారుల పాచికలకు గురై వాయిదాలు వేయడం మూలంగా దాదాపు 700 మంది నిరాశా, నిస్పృహలతో ప్రాణాలు విడిచారు. వారి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆకాంక్షను నిజం చేయాలి. అందుకోసం సకల జనుల సమ్మెను సార్వత్రిక సమ్మెగా మార్చి ప్రభుత్వ కార్యక్రమాలను పూర్తిగా స్తంభింపచేయాలి. ఆర్థిక లావాదేవీలు, రోడ్లు, రైలు మార్గాలు ఏమీ పనిచేయకుండా చేయడం ద్వారానే తెలంగాణ రాష్ట్ర సాధనకు ఒక అడుగు ముందుకేసినవారమవుతాం.

తెలంగాణ సబ్బండవర్గాలు ఏకమై పోరాడుతున్నారు. దీంతో బెంబేలెత్తిన రక్తమాంసాలులేని సీమాంధ్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి తనను, తన సీమాంధ్ర దళారీ పెట్టుబడీదారులను రక్షించుకోవడానికి సమ్మెను నిరుత్సాహపరిచి, నీరుగార్చే కుతంత్రాలకు పాల్పడుతున్నారు. దీనికి తెలంగాణ ద్రోహి దానం నాగేందర్ వంత పాడుతున్నాడు. నాటి తెలంగాణ సాయుధ పోరాటాన్ని అణచివేయడానికి దాడి చేసి యుద్ధ గంటలు మోగించి విద్రోహానికి పాల్పడినట్టుగానే నేటికీ అదే తంతు కొనసాగిస్తున్నారు. తెలంగాణ కోసం పోరాడిన కార్యకర్తలను వరంగల్ పోలీసులు పట్టుకొని కాల్చి చంపారు. దాన్ని పునరావృతం చేసేలా పోలీసు అధికారి తెలంగాణ కోసం పోరాడుతున్న విద్యార్థులను అమానవీయంగా పోలీస్ స్టేషన్లు తిప్పుతూ, చిత్రహింసలకు గురిచేశారు. అంతేకాకుండా ఎన్‌కౌంటర్ పేర కాల్చి చంపుతానని మాట్లాడడం అంతా శ్రీకృష్ణ కమిటీలోని ఎనిమిదవ చాప్టర్‌లో భాగమే.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బూటకపు అభివృద్ధి పేరుతో అటవీ భూములను, వనరులను, గనులను, పీడిత ప్రజల భూములను సెజ్‌లకు, దేశీయ, విదేశీ పెట్టుబడీదారులకు బలవంతంగా అప్పజెప్పడం ద్వారానే ప్రజా పోరాటాలు ఉధృతమవుతున్నాయి. సంగూరు, నందిగ్రాంల నుంచి సోంపేట, పోస్కోల వరకు కొనసాగుతున్న పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలు అమలవుతున్నాయి. దండకారణ్యంలో అడవి, భూమి, నీరును ఆదివాసులకు చెందకుండా, ఆదివాసుల మధ్య చీలికలు తెస్తూ ఒక తెగపై మరొక తెగ దాడి చేసేలా చేసిన వైనమే సల్వాజుడుం. మావోయిస్టుల అణచివేత పేరుతో సహజ సంపదను దళారీ పెట్టుబడీదారులకు అప్పజెప్పడానికే ఆపరేషన్ గ్రీన్ హంట్–2 కొనసాగింపు మధ్య భారతంలోని అడవులు, వనరులను దోపిడీ వర్గాలకు అప్పనంగా అప్పజెప్పడంలో భాగంగానే జరుగుతున్నది. ఈ విధంగా అడవుల తరుగుదల, వనరుల తవ్వకాలు, భూమి కోతలు, పర్యావరణ సమస్యేగాక జీవన్మరణ సమస్యగా మారుతున్నది.

సామాజిక, రాజకీయ, ఆర్థిక సమస్యలు పరిష్కరించకుండా ప్రజావ్యతిరేక విధానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబించడమే ప్రజా పోరాటాలకు ప్రాణం పోస్తున్నది. ఈ విషయమ గుర్తించకుండా చిదంబరం మావోయిస్టులే

అత్యంత ప్రమాదకరమని తమ తప్పులను వెనకేసుకొస్తున్నారు. రాష్ట్ర శాసనసభ స్పీకర్ నుంచి సీమాంధ్ర దళారీ పెట్టుబడీదారులైన లగడపాటి, రాయపాటి, కావూరిల గుంపు వరకు అంతా, ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీలలో మావోయిస్టులు ఉండి తెలంగాణ ఉద్యమాన్ని నడిపిస్తున్నారని విష ప్రచారానికి పూనుకుంటున్నారు.

తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష ప్రజల ప్రజాస్వామిక డిమాండ్. 1969 నుంచి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం పోరాటం సాగుతున్నది. నేడు చట్టబద్ధంగా జరుగుతున్న తెలంగాణ సాధన పోరాటానికి మావోయిస్టు పార్టీ మద్దతు ఇస్తున్నది. స్వావలంబన, శాంతి, అభివృద్ధికి అనుగుణంగా ప్రజాస్వామిక డిమాండ్‌తో తెలంగాణ రాష్ట్రాన్ని డిమాండ్ చేస్తున్నది. అంతేతప్ప దండకారణ్యం, బీహార్ – జార్ఖండ్లను విముక్తి చేయడానికి, ప్రాంతాలవారీగా విముక్తి చేయడానికి సాయుధ పోరాటం మార్గం ఎంచుకున్నట్టు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సాయుధ పోరాటం చేయాలనడం లేదు. సమరశీల ప్రజా పోరాటాలే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మార్గం. నేడు జరుగుతున్న సకల జనుల సమ్మె పల్లె నుంచి పట్టణాల వరకు సమరశీల పోరాటాలను చేస్తూ సార్వత్రిక సమ్మెగా మార్చాలని సకల జనులకు విజ్ఞప్తి చేస్తున్నాం.

ఇప్పుడు జరుగుతున్న సకల జనుల సమ్మెను తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించడం ద్వారా పరిష్కరించాలి. అంతే తప్ప అణచివేతకు పూనుకుంటే తెలంగాణ ప్రజలు తగు రీతిలో బుద్ధి చెబుతారు. అణచివేత తిరుగుబాటుకు దారితీస్తుంది. తెలంగాణ ద్రోహులను వెలివేయాలి. తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగుతున్నా, ఊగిసలాటతో ఉండి అంతిమంగా సీమాంధ్ర పెట్టుబడీదారుల ప్రయోజనాలు నెరవేరుస్తున్న తెలంగాణ కాంగ్రెస్, టీడీపీల నేతలను ద్రోహులుగా చాటి చెప్పాలి. ■

**– శ్రీరాముల శ్రీనివాస్**

మావోయిస్టు రాజకీయ ఖైదీ

22.09.2011, నమస్తే తెలంగాణ



*సకల జనుల సమ్మెలో భాగంగా గన్‌పార్క్ వద్ద తెలంగాణ ప్రజాఫ్రంట్ నిరసన.*

# వెలివేయండిక!

*– జూకంటి జగన్నాథం*

ఈమారు తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమాన్ని తెలంగాణ ఉద్యోగ సంఘాలు తమ భుజస్కంధాల మీదికి ఎత్తుకున్నాయి. సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో అటు ఇటుగా 42 రోజులపాటు సమ్మె చేశాయి. లక్ష్యాన్ని సాధించక ముందే సమ్మెను విరమించాయి. గతంలో నిర్వహించిన సామూహిక సహాయ నిరాకరణ విరమణ సందర్భంగా సహ ఐకాసల నుంచి వచ్చిన విమర్శలకు, తాజా సమ్మె విరమణలో తావులేకుండా, ఉద్యోగ సంఘాలు జాగ్రత్తలు పాటించాయి; సమ్మెలోంచి సగౌరవంగా బయటపడ్డాయి. సకల జనుల సమ్మెలో పోలీసు శాఖ మినహా అన్ని ఉద్యోగ సంఘాలు పాల్గొన్నాయి. తెలంగాణ రాష్ట్ర సాధనే ప్రధాన ఎజెండాగా ఉన్న ఈ సమ్మె చరిత్రాత్మక ఉద్యమ కార్యరూపంగా నమోదయింది. అదే కాలంలో రాజకీయపక్షాల దిగజారుడు ప్రవర్తన హీనమైన పాత్రగా నిలిచిపోయింది. ఉద్యోగుల సమ్మె కొనసాగింపు విరమణ క్రమం ఒక్క తెలంగాణలోనే కాక దేశంలోని సంబంధిత ఉద్యోగితా ఉద్యోగవర్గాలకు ఒకరకమైన మార్గదర్శనాన్ని చూపింది.ఉద్యోగులతో పాటు అన్ని కులాలు, వర్గాలు తమ తమ నిరశన గళాలను బలంగా వినిపించాయి. తెలంగాణ వచ్చేవరకు సమ్మె కొనసాగుతుందనే గట్టి నమ్మకాన్ని మిగతా అన్ని శ్రేణులకు కలిగించాయి. అయితే ప్రజలలో అచంచల విశ్వాసం పాదుకుంటున్న సమయంలోనే టి–జాక్ తన నేతృత్వంలో పనిచేస్తున్న ఆయా ఉద్యోగ సంఘాల నాయకత్వాలు మల్లగుల్లాలుగా బలమైన కారణం చూపకుండానే సమ్మెను విరమించాయి. దీనివలన ప్రజలు సుదీర్ఘ పోరాటానికి సంసిద్ధులవుతున్న తరుణంలో సమ్మెను అర్ధాంతరంగా విరమించడంతో టి–జాక్ ప్రజలనుంచి అనేక నర్మగర్భ విమర్శలకు ఎదురొడ్డాల్సిన స్థితి వచ్చింది. ఈ సంకట స్థితిని గమనించి టి–జాక్ తన వందిమాగధ గణంతో కలిసి 'ఇది విరమణ కాదు విశ్రాంతి మాత్రమే' అనే భావజాలాన్ని ముందుకు తెచ్చి, విమర్శల సుడిగుండం నుంచి తాత్కాలికంగా బయటపడగలిగింది. కానీ తెలంగాణ సాధన దిశలో విశ్లేషకుల దృష్టిలో స్పష్టత లేని వెనుకంజగా మిగిలిపోయింది.

ఇలా ఉద్యమాన్ని కొనసాగించడం కప్పదాటుగా విరమించడం దశాబ్ద తెలంగాణ ఉద్యమంలో వివిధ సందర్భాలను అవలోకిస్తే, కొత్త విషయం, విశేషం కాదని తేలిపోతుంది. ఎందుకంటే కెసిఆర్ ఆమరణ నిరాహార దీక్ష విరమణ, కొనసాగింపు, ముగింపులలో ప్రజల, ముఖ్యంగా యవతరం ప్రతిస్పందలను చూస్తే ఈ విషయం స్పష్టంగా విదితమవుతుంది. అనంతర పరిణామాల దృష్ట్యా తన చెప్పుచేతల్లోంచి బిగడాయించి పోతున్న ఉద్యమాన్ని టిఆర్ఎస్ అధినాయకత్వం మిగతా అన్ని జాక్‌ల పుట్టుకకు తెల్లారే చుక్కయైన ఉస్మానియా విశ్వవిద్యాలయం జాక్‌ను ఇచ్చగొట్టింది. తెలంగాణ ఉద్యమాన్ని తన అధీనంలోకి తెచ్చుకునే క్రమంలో అది నెరిపిన కుతంత్రాలు పన్నిన కుయుక్తులు అందరికీ తెలిసినవే. తద్వారా ఉద్యమంలో టిఆర్ఎస్ తన ఆధిపత్త సుస్థిరతకు తెలంగాణలో తిరుగులేదని మరోసారి నిరూపించుకునే ప్రయత్నం చేసింది. కొంతమేరకు సఫలమైనా ఈ తంత్రం దీర్ఘకాలం కొనసాగవల్సిన ఉద్యమంపై అనేక దుష్పరిణామాలను అందించింది.

అప్పుడు ఉస్మానియాతో పాటు గొంతు కలిపిన తెలంగాణలోని అన్ని యూనివర్సిటీల విద్యార్థి నాయకులు అందించిన స్ఫూర్తితో పల్లె పల్లెలో ఉద్యమ వేడి రగిలింది. పర్యవసానంగా సుదీర్ఘకాలంపాటుగా గ్రామ గ్రామాన

నిరసన నిరాహార దీక్షా శిబిరాలు కోకొల్లలుగా వెలిశాయి. ప్రజా సమూహాలు చేయి చేయి కలిపి వెల్లువగా ఉద్యమంలో ముందుకు కదిలాయి. అప్పుడు కూడా నేతలు ఇప్పటివలెనే కేంద్ర కౌరవ సభకు కృష్ణ రాయబారం నెరిపారు. మొదటిసారి ఏమి భరోసా కలిగిందో ఏమో నాయకులు ఉద్యమాన్ని దశలవారీగా నీరుగార్చారు. ఉద్యమంలో పూర్తిస్థాయిలో 'చార్జీ' అయిన సామాన్యులు కలత చెంది ముఖ్యంగా యువకులు కకావికలమయ్యారు. శ్రీకృష్ణ కమిటీ నివేదికకు అనుకూలంగా ఉద్యమం సర్దుకుంది. తెలంగాణ నేతలు ప్రభుత్వాలతో ప్రజలకు తెలియని సర్దుబాటు ఒడంబడిక చేసుకున్నారు. తదనంతరం కొనసాగిన ఉద్యోగుల 18 రోజుల సహాయ నిరాకరణ నిరసన కార్యక్రమం కూడా అకారణంగా హామీ పొంది, విరమణ పాటించింది. అప్పుడు ప్రజలతో పాటు ఉద్యోగుల సంఘాలు కూడా ఈ పరిణామం పట్ల వ్యాకులత పొందాయి. అయినా సహాయ నిరాకరణ అందించిన గోరంత స్ఫూర్తి నుంచి కొండంత నైతిక స్థైర్యాన్ని ప్రజా ఉద్యమ సంస్థలు కూడగట్టుకున్నాయి.

అయితే ఈమారు టి–జాక్, టి–ఎన్‌జిఓ, మిగతా మద్దతు సంఘాల నాయకులతో కలిసి ఉద్యోగ వర్గాలు సమ్మెకు పిలుపునిచ్చాయి. ఈ సమ్మెలో వైద్య, విద్యా, రవాణా సౌకర్యాల లేమితో సామాన్యులు ఇబ్బంది పడినా తెలంగాణ వచ్చేవరకు పోరాటం కొనసాగుతుందనే కృతనిశ్చయాన్ని ప్రకటించారు. అసంఘటిత రంగానికిచెందిన కార్మికులు, కులసంఘాలు, వాణిజ్య సంఘాలు సమ్మె గోదాలోకి పూర్తిస్థాయిలో దిగాయి. దిగడమేగాక రాజకీయ పక్షాలను, నాయకులను అతలాకుతలం చేశాయి. ఇక్కడే ఏ ఆకాశవాణి పిలుపు వచ్చిందో ఎమైందో ఏమో గానీ టి–జాక్ నేతలు, సంబంధిత టిఆర్ఎస్ నాయకులు తమ మందీ మార్బలం వెంటరాగా ఢిల్లీకి బిస్తరు కట్టారు. అక్కడ కేంద్ర మంత్రులను, పెద్దలను, ప్రధానిని కలిసి కలిసి అలిసిపోయి చివరికి హైదరాబాద్ బాట పట్టారు. షరా మామూలుగా ఏమి హామీలు, ఏమి వాగ్ధానాలు పొందారో ఇప్పటికీ ఎవరికీ తెలియదు. పైగా పోయిన నాయకులు ఆ బ్రహ్మ రహస్యం గురించి నోరువిప్పి ప్రజలకు చెప్పరు. కానీ ఉద్యోగ సంఘాలు మాత్రం సమ్మెనుంచి ఆయా యాజమాన్యాలతో చావు తప్పి కన్ను లొట్టపోయిన చందంగా ఒప్పందం కుదుర్చుకుని సమ్మె పందెం నుంచి కొంచెం ముందూ వెనుకగా అన్ని సంఘాలు తప్పుకున్నాయి.

సమ్మె విరమణ సందర్భంగా ఈ దఫా టిఎన్‌జిఓ సారథి స్వామి గౌడ్ పలుమార్లు రాజకీయపక్షాలను నిష్ఠూరమాడిన మాటల పద్ధతి వెనుక ఆవేదనను, ఆలోచనలను అందరూ అర్థం చేసుకోవాల్సిన అవసరం తప్పక ఉంది. ఇటువంటి సమయంలోనే ప్రభుత్వాలు తన కార్యనిర్వహణ వర్గమైన ఉద్యోగుల పరిధులను, పరిమితులను నిర్దేశిస్తాయి. అదుపు చేస్తాయి. రాజ్యం ఈ విరమణ చర్చల్లో అదే రీతిని, నీతిని ప్రదర్శించింది. కేవలం ఉద్యోగవర్గాలే ప్రజల ఆకాంక్షను నెరవేరుస్తాయనుకుంటే అది లొటపెట పెదవులకు నక్క ఆశపడ్డట్టు అవుతుంది. మనలాటి దేశాలలో ఈ చర్యలు ప్రజల ఆకాంక్షను పురికొలప్పవచ్చుగాని, ఉద్యోగసంఘాల నిరసన పనితీరు ప్రజల కోరికను నెరవేర్చలేవు.

ఎందుకంటే ఉద్యోగులు రాజ్యంలోని భాగస్వాములే గాని పౌర సమాజంలోని వాటాదారులు కారు. ఉద్యోగులు, అధికారులు ఆయా ప్రభుత్వాలకు వత్తాసుదారులుగా నడుచుకుంటారేగాని ప్రజలకు జవాబుదారులుగా మసలుకోజాలరు. కార్యనిర్వహణ రంగం ఒకవేళ అనుకున్నా ప్రజల పన్నులతో వేతనాలు పొందుతున్నామనే కనీస స్పృహ మన ఉద్యోగ రంగానికి ఇంకా కలుగలేదు. ప్రభుత్వాలు గాక ప్రజలకు జవాబుదారులమనే దశకు మన ఉద్యోగులు, సంఘాలు ఇంకా ఎదిగిరాలేదు. అలా ఎదిగివస్తే పరిస్థితులు, రాజకీయ సమీకరణలు దేశంలో చెప్పుకోదగ్గ రీతిలో తారుమారవుతాయి. అందువలన తెలంగాణ ఉద్యోగ సంఘాలు ప్రజలవైపు నిలబడి కాలు దువ్విన మరుక్షణమే తమ తమ పరిధిని, పరిమితిని గుర్తించి సమ్మెను విరమించాయి. కాకపోతే ప్రభుత్వం శంఖంలో నీరుపోసి తీర్థంగా సేవించి 'మమా' అన్నారు. అంతే, సహజంగా అధికారంకోసం పనిచేసే రాజకీయ శక్తులు, సమ్మె భాగస్వాములు ఒక ఒరలో ఇమడని కత్తులు. ఈ రెండు పక్షాలు మూలంలో పరస్పర సంఘర్షణ స్వభావం కలవి. ఒకవేళ పొరపాటున ఒక్కటిగా కనిపిస్తే మాత్రం అశేష ప్రజల ప్రయోజనానికి ఏదో రకంగా ఎసరు వస్తుంది. మొన్నటి

సమ్మె విరమణ మరోమారు రాజ్యం – ఉద్యోగులు– ప్రజలు–కాంక్షలు వేర్వేరుగా ఉంటాయనే విషయాన్ని మరోసారి విడమరచి రుజువుగా చెప్పింది. ఇవన్నీ ఒకే తానులోని ముక్కలుగా కనిపించినా పరస్పర విరోధాభాస కలిగినవే.

ప్రజాస్వామ్య చట్రంలో 'రాజ్యం–ప్రజలు – ఉద్యమాలు' అంశాలను ఉపరితలం నుంచి చూస్తే చాలా సౌకర్యవంతంగా కనిపిస్తుంది. కానీ పునాదిలోకి వెళితే చాలా మంట ఉంటుంది. దీని ఆచరణ రాజ్యం అన్ని రంగాలకు వేడిని తీవ్రాతితీవ్రమైన అసౌకర్యాన్ని కలుగజేస్తుంది. అందుకే ఈసారి ఉద్యమంలో ఇంత పెనుగులాట కనిపిస్తుంది. మొత్తానికి ప్రజలు అకుంఠిత పట్టుదలను ప్రభుత్వాలతో ప్రభుత్వాలకు పరిహారంగా సమర్పించి మరోసారి రాజకీయపక్షాలు ఉద్యమంపై తమ పట్టును సాధించే ప్రయత్నంలో కొంతమేరకు సఫలీకృతమయ్యాయి. సమ్మె పరిణామాల కాలంలోని రాజ్యం తీసుకున్న చర్యలు ఒక విధంగా సుదీర్ఘ కాలంలో తన గోతిని తానే తీసుకున్నట్టు అయ్యింది.

నిన్న నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు తెలంగాణపై ఒక్కటిగా ఉన్నారు. కానీ వివిధ రాజకీయ పక్షాలు అనైక్యంగా ఉన్నాయి. నేడు వివిధ రాజకీయ పక్షాలన్నీ ఒక్కటిగా అంతర్గతంగా ఏర్పడి తెలంగాణ ప్రజల ప్రగాఢమైన కాంక్షను ఏదోమేరకు తగ్గించగలిగాయి. ఏదో మేరకు డిస్ట్రబ్ చేశాయి. ప్రజల సామూహిక శక్తిని, దీర్ఘకాలంలో నిర్వీర్యం దిశవైపు రాజకీయ వ్యవస్థలు అన్నీ కలిసి కడు నైపుణ్యంతో తెలంగాణ ప్రజలను 2014 వైపు నెట్టేశాయి. సకల జనుల సమ్మె ప్రారంభ విరమణల మధ్య కాలంలో రాజకీయపార్టీలు ప్రదర్శించిన సాముగారడీ విన్యాసాలను నోరెళ్ళబెట్టి చూసిన పిదప, ప్రజా సమూహాలు ఉద్యమంలో కదిలిన తీరును గమనించిన తరువాత, ఉద్యమంలో టి–ఐకాస ఆధిపత్యం కోసం పడే తపనను గుడ్లప్పగించి చూసిన అనంతరం, నోరు తెరిస్తే ఎక్కడ ఉద్యమానికి నష్టం జరుగుతుందోననే ఉదాసీన వైఖరిని వీడాల్సిన సమయం ఆసన్నమైంది. ఇప్పటికీ రోజూ తెలంగాణలో ఒకరిద్దరు ఆత్మహననానికి పాల్పడుతుంటే రాజకీయ వ్యవస్థపై తీవ్ర ఆగ్రహంతో ఇక మర్యాదస్తులుగా ఉండలేక కలతపడి, పై విషయాన్ని చెప్పబూనాను.

కొసమెరుపు: క్రీ.పూ. 200 సంవత్సరంలో విష్ణుశర్మ ఘంటం నుంచి జాలువారి ఇటీవల సహవాసి ద్వారా ఆంధ్రీకృతమయిన 'పంచతంత్రం' కథల పుస్తకాలను కెసిఆర్, టి–జాక్, మిగతా ప్రజా సంఘాల నేతలకు తొందరగా పంపాల్సిందిగా నిజాం వెంకటేశం సార్, తలుపు నాగభూషణంలను అభ్యర్థిస్తున్నాను. ■

**– జూకంటి జగన్నాథం**
అధ్యక్షుడు, తెలంగాణ రచయితల వేదిక

09.11.2011, ఆంధ్రజ్యోతి

## తుపాకులతో ఉద్యమాన్ని అణచలేరు

గద్దర్



తెలంగాణ ఉద్యమాన్ని తుపాకులతో ప్రభుత్వం అణిచివేయలేదు. శ్రీ కృష్ణ కమిటీ సూచించిన 8వ చాప్టర్‌ను ప్రభుత్వం అములు చేస్తుంది. చెరుకు సుధాకర్‌పై పీడీ యాక్టు కింద అరెస్టు చేయడాని తీవ్రంగా ఖండిస్తున్నాం. ప్రభుత్వ పాలసీలోనే కోమటిరెడ్డి దీక్ష భగ్నం జరిగింది. తెలంగాణ ప్రజలు వివిధ రూపాల్లో ఉద్యమం చేస్తున్నారు. ఇప్పటివరకు పోరాటాలు చేశారు. ఇక ప్రజలు తిరుగుబాటు చేయాలి.

# విరమణ కాదు - విద్రోహమే

**- దరువు ఎల్లన్న**

**నా తెలంగాణ కోటి గాయాల గేయమేనా....?**
**రాజకీయ చదరగంలో, ఇగ రాజీపడ్డ బతుకులేనా?**

సకల జనుల సమ్మె దాదాపు 42 రోజుల వరకు కొనసాగింది. మధ్యమధ్యన ఆర్‌టిసి ఎంప్లాయిస్ విరమణ 32వ రోజు చేసినా... డిపార్ట్‌మెంట్‌ల వారీగా ...క్రమక్రమంగా సీమాంధ్ర ప్రభుత్వంతో చర్చల అనంతరం సమ్మె పూర్తిస్థాయిలో విరమిస్తున్నట్లు ప్రకటించేవరకు.....విరమణల వెనుక ఒక విద్రోహపూరితమైన కుట్ర దాగున్నట్లు సగటు తెలంగాణ వాదికి కనిపించే నగ్న సత్యం. అసలు సకల జనుల ప్రారంభం నుండే ఏదో సంశయం కనిపించింది. మొదట 6వ తేదీ నుండి 13వ తేదీకి వాయిదా వేయడం. వాయిదా వెనుక రాజకీయ నాయకుల ప్రయోజనాలు ఉన్నట్లు కనిపించింది. సమ్మె ఉద్యమ రూపాలు ఏ ఒక్కటీ ఉద్యమాన్ని ఉధృతం చేసేవవిగా లేకపోవడం బాధాకరం. కాని సమ్మె ప్రారంభ కాలంలో మొట్టమొదటిసారిగా కోదండరాం విరమించినా, మేం నడిపిస్తాం అని గద్దర్ ప్రకటించడంవలన సమ్మెల్లో పాల్గొనాలనుకునే వారికి ఎంతో గుండె ధైర్యాన్ని నింపింది. అయితే మొట్టమొదటసారి సకల జనుల సమ్మెలో ముందు వరుసలో నిలబడ్డది సింగరేణి కార్మికులే. అటు తర్వాత అన్ని డిపార్ట్‌మెంట్లు, ఆర్‌టిసి, విద్యుత్, పాఠశాలలు/టీచర్లు, డాక్టర్లు, లైబ్రరీ ఉద్యోగులు, టూరిజం, న్యాయవాదులు, టి.ఎన్.జి.ఓ.లు గెజిటెడ్ ఉద్యోగులు అన్ని ప్రైవేటు కళాశాలలు, పాఠశాలలు, అన్ని కార్మిక సంఘాలు ఆఖరికి హమాలీ సంఘంతో సహా సమ్మెలో భాగస్వాములై పనిచేశారు. అయితే క్రమక్రమంగా అన్ని రంగాల ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నప్పటికీ ప్రభుత్వం నుండి తగిన స్పందన ఎందుకు రాలేదు? ప్రభుత్వ ఆర్థిక మూలాల్ని దెబ్బతీసేటట్లు ఉద్యమం జరిగినా ప్రభుత్వానికి ఎందుకు భయం కలగలేదు? రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు తెలంగాణ ప్రాంత కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు పూర్తిస్థాయిలో కార్యాలయాలకు తాళాలేసినా, కేంద్రం నుండి కదలిక రాలేదెందుకు? ఏ ప్రకటన రాకముందే రాజకీయ జెఎసి విరమించింది ఎందుకు? ఉద్యోగులు విరమించేటప్పుడు చర్చలు సఫలమైనట్లు 9 డిమాండ్‌లకు ప్రభుత్వం అంగీకరించినట్లు, సంతకాలు చేసినట్లు నేతలు ప్రకటించారు. అసలు సమ్మె ఈ తొమ్మిది డిమాండ్ల కోసం కాదు కదా? సమ్మె ప్రధాన లక్ష్యం రాష్ట్రం కోసం కదా? విద్యార్థులు/యువకులు బలిదానాలు చూసి చలించిపోయాం, జీవితాలే కోల్పోతున్న నేల మీద మా జీతాలొక లెక్కకాదని ఉద్యోగులు ఎన్నోసార్లు ప్రకటించారు. ఎంతో ధృఢ నిశ్చయంతో ఉన్నారు. పవిత్రమైన కార్యంగా భావించారు, ఇంతలోనే ఏం జరిగినట్లు?

విరమణల రోడ్ మ్యాప్ ఎవరిది? కాంగ్రెస్‌దా? టిఆర్‌ఎస్‌దా? జెఎసిదా? ఎవరి ప్రభావం ఉద్యోగులపై పడింది? ఏ ప్రలోభాలు, ఎవరి రాజకీయ స్వార్థాలు, ఈ సమ్మెను విరమింపచేసాయి? అంటే అది ఖచ్చితంగా కెసిఆర్–కోదండరాంల కుట్రనే (కే.కో.కుట్ర) అని స్పష్టమవుతుంది.

ఉద్యోగుల నిజాయితీ మీద కెసిఆర్ , కోదండరాంల రహస్య ఒప్పంద స్వార్థపు బురద చల్లారు. మనకోసం – మన భవిష్యత్ తరాల కోసం చేస్తున్నామని ఉద్యోగులు, నాల్గవ తరగతి ఉద్యోగులు సైతం నానా కష్టాలుపడ్డారు. సామాన్య ప్రజానీకం ఆర్‌టిసి బస్సులు బందు ఉన్నందుకు ఎన్నో ప్రయాణాలు మానేసుకున్నారు. చిన్నా చితకా వ్యాపారులు పోతే పోయే తెలంగాణ కోసమేకదా అని త్యాగం చేశారు. ఇలా ప్రత్యక్షంగా ఉద్యోగులు ఉద్యమాల్లో

ఉంటే ప్రత్యక్షంగా, పరోక్షంగా అన్ని వర్గాల ప్రజలు ఆయా మండల కేంద్రాల్లో, డివిజన్‌లలో, గ్రామాల్లో నిరాహార దీక్షలు చేసి సంఘీభావం తెలిపారు. వారం రోజుల క్రితం ఆర్మూర్‌లో తెలంగాణ సాధన కోసం '1500 దప్పుల దరువు' ర్యాలీ సభ పెట్టినపుడు నేను హాజరైన సందర్భంగా ఒక పెద్దాయన..."బిడ్డా... ఇన్ని రోజులు బస్సులు తిరుగకుండ ఉండుడు నా జీవితంలో మొదటిసారి అని చెప్తూ, తెలంగాణ వస్తదంటవా బిడ్డా..." అని అనుమానంగా అడిగాడు. ఈ అనుమానం ఒక పెద్దమనిషిదే కాదు నాలుగు కోట్ల ప్రజల అనుమానమే అని నాకనిపించింది. ఎందుకంటే ఉద్యమం ఇంతగా నడుస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చీమ కుట్టినట్టు కూడా లేదంటే అందులో ఖచ్చితంగా ఈ ప్రాంతపు రాజకీయ నాయకుల లాలూచీతనం ఉందనే అనుమానం కలుగకమానదు. కాంగ్రెస్ ద్రోహపూరితమైన పార్టీ అయినప్పుడు అదే కాంగ్రెస్ నాయకులు చేసే డ్రామాలు చూస్తూ టిఆర్ఎస్ ఎందుకు మౌనం వహించినట్లు? ఉద్యమంలో రాజీనామాలు ఆమోదం పొందకుండా నామమాత్రంగా ఎందుకు మిగిలాయి? సమ్మెకాలంలో ఉద్యోగులు జీతాలు త్యాగం చేస్తుంటే, రాజకీయ నేతలు జీతాలు ఎందుకు తీసుకున్నట్లు? రాజీనామాలు ఆమోదించేది వీరి చేతిలో లేకున్నా, జీతాలు తీసుకునేది వీళ్ళ చేతుల్లోనే వుంది కదా? అంటే ఇది పార్టీల ద్వంద్వ వైఖరి కాదా? ఇలా ఏ అంశాన్ని చూసినా....అన్ని రాజకీయ పార్టీలు ఉద్యమాన్ని తమ స్వార్థంకోసం వాడుకుమటున్నాయన్నదే చారిత్రక వాస్తవం. ఈ సందర్భంలో పార్టీల/నేతల మాటల, ప్రధానంగా కెసిఆర్–కోదండరాంలు, నిజాయితీతో ఉద్యమంలోకి వచ్చిన ఉద్యోగుల్ని నిర్వీర్యం చేశారు. ఇన్ని డిపార్ట్‌మెంట్లు లక్షలాది ఉద్యోగులకు ఒక ఉమ్మడి కార్యక్రమం లేకపోవడం వెనుక కోదండరాం ఉద్యమ ఉధృతివైపు కాకుండా ఉద్యమ నిర్వీర్యంవైపు అడుగులేసినట్లు అర్థమౌతుంది. తెలంగాణ ఏకైక ప్రధాన లక్ష్యమని చెప్పిన ఉద్యోగులకు, విరమణ కోసమే రూపొందించుకున్న 9 డిమాండ్లకు ప్రభుత్వం ఒప్పుకున్నట్లు పొలిటికల్ జెఎసి సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించడం హాస్యాస్పద అనుమానమే. గతంలో సింగరేణి కార్మికులు ఏ సమ్మె చేసినా అది విఫలమైనట్లు కార్మికుల చరిత్రలోనే లేదు. వేతన ఒప్పందం కోసం గతంలో సికాస పిలుపు మేరకు దాదాపు 55 రోజులు సమ్మె చేసి వేజ్ బోర్డు సాధించుకున్న చరిత్ర సింగరేణి కార్మికులది. అలాంటి కార్మికులను సైతం ఏ ఫలితం లేకుండా విరమింపచేసిన ద్రోహులెవరు? టీచర్లు, లెక్చరర్లు, ఏ ఒక్కరు మనఃస్ఫూర్తిగా విరమించలేదన్నది వాస్తవం. గతంలో విద్యార్థి ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేయడానికి పూనుకున్న స్వార్థ రాజకీయ పార్టీలే, ఇప్పుడు ఉద్యోగుల ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేసినట్లు కనిపిస్తోంది. ఉద్యోగ సంఘాల్లోని కొంతమంది నేతలు రాజకీయ పార్టీలకు వత్తాసు పలకడంవల్లనే రాజకీయ పార్టీల సూచనల మేరకు ఉద్యమ విరమణ ప్రకటన చేసినట్లు కన్పిస్తోంది. ఇది 60 సంవత్సరాల ఉద్యమంలో ఒక కొత్త కోణం. ఇంతటి మహత్తర ఉద్యమం మరోసారి సాధ్యమా అని అనుకుంటున్న వాళ్ళందరికీ ఇదొక నిరాశనే మిగిల్చింది.

60 ఏళ్ళ చరిత్రలో రాజకీయ పార్టీలది మోసపూరితమైన పాత్రనే. చెన్నారెడ్డిని మించిన ద్రోహం ప్రస్తుతం మన కండ్లముందు ప్రత్యక్షంగా కనబడుతుంది. తెలంగాణ రోడ్ మ్యాప్ ప్రకటించమని కొట్లాడిన ఉద్యమకారులను వక్రదదారి పట్టిస్తూ ఉద్యమాన్ని ఎట్లా నిర్వీర్యం చేయాలో, ఏఏ దశల్లో ఎవర్ని విరమింప చేయాలనే 'విరమణల రోడ్ మ్యాప్' తీసుకొని కేంద్రంతో కుమ్మక్కై తమ వ్యాపార లావాదేవీల కోసం, తమ కుటుంబ రాజకీయాల కోసం, ఉద్యమాన్ని వాడుకునే ఏ రాజకీయ పార్టీ నేతలకైనా ప్రజల మధ్యన గుణపాఠం తప్పదు. విరమణ వెనుక దాగిన విద్రోహాన్ని సరిగ్గా అర్థం చేసుకుందాం. సకల జనుల సమ్మెలో సర్వం కోల్పోవడానికి సిద్ధపడ్డది ఉద్యోగులు, కాని సర్వనాశనం చేసింది రాజకీయ పార్టీ నేతలే. 'ఇది విరమణ కాదు పార్టీల విద్రోహమే'. మళ్ళీ తెలంగాణ ప్రజలకు భరోసానివ్వాల్సింది, కేంద్ర ప్రభుత్వాన్ని గడగడలాడించిన విద్యార్థి యువతరమే. ఉద్యమం ఆగిపోయిందని, ఇక తెలంగాణ రాదని ఆవేశంతో, మనస్సు కలత చెంది ఎవరూ ఆత్మహత్యలకు పాల్పడవద్దు. నిస్వార్థంగా పనిచేసే యువకులు రాజకీయ పార్టీలకు అతీతంగా విద్యాలయాల్ని ఉద్యమ కేంద్రాలుగా చేసి పోరాడే సమయం ఆసన్నమైంది. ■

12.11.2011, ఆంధ్రజ్యోతి

**– దరువు ఎల్లన్న**

ఉస్మానియా పరిశోధక విద్యార్థి

# 'గురు'జన గర్జన

**– కె.ప్రభాకర్**

నల్లగొండలో సెప్టెంబర్ 28న జరిగిన ఉపాధ్యాయ 'పోరుగర్జన'లో పాల్గొన్న వేలాది టీచర్ల ఆవేదన, ఆక్రోశం, ఆందోళన, తెలంగాణ చౌరస్తా 'క్లాక్ టవర్' రగిలిస్తున్న ఉద్యమ సెగల్లో అట్టుడికిపోయింది. మంత్రులకైనా, మానవమాత్రులకైనా ఉద్యోగ ఉపాధ్యాయులకైనా, ఉద్యోగ సంఘ నాయకులకైనా, ఒక సమూహం ఆకాంక్షలు నెరవేరకుండా అడ్డుపడుతున్న శక్తులపట్ల వ్యతిరేకత వ్యక్తం కావడం అసహజమేమీ కాదు. అందునా తెలంగాణ సకల జనులు గత 17 రోజులుగా, అనేక ఇబ్బందులనెదుర్కొంటూ ఏకమై సాగిస్తునన్న 'సకల జనుల సమ్మె' అనూహ్యంగా ప్రపంచ చరిత్రలోనే చూడనంత ప్రజాస్వామికంగా జరుగుతోంది. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వర్గాలు తమ సర్వీస్ విషయాల కోసమో, ఇంక్రిమెంట్ల కోసమో, జీతాల కోసమో కాకుండా, తమ జీవితాల్ని ఫణంగా పెట్టి నడిరోడ్డుపై నడుపుతున్న పోరాటం ఎవరి వల్ల మోసానికి గురౌతున్నారో తెలుసుకున్నారు కనుక ఆ శక్తుల పట్ల నిరసన వ్యక్తం చేయడం సహజం. ప్రొఫెసర్ జయశంకర్ అన్నట్లు భావజాల, ఉద్యమ ప్రక్రియలన్నీ తెలంగాణ గడ్డపై నిత్యం విశృంఖలంగా సకలజనులు కొనసాగిస్తున్నారు. సాగాల్సిన మూడోప్రక్రియే 'రాజకీయ ప్రక్రియ'. అది మాత్రమే ఇవ్వాల్టి ఉద్యమాలను, ప్రజాకాంక్షను దగా చేస్తున్నది. 'తెలంగాణ రాష్ట్రం ఏర్పడాలంటే ఐకమత్యంగా పోరాడాలి. ప్రజలు ఏకం అయ్యారు. కాని రాజకీయ నాయకులు మాత్రం ఏకం కావడం లేదు' అన్న ఆయన మాటను ఇవ్వాల్టి రాజకీయ నాయకుల విద్రోహం రుజువు చేస్తున్నది. కనుకనే సకల జనుల ఆక్రోశం ఆయా రూపాల్లో వ్యక్తం అవుతున్నది. అదే నేపథ్యంలో నల్లగొండ 'ఉపాధ్యాయ పోరు గర్జన'లో పాల్గొనడం ద్వారా తన 'నిజాయితీ'ని నిరూపించుకోవాలని, పిలవకపోయినా, పిలిస్తేనే వచ్చానని కాన్వాయ్, అనుచరులతో వేదిక మీదకు నిర్వాహకులు ఆహ్వానించకుండానే ఎక్కడంతో అప్పటికే వేలాది టీచర్లు రాజీనామా చేయని ప్రజా ప్రతినిధులారా 'గోబ్యాక్' అంటూ గుత్తాసుఖేందర్ రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్, వెంకట్ రెడ్డి గార్ల వైఖరిని నిరసించారు. "నేను రాజీనామా చేసే వచ్చానని రెండో తారీఖున దీక్ష చేస్తున్నానని " కోమటి రెడ్డి చెప్పినా విశ్వసించని ఉపాధ్యాయ లోకం తనదైన పద్ధతిలో నిరసన వ్యక్తం చేసింది. దానికి ప్రతిగా ఉపాధ్యాయులపై ఆయన, అనుచరులు దాడికి పాల్పడటం ఒక దాని వెంట ఒకటి జరిగిపోయాయి. ఇది కేవలం ఒక కోమటిరెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా మాత్రమే కాదు ఉపాధ్యాయుల సమ్మె ప్రారంభమైన రోజు నుండే ఆందోళనలు సహజంగానే ప్రత్యక్ష రూపం తీసుకున్నాయి. దాదాపు ఇరవై నాలుగు ఉపాధ్యాయ సంఘాలు 'టిటిజాక్'గా సమ్మె నోటీసు ఇవ్వడానినికి, 13 నుండి సమ్మెలోకి పోకుండా 16 దాకా వాయిదా పడటానికి కొన్ని సంఘాలు అనుసరించిన తాత్సార వైఖరితోపాటు, తెలంగాణ ఉపాధ్యాయ సంఘాల పేర మరో వేదిక 'టి జాక్ట్ ' లాంటి ప్రయత్నాలూ కారణం. "సమైక్యతే మా నినాదం – మేం సమ్మెలో పాల్గొనం" అంటూ టీచర్ల సమ్మెను విచ్ఛిన్నం చేయడం ద్వారా 'సీమాంధ్ర' కుట్రలకు ఎత్తులు వేసిన 'యుటిఎఫ్' నాయకుడు నారాయణ ప్రకటనతో అక్కడక్కడా పాఠశాలలు తెరవడానికి ప్రభుత్వం చేసిన ఆ సంఘం నేతలను తెలంగాణ ద్రోహులుగా గుర్తిస్తూ, ఆ సంఘ రాజకీయ విధానాలు అనుసరించే 'సిపిఎం' పార్టీ మేం తెలంగాణకు అడ్డం కాదు... మేం ఇచ్చే వాళ్ళం కాదు... తెచ్చేవాళ్ళం కాదంటూనే, 'ఢిల్లీ'లో

రాఘవులుతో కలిసి మా విధానం 'సమైక్యవాదమే'నని ప్రకటించిన జూలకంటి రంగారెడ్డి ఇంటిని చుట్టుముట్టడంలో తెలంగాణ ఉద్యోగ ఉపాధ్యాయులు క్రియాశీలక పాత్ర పోషిస్తూనే వున్నారు. అలాంటి తెలంగాణ వ్యతిరేక శక్తుల టీచర్లను అప్రెంటీస్ పేర భయపెట్టి తాము సమ్మె చేసినప్పుడు అడ్డురాని ఆటంకాలను సృష్టించిన సంఘం వైఖరిని నిరసిస్తూ తెలంగాణ వ్యాప్తంగా కేసులు పెట్టినా వెనుకడుగు వేయకుండా సమ్మెను విజయవంతం చేస్తున్న టీచర్ల ఆక్రోశానికి న్యాయం వున్నది.

వ్యక్తిగతంగా టీచర్లకు ఒక పార్టీపైన నాయకులపైన విశ్వాసం గాని, వ్యతిరేకతగానీ లేదనడానికి ఆ తర్వాత జరిగిన 'టిడిపి' ఒకరోజు దీక్షల్లో సహితం తెలంగాణ వ్యాప్తంగా వందలాది టీచర్లు ఆ పార్టీ అనుసరిస్తున్న అవకాశవాద విధానాల్ని ఎండగడుతూ బాహా బాహికి తలపడటంతో నెత్తురోడటం చూశాం. అట్లా ఏ రాజకీయ పార్టీ అయినా తమ ఆకాంక్షలకు వ్యతిరేకంగా 'సమ్మె'ను విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నం చేస్తే జీవో 177, జీవో 130ల పేర సీమాంధ్ర ముఖ్యమంత్రి బెదిరించినా వెరవకుండా నిలబడ్డప్పుడు రాజకీయ పార్టీలు తమ బాధ్యతను విస్మరించాయి. ప్రజల ఓట్లతో గెలిచి, తెలంగాణ ఇస్తామని తెస్తామని చెప్పి ఏండ్లకేండ్లు గడుస్తున్నా జీవన్మరణ పోరాటం చేస్తున్న 'సకల జనుల పోరాటం' 'తెలంగాణ ఇచ్చేదాకా తెగించి కొట్లాడుడే' అంటుంటే అలాంటి వేదికల మీద 'మేం సంపూర్ణంగా సకలజనుల సమ్మెకు మద్దతు ప్రకటిస్తున్నాం' అంటూ పలు రాజకీయ పార్టీలు బాధ్యత మరిచి ప్రకటించడాన్ని ప్రజలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలు సహించలేకపోతున్నాయి. ఉద్యమం మరింత 'మిలిటెంట్' రూపం దాల్చినా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వర్గాలపై వేటుపడినా, మళ్ళీ ద్రోహం జరిగినా, రాయల తెలంగాణ పేరనో, ఉమ్మడి రాజధాని పేరనో 'ప్రజల ఆకాంక్ష'ను నిర్వీర్యం చేయదలిస్తే పరిణామాలు తీవ్రంగా వుంటాయని బాధ్యత గల రాజకీయ నేతలు గుర్తించాలి. ఉద్యోగ వర్గాలు కొంతమంది ఉద్యమకారులు, ఇది సీమాంధ్ర – తెలంగాణ ప్రజల మధ్య కొట్లాటలా చిత్రీకరిస్తున్న కల్పిత మేధావుల కుట్రలను గుర్తుంచుకోవాలి. 'తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల పోరాటాల స్ఫూర్తివల్లే దూర ప్రాంతంలో ఉన్న సీమాంధ్ర ఉద్యోగులు తమ ప్రయోజనాలు పొందగల్గారు, కనుక తెలంగాణలో విధులు నిర్వహిస్తున్న సీమాంధ్ర ఉద్యోగులు, వనస్థలిపురం, సెక్రటేరియట్‌లను రణరంగంగా మార్చకుండా సహకరించడం ప్రదర్శించాల్సిన విజ్ఞత 'అన్నదమ్ముల్లా విడిపోదాం – ఆత్మీయుల్లా కలిసుందాం' అని సీమాంధ్ర కవులు 'కావడి కుండలు' కవితా సంకలనంలోని స్ఫూర్తిని ఉద్యోగులు కొనసాగించాలి. ■

**– కె. ప్రభాకర్**
కన్వీనర్, తెలంగాణ టీచర్స్ ఫోరం

30.09.2011, ఆంధ్రజ్యోతి



*సకల జనుల సమ్మెలో ఆర్ అండ్ బీ కార్యాలయ ఉద్యోగులు. తేది : 24-9-2011*




*సకల జనుల సమ్మెలో తెలంగాణ ఉద్యోగి సైకిల్‌పై పోస్టర్. తేది : 24-9-2011.*

# సమ్మె చేసే హక్కు లేదా?

– ఎండి. అన్వర్

తెలంగాణ ప్రజలు ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు కారణంగా చూపుతున్న భౌగోళిక, చారిత్రక, సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక, ఆధిపత్య విషయాలు, అభివృద్ధిలో అసమానతలు– స్వయంపాలన ఆకాంక్షలు పూర్తిగా న్యాయపరమైనవి. దాదాపు యాభై ఆరు సంవత్సరాలుగా తెలంగాణ ప్రజలు కోరుకుంటున్న ప్రత్యేక రాష్ట్రాన్ని పాలకులు ఏనాటో పరిష్కరించాల్సి వుంది. ఆ పని ఇప్పటికీ చేయని పాలకులే ఇక్కడి విద్యార్థుల ఆత్మహత్యలకు, నేటి ఆందోళనల నష్టాలకు అసలు దోషులు.

రాజకీయపరమైన సమస్యలకు చారిత్రక, శాస్త్రీయతలో కూడిన న్యాయపరమైన శాశ్వత పరిష్కారాలు అమలుచేసే దృష్టికోణం మన పాలకులకు లేకపోవడం ప్రజలకు పట్టిన దురదృష్టం. సర్వరోగ నివారిణి 'పెన్సిలిన్' పాతమాటే కావచ్చు కాని మన పాలకులకు మాత్రం ప్రతి సమస్యకు పరిష్కారం మాత్రం 'పోలీసులే'. ఈ విధానాన్ని మొదటినుంచి తెలంగాణ ప్రజల ఆకాంక్షలపైన పాలకులు అమలుచేస్తూ వస్తున్నారు. 1997లో తెలంగాణ కోసం ఉద్యమాలు చేయాలన్న ఆల్ ఇండియా పీపుల్స్ రెసిస్టెంట్ ఫోరం వరంగల్ డిక్లరేషన్ సభలకు, 1999లో తెలంగాణ జన సంఘటన కరీంనగర్ సభలకు అనుమతులు ఇస్తూనే ఆటంకాలు, అరెస్టులు జరిపింది పోలీసులే. నల్గొండ జిల్లాలో తెలంగాణ కళాకారిణి బెల్లి లలిత హత్య అనంతరం జరిగిన పరిణామాలు 'తెలంగాణ' అంటే నక్సలైట్లుగా ముద్రపడి చస్తూ బ్రతకాలనే హెచ్చరికలో ఉద్యమాన్ని తాత్కాలికంగా నిలువరించింది కూడా పోలీసులే. ఇటీవల ఉస్మానియా విద్యార్థులపై, మీడియా పైన పోలీసులు విరుచుకుపడి కొట్టిన తీరును రాష్ట్ర హైకోర్టు తప్పుపట్టింది. ఎంత చట్ట విరుద్ధంగా ప్రవర్తిస్తే అంతగా తాయిలాలు, సత్కారాలు అందుతాయనే నమ్మకాన్ని మన ప్రభుత్వం నక్సలైట్ల అణచివేతలో ఆచరణాత్మకంగా నమ్మకం కల్పించినందున మన పోలీసులు అవకాశం వస్తే చాలు తమ నరకలోక ప్రవృత్తిని ప్రదర్శిస్తున్నారు. సకల జనుల సమ్మె మొదలయి పది రోజులయింది. దక్షిణ భారతదేశ పారిశ్రామిక రంగానికే ఆయువుపట్టులాంటి సింగరేణిలో బొగుగని కార్మికులు మొదటి రోజు నుంచే నిరవధిక సమ్మెకు దిగారు. ఈ సమ్మెవల్ల సింగరేణి వ్యాప్తంగా రోజుకు 1 లక్షా 60 వేల టన్నుల (రూ.25 కోట్ల విలువ) బొగ్గు ఉత్పత్తి నిలిచి పోతుండగా రోజుకు 15 కోట్ల రూపాయల వేతనాలను 66వేల మంది కార్మికులు, తెలంగాణ సాధన కోసం తెలిసే కోల్పోతూ సమ్మెలో పాల్గొంటున్నారు.

సకల జనుల సమ్మెలో ఉన్న ఇతర రంగాల ఉద్యోగుల పనిని ప్రభుత్వం ఎవరితోనైనా చేయించగలదు. కాని బొగ్గు ఉత్పత్తి పనిని మాత్రం ఎవరు చేయలేరు. శారీరక దారుఢ్యం ఉన్న పోలీసులు కూడా చేయలేరు. అందుకే సకల జనుల సమ్మెలో ఉన్న సింగరేణి బొగ్గు గని కార్మికులను పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఇండ్లలో ఉన్నవారిని పట్టుకుని బొగ్గుగనుల వద్దకు తీసుకు వస్తున్నారు. ఇది గోదావరిఖనిలో ఆదివారం నాడు జరిగింది. సోమవారం నాడు పోలీసుల నిర్బంధంలో ఉన్న కార్మికులచే బలవంతంగా మణుగూరు, ఇల్లందులో పనిచేయిస్తుండగా అడ్డుకున్న కార్మిక నాయకులపై పోలీసులు లాఠీచార్జి జరిపి అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం నాడు సమ్మెను పరిశీలిస్తున్న జేఏసీకి చెందిన ఇరవైమంది నాయకులను గోదావరిఖని పోలీసులు అరెస్టు చేశారు. అదుపులో

ఉన్న కార్మికులచే పనిచేయించి ఉత్పత్తి సాధించామనిపించుకోవచ్చు. కాని ఆ కార్మికులు ఆంధ్ర ప్రాంతానికి చెందిన వారైతే ప్రాంతీయ రాగద్వేషాలు పెరిగే అవకాశం లేదా? ఈ విద్వేషాలు ఇకడికే పరిమితమైపోతాయా? వాటి పరిణామాలు ఎంతటి హింసకు దోహదమౌతాయో 1969 ఉద్యమంలో కనిపించలేదా? ఒక డంపర్‌కు ఒక జవాన్ కూర్చొని కార్మికునితో నడిపిస్తాడు. ఇక్కడ స్వేచ్ఛగా కార్మికుడు పనిచేస్తున్నట్లా? తుపాకి భయానికి తన పోరాట స్వేచ్ఛను కోల్పోతున్నట్లా? ఒకరోజు పనికి మూడు రోజకుల వేతనం ఆశచూపుతున్నారు. ఇది పూర్తి నీతి బాహ్యమైన చర్య గతంలో కూడా సింగరేణిలో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు సమ్మెచేస్తే చంద్రబాబు ప్రభుత్వం కూడా ఇదే విధానాన్ని అమలు పరిచింది. బొగ్గు బావులు కార్మికులు నివసిస్తున్న కాలనీలకు నాలుగు, ఐదు కిలోమీటర్ల దూరంలో ఉంటాయి. సమ్మెలో ఉన్న కార్మికులు ఇండ్లలోనే ఉంటారు. వారు ఏ నేరం చేసే అవకాశం లేకపోయినా పోలీసులు ఎందుకు అదుపులోకి తీసుకుంటున్నారు? ఈ చర్యలు చట్టు విరుద్ధం కాదా? 'సమ్మె' కార్మికునికి ప్రభుత్వానికి సంబంధించిన విషయం. పరిష్కారానికి కార్మిక శాఖ అధికారులు ఉంటారు. సంప్రదింపులు వాటిలో భాగం. పని చేయాలనే బాధ్యత ఉన్నందున కార్మికులు సమస్య పరిష్కారానికి ప్రజాస్వామిక పద్ధతుల ద్వారా ప్రజా ప్రతినిధుల ద్వారా ఒత్తిడి పెడుతుంటారు. కార్మికులకు వారికి ప్రాతినిధ్యం వహించే కార్మిక సంఘాలకు ఈ అవకాశం కూడా లేకుండా అరెస్టుల జులుం ఏమిటి? తెలంగాణ కోసం అందరు కాకపోయినా కొందరు ఎమ్మెల్యేలు, ఎంపిలు, మంత్రులు రాజీనామాలు చేసి పనులు వదిలి నిరసన తెలిపారు. అదే పనిని తెలంగాణ బొగ్గుగని కార్మికులు చేస్తున్నారు. మరి ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులను నిర్బంధంలోకి తీసుకుని పోలీసులు ఎందుకు పనిచేయించలేదు? వారు పదవులు వదిలితే త్యాగధనులు; వారికి సభలు, సత్కారాలు! కొలువులు వదలక కేవలం సమ్మెలోకి వెళితే కార్మికులు, ఉద్యోగులు, సకల జనులు మాత్రం పోలీసుల దృష్టిలో నేరస్థులవుతున్నారు. ఈ రాష్ట్రంలో సమ్మెచేసే హక్కును కూడా ప్రభుత్వం పోలీసులతో ఎన్‌కౌంటర్ చేయిస్తున్న విషయం సింగరేణి కార్మికులను కలిస్తే తెలుస్తుంది.

రాజకీయ, ఆర్థిక, వృత్తిపరమైన సమస్యల పరిష్కారానికి కార్మికులకు సమ్మె తప్ప మరేవిధమైన మార్గం లేదు. సమ్మెలు, హర్తాళ్ళు దేశ స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని పెంచిన పోరాట రూపాలే. వాటి వెనుక ఉన్న ఆకాంక్షలను గుర్తించి పరిష్కరించడమే నేటి గణతంత్ర సంక్షేమ ప్రభుత్వ నేతల బాధ్యత. సమ్మె కార్మికుని హక్కు. ఈ హక్కుకు రక్షణ పల్పించడమే పోలీసుల బాధ్యత. ప్రజాస్వామిక దేశంలో ప్రజల పని ఓట్లు వేయడం వరకే, తోచిన రీతిలో పాలన చేస్తాం అన్నట్లు పాలకులు ప్రవర్తించడం సరికాదు. తెలంగాణ వ్యాప్తంగా సకల జనులు చేస్తున్న సమ్మె కాంక్షను కూడా పాలకులు గౌరవిస్తూ పరిష్కరించవల్సిందే. అందుకు తెలంగాణ ఏర్పాటుకై రాజకీయ ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించడమే ఆందోళనలకు పరిష్కారం. ■

**– ఎండి. అన్వర్**

మానవ హక్కుల కార్యకర్త

23.09.2011, ఆంధ్రజ్యోతి



*బహుజన కెరటాలు ప్రత్యేక సంచికను ఆవిష్కరణ కార్యక్రమంలో ఎడిటర్ శ్రీరాం మూర్తి మరియు ప్రముఖులు. తేది : 6-11-2011*

# ఐక్యతే మన ఆయుధం

– చుక్కా రామయ్య

మా తెలంగాణ సాయుధ పోరాటానికి నేడు నడుస్తున్న మలిదశ తెలంగాణ ఉద్యమానికి సారూప్యాలు ఎన్నో కనిపిస్తున్నాయి. ఆ పోరాట కాలంలో మా ఊరి దొర దున్నపోతు చనిపోయింది. మూడోనాడు దొర దున్నపోతు చనిపోయిన విషయం మాకు తెలిసింది. అది కూడా వాసనతో తెలిసింది. దొరకు కోపమొచ్చి మా ఊరు ఎల్లయ్యను పిలిపించి, నీకు వాసన రావటంలేదా? దున్నపోతు చచ్చి మూడు రోజులైంది? దిన్ని తీసెయ్యవా? అన్నాడు. దొర నాకెందుకు తెలవదు. దున్న చచ్చిన విషయం నాకు మూడు రోజుల క్రితమే తెలుసు. సంఘపోల్లు దొర ఇంటికి పోవద్దు అని చెప్పింద్రు. అందుకే నేను దున్న చచ్చినా నీ ఇంటికి రాలేదన్నాడు. దున్నపోతు నాది, చచ్చింది నాకొట్టంలో, ఇది నా ఇంటికి సంబంధించిన విషయం. దీనికి సంఘపోల్లకు సంబంధం ఏమి ఉందని దొర ఎల్లయ్యతో అన్నాడు.

నాడు మా పోరడు తెలిసో తెలవకో ఒక రాయి తీసుకుని మీ మామిడిచెట్టు మీద విసిరాడు. ఆ రాయి దెబ్బకు కాయ రాలిపడింది. ఎన్నో పక్షులు వచ్చి ఆ మామిడికాయలు తినిపోతున్నా, టెంకలు కిందపడ్డా ఏమీ చేయలేకపోతిరి. కానీ మా పోరడు ఆ కాయను రాల్చినందుకు వాణిణ చెట్టుకు కట్టేసి మీ బెత్తంతో కొడుతుంటే, నాడు ఊరంతా గొడ్డళ్ళు తీసుకుని మా పిల్లగాణ్ణి వదిలిపెట్టమన్నారు. లేకపోతే ఆ మామిడి చెట్లన్నీ నరికేస్తామని సంఘపోళ్ళు హెచ్చరిక చేయడంతో నా పిల్లగాడి ప్రాణం దక్కింది. అదే దొరా! నాకు ఆ సంఘపోల్లకున్న సంబంధమన్నాడు. వాళ్ళ మాట వినకపోతే మంచిదా? దొరా!? నువ్వే చెప్పు అన్నాడు. నాడు ఒకని కోసం సంఘం, సంఘం కోసం ఒకడు అన్న ఐక్యత ఉండేది. నేడు కూడా అదే పరిస్థితి తెలంగాణలో నాకు కనిపించింది. సింగరేణి కాలరీస్‌లో ఉన్న కార్మికులు సమ్మె చేయటం వల్ల విద్యుత్ ఆగిపోయే స్థితి వచ్చింది. ఊళ్ళన్నీచీకట్లతో నిండిపోతున్నాయి. ఇదెక్కడి న్యాయమని అందరూ మొత్తుకుంటున్నారు. సింగరేణి కాలనీల బొగ్గు మాకొక వరం. ఎక్కడెక్కడో ఉండి తిండిలేకుండా చస్తుంటే మాకు బొగ్గు గనులు దొరికాయి. దాన్ని నల్లబంగారం అనుకున్నాం. ఈ బొగ్గే మాకు అన్నం. సర్వస్వం అనుకున్నాం. మా ప్రాంతంలో అంతగా చదువులేదు. కాయకష్టం చేసి బతికేవాళ్ళం. చేసుకునేందుకు చెలకలు లేకపోతే ఆకలితో మలమల మాడుతూ చస్తూ ఉన్న ఆ కాలంలో మాకీ బొగ్గు బావులు బువ్వ పెట్టాయి. మాకే కాదు, మా పిల్లలకు కూడా బువ్వపెట్టాయి. పెంచి పెద్ద ఈ బొగ్గుబావులే. మా పిల్లలకు మంచి చదువులు చెప్పించినా, ఇంజనీర్లు ఆయ్యేవాళ్ళు కదా! అందరిమాదిరిగా మా పిల్లలు కూడా పెద్ద పెద్ద ఉద్యోగాలు చేసేవారు కదా! మా దగ్గర డబ్బు లేకపోయే, పరిశ్రమలు రాకపోయే. దున్నుకుందామంటే పొలం లేకపోయే, కనీసం బొగ్గు మీద బతుకుదామంటే ఓపెన్‌కాస్ట్ అని పెడితిరి. నూట అరవై సంవత్సరాలు బతకవలసిన జీవనోపాధిని మీ అవసరాల కోసం ఇరవై సంవత్సరాలకే పరిమితం చేశారు కదా!

మాకు ఈ ప్రజానీకానికి జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలందరూ సమ్మె చేస్తుంటే మేం మౌనంగా ఎలా కూర్చోమంటారు. అందరితో సహా మేము కూడా సింగరేణిలో పనిమానేశాం. మూడు రోజులు చీకటైతే మీరు భరించలేరే. మా శ్రమతో ముప్పై సంవత్సరాల నుంచి ఇతర ప్రాంతాల జీవితాలను


నిర్మిస్తున్నామే. ఎవరైనా మా జీవితం ఏమిటి? ఎంతమంది చనిపోతున్నారు? ఓపెన్‌కాస్ట్ చేయవద్దని ఎంత మొత్తుకున్నా కానీ మమ్ములను పట్టించుకోలేదే? కొద్దిరోజుల్లో ఈ ప్రాంతమంతా ఓపెన్‌కాస్ట్‌లతో ఈ నేలంతా విధ్వంసం కాబోతున్నదని లక్షలాది మంది కార్మికులు గొంతెత్తి నినదించినా ఎవరూ పట్టించుకోలేదు. ఇక మా జీవితాన్ని బాగు చేసుకునేందుకు, మా పిల్లలకు మంచి భవిష్యత్తు కోసం తెలంగాణ రాష్ట్రం కావాలని బొగ్గుబావుల్లో పెల్ల కదలకుండా బంద్ చేశాం. ఇప్పుడైనా అందరితో కలిసి పోరాటం చేస్తే మాకూ, మా పిల్లల జీవితాలు బాగుపడతాయని పోరు బరిలోకి దూకాం. మాకు పోయేదేముంది? కాకపోతే గీకపోతే ఓ నెలో, రెండు నెలలో జీతమే కదా పోయేది! ఈ పోరాటం గెలిస్తే మాకు, మా పిల్లల జీవితాల్లో వెలుగులే కదా!!

మీరు మూడు రోజుల చీకటి గురించి బాధపటుతున్నారు. మా జీవితాలన్నీ చీకటైన తీరు గురించి మేం మాట్లాడుతున్నాం. సమ్మె విఫలమైతే మళ్ళీ మాకు చీకటేకదా ! సమ్మెను విఫలం చేయటానికై పోలీసులు బలప్రయోగం చేస్తున్నారు. ఎవరి కోసం సింగరేణి వెన్నుపై తుపాకీ మోపుతున్నారు. లాఠీలతో, తూటాలతో, అక్రమ అరెస్టులతో, పనిచేసే కార్మికులను బెదిరించి సింగరేణిలో బొగ్గుబావులు నడిపించాలని చూస్తున్నారు. ఆయుధాలతో అదరగొట్టవచ్చును, బెదరగొట్టవచ్చును కానీ వాటితో పనిచేయించలేరు. ఇది ఎందుకోసం ప్రభుత్వం చేస్తున్నదో ప్రజలందరికీ స్పష్టంగా అర్థమవుతూనే ఉన్నది. నలుగురితో కలిసి చేస్తేనే పండుగ. అదే మాదిరిగా ఈ సకల జనుల సమ్మె మా ముందున్న జీవితాలకు భవిష్యత్తు బాటగా నిలుస్తుంది. అందుకే సకల జనుల సమ్మె ఏ ఒక్కరిదో కాదు. మొత్తం ఈ నేలకు చెందిన నాలుగున్నర కోట్ల మంది ప్రజల ఆకాంక్షగా చూడాలి. సర్వజనుల సమ్మెను రాజకీయం చేయడానికి ఎవరు ప్రయత్నించినా వారు రాజకీయంగా దెబ్బతినడం ఖాయం. సకల జనుల సమ్మెను ప్రజల ఆకాంక్షల మేరకు విజయవంతం చేయడం అందరి బాధ్యత.

**– చుక్కా రామయ్య**

ప్రముఖ విద్యావేత్త, శాసనమండలి సభ్యులు

23.09.2011, నమస్తే తెలంగాణ



*సకల జనుల సమ్మె సందర్భంగా జూబ్లీ బస్ స్టేషన్‌లో ఆర్టీసి జె.ఎ.సి. ధర్నాలో పాల్గొన్న మల్లెపల్లి లక్ష్మయ్య. తేది : 21-9-2011.*

# మీరు సీమాంధ్ర అగ్రకుల సంపన్న వర్గాల వైపా లేక తెలంగాణ నాలుగు కోట్ల ప్రజలవైపా?

**– చిక్కుడు ప్రభాకర్**

సెప్టెంబర్ 19న ప్రచురించబడిన 'సర్వజనుల కర్తవ్యం' అనే నా వ్యాసానికి స్పందనగా సెప్టెంబర్28న ప్రచురింపబడిన గుడపల్లి రవి వ్యాసం అయిన 'గడీలను కాచేవారితో జాగ్రత్త' సరళి మొదటి నుండి ఆ ఖరు వరకు వస్తుగతంగా లేకుండా, అప్రజాస్వామికంగా, అరాచకంగా కొనసాగడమేకాకుండా, ఫ్యూడల్ వ్యవస్థను కూడా సమర్థించే వరకు వెళ్ళింది. ఇది సోచనీయం.

సామాజిక తెలంగాణ, వర్గీకరణ గూర్చి మాట్లాడితే బహుజనులను బెదిరిస్తున్నారంటూ, అదేవిధంగా దొరల దగ్గర జీతగాళ్ళుంటూ బెదిరించే ధోరణి గుడపల్లికి తగదు. సామాజిక తెలంగాణ అంటే ఈ ప్రాం తంలోని దళిత అణగారిన వర్గ ప్రజలకు దామాషా ప్రకారం అన్ని వనరులతో పాటు ఉత్పత్తి సాధనాలు కూడ దక్కినప్పుడే సామాజిక తెలంగాణ మనుగడ ఉంటుందని, అవి ప్రత్యేక ప్రజాస్వామిక తెలంగాణ లోనే అవకాశం ఉంటుందని సమగ్రంగా చెప్పడం జరిగింది. అలాగే వర్గీకరణ విషయంలో బాధితులు ఏ విధంగా ఉద్యమంలో అగ్రభాగన నిలబడ్డారో, వారితో సమానంగా ఉద్యమ అగ్రభాగాన నిలబడడమేకాక, ఆ ఉద్యమాన్ని అత్యంత ప్రజాస్వామిక ఉద్యమంగా నిలబెట్టే ప్రయత్నం గత పదిహేను సంవత్సరాలుగా చేస్తూనేవున్నాం. ఆ విషయం 'సమస్య' మీద పోరాడుతున్న అగ్రనాయకత్వానికే కాక, మొత్తం సమాజానికి కూడా తెలుసు. అయితే ఆ సమస్య పేరుమీద తెలంగాణ ప్రజల ప్రజాస్వామిక డిమాండ్ అయిన రాష్ట్ర ఏర్పాటుకు ముడిపెట్టి అది పరిష్కారంకాకుండా, ఇది పరిష్కారం కావడానికి వీలులేదు అని అనడం కాకుండా, సామాజిక తెలంగాణ పేరుతో మొత్తం ఉద్యమాన్ని చీల్చే ప్రయత్నాన్ని మాత్రమే వ్యతిరేకిస్తున్నాం.

గుడపల్లి రవిగారు అన్నట్లు గద్దర్‌కు వ్యక్తిగత అనుచరుడిని కాను నేను. ప్రాపంచిక దృక్పథ పాత్రిపదికగా ఒకే ఉద్యమంలో పనిచేసే అవకాశం కలిగింది. మిత్రులు గద్దర్, నేను "శ్రామికవర్గ ప్రాపంచిక దృక్పథం" కలిగిన వారం. గతనాలుగున్నర దశబ్దాలుగా అదే దృక్పథంతో తన సృజనాత్మక ప్రజాకళల ద్వారా శ్రమ సౌందర్యాన్ని విప్పి చెప్పి ప్రపంచ శ్రామిక విముక్తికి పోరాటమే మార్గం అని తను చెపుతున్నారు. నేను కూ డా గతమూడు దశబ్దాలుగా వివిధ ప్రజాస్వామిక ఉద్యమాలలో పాల్గొంటూ ప్రతి నల్లచట్ట బాధితునికి అండగా నిలబడడమే కాకుండ, ఈ దేశ,ప్రాంత పీడిత ప్రజల హక్కుల రక్షణకై అగ్రకుల సంపన్న భూ స్వామ్య పాలక వర్గలతో పోరాటం చేస్తూనే వున్నాను. ప్రస్తుతం కూడ తెలంగాణ ప్రజల వైపు నిలబడి సీ మాంధ్ర సంపన్న అగ్రకుల భూస్వామ్య పాలక వర్గానికి వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చేస్తున్నాను. దొరలకు వ్యతిరేకంగా పోరాడిన, పోరాడుతున్న వారసత్వాన్ని కొనసాగిస్తూననే విషయం సమాజం మొత్తానికి తెలుసు.

1969 సం॥లో 370 మంది తెలంగాణ ముద్దు బిడ్డలను బలితీసుకున్న సీమాంధ్ర అగ్రకుల భూస్వామ్య పాలకవర్గం వారసత్వమే భారతదేశ చరిత్రలో అత్యంత అమానవీయ సంఘటనలుగా పేరుగాంచిన దళితుల హత్యకాండలయిన కారంచెడు, నీరుకొండ, చుండూరు, వెంపెంటలు సృష్టించాయి.నేటికి రాయలసీమలోని బహుజనులు అగ్రకుల పాలెగాళ్ళ రాజ్యంలో బతుకులీడుస్తున్నారు. ఈ పాలక వర్గ వారసత్వమే 1998 సం॥లో

ఏర్పడిన తెలంగాణ మహాసభ, తెలంగాణ జనసభ నాయకత్వాన్ని నెత్తుటేరుల్లో ముంచింది. బెల్లిలలిత నుండి మొదలుకుని మారోజు వీరన్న వరకు ఈ దుర్మార్గ పాలకుల చేతిలో చంపబడ్డారు. 1996 సం॥నుండి 2004 సం॥ వరకు ప్రజాస్వామ్యమంటే దళితులను, బహుజనుల, వీరి తరపున పోరాడుతున్న ప్రతిపోరున్ని చంపడమేననే విధంగా ఈ సీమాంధ్రకు చెందిన పాలకవర్గం ప్రవర్తించింది. ఈ ప్రాంత ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలోనే తన రాజకీయ అస్థిత్వం ఉందని గ్రహించిన కె.సి.ఆర్ 2001, ఏప్రిల్ 27న పార్టీని స్థాపించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కొరకు రక్తం చుక్క కారకుండ, ఎం.పి.టి.సి. నుండి పార్లమెంటు వరకు ఎన్నికలలో నిలబడి గెలిచి సంకీర్ణ ప్రభుత్వాలకు మద్దతు తెలిపి తెలంగాణ రాష్ట్రం సాధిస్తామని చెప్పడమే కాకుండా, రక్తం బొట్టు కారకుండ, ఏ ఒక్కరు ప్రాణం అర్పించకుండానే తన లక్ష్య సాధన జరుగుతుందని కొంతమంది ప్రజలను నమ్మించారు. ఈయన సిద్ధాంతంతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడదు, ఈ ప్రాంతవనరుల రక్షణ జరుగదు. సీమాంధ్ర అగ్రకుల భూస్వామ్య సంపన్న వర్గం తెలంగాణ ప్రాంతంలో ఊడలు దిగిన మర్రిచెట్టు లాగ పాతుకుపోయింది. తెలంగాణకు చెందిన సమస్త భూమిమీద, వనరుల మీద పట్టు సాధించి దోపిడినే ప్రధానంగా కొనసాగిస్తున్నది, కనుక దీని మెడలు వంచి నాలుగు కోట్ల ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్ష నెరవెరాలంటే మహత్తర ఉద్యమమే సరియైన పంథా అని, ఆ ఉద్యమం కూడ ఏ ఒక్క ఉద్యమసంస్థ ద్వార సాధ్యం కాదని వేరు వేరు స్రవంతులుగా ఉన్న 'విశాల శక్తుల ఐక్యపోరాటమే' లక్ష్య సాధనకు మార్గమని పల్లె పల్లెకు ప్రత్యక్షంగాను, పరోక్షంగాను ప్రచారం చేసినాం. ఏ ఉద్యమ పంథా అయినా సరియైనదని నిరూపితం కావలంటే ప్రజలలోకి వెళ్ళిన తర్వాత అది 'మహత్తర భౌతికశక్తి' గా మారాలి. నవంబర్, 30 నుండి డిసెంబర్9, 2009 వరకు ఉద్యమ స్రవంతులు అనుసరించిన పంథా సరియైనదని, కేసిఆర్ అనుసరించిన ఎన్నికల పంథా సరియైనదనికాదని నిరూపించబడింది.

ఈ మహత్తర ఉద్యమం ద్వారా సాధించిన విజయాన్ని సీమాంధ్ర అగ్రకుల సంపన్న భూస్వామ్య పాలకులు నీరుగార్చారు. తమ అర్థ, అంగబలాల ద్వార రాష్ట్ర ఏర్పాటును అడ్డుకున్నారు. కమిటీల రూపంలో, ఏకాభిప్రాయం రూపంలో రాష్ట్ర ఏర్పాటును అడ్డుకుంటుండగా, ప్రకటించిన తెలంగాణ ఇక ఎప్పటికి రాదేమోనని తెలంగాణ ప్రాంత విద్యార్థి, యువత, ఉద్యోగుల ఆత్మహత్యలు రోజురోజుకు తీవ్రమవుతు న్నాయి. రెండు ప్రాంతాలలో సకలం దోచుకున్న, దోచుకుంటున్న ఆ పాలక వర్గ మెడలు వంచడానికి ఏకైక మార్గం నాలుగు కోట్ల ప్రజలు ఏకమై మితవాద, అతివాద అవకాశానికి అవకాశంలేని, ఉద్యమ వ్యతిరేక ధోరణులను వీడి సరియైన పంథాను కొనసాగించడం ద్వారానే లక్ష్యసాధన సాధ్యమవుతుందనే వాస్తవాలకు రూపాలే నారచనలుగా అర్థం చేసుకోవాలని రవి లాంటి వారిని కోరుతున్నాను. ఈ వ్యాసాలలోని సారాంశం అర్థం చేసుకోలేని రవి లాంటి వారు తాము దొరల దగ్గర ఊడిగించేస్తున్నారు కాబట్టి అందరు చేస్తారని అనుకోవడం వారి భ్రమగా గుర్తించాలి. ప్రపంచంలో ప్రాణమే విలువైయినది, గద్దర్ ప్రాణం తీసేందుకు పాలకవర్గం ప్రయత్నించినా, ప్రజల అండదండలు ఆయనకు ఉన్నాయి కాబట్టి బతకగలిగారు, తనకు చేతనైన సేవ ప్రజలకు చేయకలుగుతున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అయిదు దశబ్దాల తర్వాత రాజ్యానికి పౌరుడిని చంపే హక్కులేదని ఈ మధ్యనే దేశ అత్యున్నత న్యాయస్థానం చెప్పిందంటే గత అయిదు దశబ్దాలుగా కోట్లాది ప్రజల హక్కులు కాలరాచిన రాజ్యాంగం పట్ల ఏ విధంగా ప్రజలకు భ్రమలు కల్పించమని నన్ను అడుగుతున్నారో రవిగారు సమాధానం చెప్పాలి. సిపియుఎస్ఐకి, అంభేద్కరి జానికి లోబడి పని చేస్తున్నానని చెప్పుకునే రవి ఈ రాజ్యాంగం పట్ల అంబేద్కర్‌కు,మారోజు వీరన్నకు ఏం అభిప్రాయముండేదో తెలుసుకోవాలి. అలాగే సకలజనుల సమ్మె చేయడంలో ఈ ప్రాంత అగ్రకులాల ప్రయోజనాలతో పాటు ఈ ప్రాంత 90 శాతం బహుజనుల మీద కొనసాగుతున్న సీమాంధ్ర అగ్రకుల సంపన్న భూస్వామ్య పాలకవర్గం యొక్క దోపిడి, అధిపత్యంకూడ తొలగి పోయేందుకు తొలిమెట్టుగా ఉపయోగపడుతుందని తెలుపుతున్నాను. అందుకే నాలుగు లక్షల ప్రభుత్వ ఉద్యోగులు, డెభైవేల సింగరేణి ఉద్యోగులు, అరవైవేల ఆర్టీసి కార్మికులుతో పాటు, విద్యుత్ ఉద్యోగులు,మున్సిపాలిటీ ఉద్యోగులు, వైద్యులు, న్యాయవాదులందరు కలిసి ఈ సమ్మెను గత 25 రోజులుగా

అకుంఠిత దీక్షతో కొనసాగిస్తున్నారు. సీమాంధ్ర అగ్ర కుల సంపన్న భూస్వామ్య పాలకవర్గం ఎన్ని కుట్రలు పన్నినా, వాటిని ఛేదిస్తూ ముందుకు సాగుతున్న ఈ ఉద్యమశక్తులలో 90 శాతం దళిత, బహుజన శక్తులే ఉన్నాయి. వీరందరు కూడా దొరలకు ఊడిగం చేస్తున్నట్లు కాదు. వారందరూ ఈ దుర్మార్గ పీడన నుండి విముక్తి కోసం చేస్తున్న పోరాటం భవిష్యత్తు తరాలకు ఉపయోగపడాలనే దీర్ఘకాల దృష్టితో ముందుకు పోతున్నారు.

ఇక సాయుధ పోరాటం గూర్చి పిలుపునివ్వడం గూర్చి నేను చాలా స్పష్టంగానే ఉన్నాను. ఇది మహత్తర ప్రజా ఉద్యమం. ఈ ఉద్యమంలో మీలాంటి వారు తప్ప పసిబాలుడి నుంచి పండు ముదుసలి వరకు తమకు తోచిన విధంగా ఉద్యమంలో ఉధృతంగా పాల్గొంటున్నారు. ప్రజాయుద్ధంలో ఆయుధం ఒక భాగం మాత్రమే. అది అవసరం వచ్చినప్పుడు అందుకునేందుకు ప్రజలు ఏమాత్రం వెనుకాడరు. అది ఇప్పుడు అప్రస్తుతం. నాలుగు కోట్ల సమస్త ప్రజానీకం ఆకాంక్షలో కేసీఆర్ ఒక చిన్న గులకరాయి మాత్రమే కానీ, ఆయనే సర్వస్వం అని ఊహించుకోవడం రవి గారి భ్రమనే అవుతుంది. కేసీఆర్, కోదండరామ్ యొక్క అప్రజాస్వామిక ధోరణుల పట్ల నిరంతరం విమర్శ కొనసాగిస్తూనే, ఈ విమర్శ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అడ్డుపడుతున్న సీమాంధ్ర పాలకులకు ఉపయోగపడకుండా ఉద్యమాన్ని ఉధృతం చేస్తున్నాం. ఇందులో భాగంగానే నవంబర్30, 2009న కేసీఆర్ దీక్ష విరమించినప్పుడు అతని తప్పుడు విధానాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమానికి దశ దిశను కొనసాగించాం. కానీ, మీరు మాత్రం అంబేద్కరిజం, మారోజు వీరన్న ఆశయసాధన ముసుగులో, వారు చెప్పిన 'హక్కులు అడుక్కుంటే రావు, పోరాడితే వస్తాయనే' ప్రాథమిక సూత్రానికి తిలోదకాలిస్తూ, పోరాడే వారి మీద నిందలేస్తున్నారు. "తెలంగాణలో గడీలు మొత్తం ప్రజలపరం అయ్యాయి. ఈ గడీలన్నీ ప్రజలపరం కావడానికి ఎంతో రక్తాన్ని చిందించాల్సిన అవసరం ఏర్పడింది. నేడు నయాగడీల రూపంలో ఫామ్‌హౌజ్‌లు, రిసార్ట్స్, సినిమా స్టూడియోలు, రియల్ ఎస్టేట్స్ వచ్చి తెలంగాణకు చెందిన దళితుల, బహుజనుల భూములను ఆక్రమించాయి. వాటిని కాపాడేవారిగా" మీరు మిగులవద్దని కోరుతున్నాను.

ప్రపంచ మానవ చరిత్ర అంతా బానిస–భూస్వామ్య పెట్టుబడిదారి చరిత్రగా నమోదైంది. వీటిని కూల్చి సమతా మానవుని ఉద్భవింపజేసేందుకు మహనీయులు చేసిన ప్రయత్నంలో వారు పాక్షికంగానే విజయం సాధించారు. ప్రపంచ ఫాసిస్టులలో హిట్లర్, ముసోలినీ తరువాత అసఫ్‌జాహీల వంశానికి చెందిన మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ నిలిచాడు. హిట్లర్‌ను అధికారం నుంచి తొలగించేందుకు మొత్తం మూడు కోట్ల ప్రజలు తమ రక్తాన్ని ధారపోయగా, తెలంగాణ ప్రాంతానికి పట్టిన 'తరతరాల బూజు అయిన రాజు'ను దించడానికి రాంజీ గోండు, కొమురం భీం నుండి దొడ్డి కొమురయ్య,భాయి బందగీ, షోయబుల్లాఖాన్ వరకు వేల మంది తమ ప్రాణాలను తృణప్రాయంగా భావించి అసువులు బాసిన తరుణంలో ఆ మూర్ఖున్ని ఎందుకు మీరు పొగడుతున్నారో తెలంగాణ బహుజనులకు సమాధానం చెప్పాలి. అంబేద్కర్ సహాయం చేశాడని, కాషాయ సమాజం, ఆర్యసమాజం దుష్ప్రచారం చేస్తున్నాయనే పేరుతో ఆ దుర్మార్గుడిని చర్చలోకి లాగవలసిన అవసరం ఏమొచ్చిందో రవిగారు ఈ ప్రాంత అణగారిన, బహుజన ప్రజలకు వివరించాలి. అలాగే ఉరిశిక్షను రద్దు చేశాడని, 400 మందిని మాత్రమే చంపినాడనే ప్రచారం చరిత్రను వక్రీకరించడమే అవుతుంది. తమ సుఖప్రదమైన జీవితం కోసం, తన జాగీర్దార్లు, జమిందార్లు సుఖంగా జీవించడం కోసం మొండ్రాయిలో ఠానునాయక్ నుంచి కోఠి చౌరస్తాలో తుర్రెబాజ్‌ఖాన్‌ల వరకు ప్రాణం ఉండగానే అవయవాలు తీసివేసి రోజుల తరబడి అత్యంత క్రూరంగా హింసించిన చరిత్ర మీర్ ఉస్మాన్ అలీ ఖాన్‌ది. అలాగే మాతృభాషలో విద్యను బోధించడమనేది శాస్త్రీయ విద్యావిధానంలో ఒక భాగం,దీనిని తీవ్రంగా వ్యతిరేకించి, ఉర్దూ పాఠశాలలు నెలకొల్పి, లక్నో నుంచి ఉర్దూ పండితులను, ఉర్దూ అధికారులను తీసుకువచ్చి పాలన కొనసాగించడం వలననే తెలంగాణ సాయుధపోరాటానికి ముందు గ్రంథాలయ ఉద్యమం వచ్చింది. నాటి నుంచి నేటి వరకు పోరాట వారసత్వాన్ని ప్రజలకు విప్పిచెప్పడంలో అర్థం ఉంది. పోరాటం దేనికదే విడివడి ఉండదు. గతం – వర్తమానం – సమగ్రంగా అర్థం చేసుకున్నప్పుడే భవిష్యత్ ఎంత అర్థవంతంగా ఒఉండాలో కూడా నిర్ణయించబడుతుంది. నేటి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు పోరాటం తెలంగాణ ప్రాంతంలోని సకల వనరులను దోచుకొని, తెలంగాణ ప్రజలను

సర్వనాశనం చేసిన సీమాంధ్ర అగ్రకుల సంపన్న భూస్వామ్య వర్గం ఆధిపత్యం నుంచి తెలంగాణ ప్రజలను విముక్తి చెందించడం కొరకే గాకుండా, తెలంగాణ ప్రజలందరికీ సమాన ఉత్పత్తిసాధనాలు, వనరులు, ఉద్యోగాలు, పదవులు కూడా దక్కడం కొరకే జరుగుతున్నది. అందులో భాగం కమ్మని ఉద్యమ నాయకత్వ శక్తులలో ఒకరిగా కోరాను. కానీ, మిమ్మల్ని కేసీఆర్ పార్టీలో చేరాలనో, కోదండరామ్ సరసన నిలబడమనో చెప్పలేదు. అలాగే ఈ నయా సీమాంధ్ర భూస్వామ్య అగ్రకుల సంపన్న వర్గాన్ని కూలదోసేందుకు జరుగుతున్న పోరా టంలో మీరు ఏవైపు? తెలంగాణ నాలుగు కోట్ల ప్రజల వైపు నిలబడుతారా? లేక తెలంగాణ రాష్ట్ర ఏర్పా టును అడ్డుకుంటున్న అమానవీయ శక్తుల వైపు నిలబడుతారో నిర్ణయించుకోవాల్సింది మీరే.

ఓ వైపు ప్రజా ఉద్యమాల పేరుతోనే ప్రజాస్వామిక ఉద్యమాల పట్ల, వాటిలో భాగమైన, నాయకత్వం వహిస్తున్న వారిపైన మీరు కక్కుతున్న విషంలో పాలక వర్గాల కుట్ర దాగి ఉన్నది. మీరు చేస్తున్న ఆరోపణ లలో వాస్తవం లేదు, నిర్దిష్టత అంతకంటే లేదు. అందుకొరకే ప్రజలు మీ మాటల్ని నమ్మడం లేదు. ఉద్యమిస్తూనే ఉన్నారు. ఉద్యమించే శక్తులన్నింటికీ సంపూర్ణ మద్దతు తెలుపుతాం. అందులో భాగమవుతాం. ఆ ఉద్యమానికి నాయకత్వం వహిస్తాం. ఇందులో భాగమే వర్గీకరణ ఉద్యమమైనా, ప్రత్యేక ప్రజాస్వామిక తెలంగాణ ఉద్యమమైనా అని అర్థం చేసుకోవాలి. సార్వత్రిక పిలుపులిచ్చి ఇంట్లో కూర్చోవడం కాదు, దానికి నిర్దిష్ట కార్యాచరణ జోడించి ఆచరణలో అగ్రభాగాన నిలబడుతాం. అలాగే మొదట సమ్మెలో ఎవరూ పాల్గొనవద్దని, ఆ తర్వాత సమ్మె ప్రభావం లేదని నేడు ఎంతో నిర్బంధం సమ్మె మీద పెట్టినా, అది తిప్పి కొట్టిన కార్మికుల, తెలంగాణ ప్రజల చైతన్యానికి భయపడి సమ్మెను విరమించండి లేదా కొన్నింటికైనా మినహాయింపు ఇవ్వండి అని కోరుతున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి, మీ వైఖరికి ఎటువంటి తేడా ఉందో తెలంగాణ నాలుగు కోట్ల ప్రజలకు మీరు వివరించాలి.

అలాగే రష్యాలో విప్లవం విజయవంతం చేసేందుకు జరుగుతున్న మహత్తర పోరాటంలో 'మెన్షె వికులు' అడ్డుపడ్డారు. చైనా విముక్తి కొరకు ప్రజాయుద్ధం జరుగుతున్నప్పుడు 'చైనా యువజన పార్టీ' పేర 'కొమ్మింటాంగ్' ప్రభుత్వానికి మద్దతు పలికినట్లుగా మీరు కూడా ప్రవర్తించబోరని కోరుకుంటూ తెలంగాణ నాలుగు కోట్ల ప్రజల వైపు నిలబడుతారని ఆశిస్తున్నాను. ■

**– చిక్కుడు ప్రభాకర్**

న్యాయవాది




*సకల జనుల సమ్మెలో భాగంగా అమరుల స్థూపం దగ్గర టీ.టీ. జె.ఎ.సి. కొవ్వొత్తుల ప్రదర్శన. తేది : 31-9-2011.*

# పార్టీల వైఖరులు, నేతల లౌక్యాలు

*– జూకంటి జగన్నాథం*

ఎక్కడైనా, ఎప్పుడైనా అవినీతికి, అన్యాయాలకు, దోపిడీకి, అధర్మాలకు వ్యతిరేకంగా ఆయా బాధిత సమూహాలలో లేక సమాజాలలో సుదీర్ఘకాలంగా మసలి మసలి విస్ఫోటనం చెందే న్యాయబద్ధ పోరాటాలు అందులో భాగంగా వాటిని సఫలీకృతం చేసుకునే దిశలో సాగుతున్నదే తెలంగాణ ఆత్మగౌరవ ఉద్యమం. గత దశాబ్ద కాలం నుంచి ఆధిపత్య ప్రాంత సీమాంధ్ర పాలన పెత్తనం నుంచి స్వయం ప్రతిపత్తిని కోరుకుంటూ జరుగుతున్నదే ప్రత్యేక తెలంగాణ సాధన ఉద్యమ పోరాటం. ఈ పోరాట విత్తనాలు ముందుగా మేధావి వర్గాలలో మొలకెత్తాయి. పర్యవసానంగా ఆయా శక్తుల ప్రభావం, భావజాల ప్రచారం ప్రజలలో ముందెప్పుడూ లేనంత బలంగా వీచసాగింది. ఈ వీచికలను గమనించి ఈ ప్రాంతం రాజకీయ పార్టీలు, ఆయా పార్టీల నాయకులు తమ ఆటకు పాచికలను సిద్ధం చేసుకుంటూ రంగప్రవేశం చేశాయి. ఈ ఉద్యమ యవనిక మీదికి తెలంగాణ రాష్ట్ర సమితి సింహద్వారం గుండా ప్రవేశం చేసి రసవత్తరంగా ఒక్కొక్కసారి నాటకీయంగా ఊహించని మలుపులు తిప్పుతూ, తలుపులు తెరుస్తూ తనదైన శైలిలో విన్యాసాలను చేస్తూ కొనసాగుతుంది. ఉద్యమాన్ని భగ్గున మండకుండా చప్పున చల్లారిపోకుండా చూస్తూ తన మనుగడను కొనసాగిస్తోంది. కొంచెం ఆలస్యంగా మేల్కొన్న ఈ ప్రాంత మిగతా నాయకులు ఆధిపత్య ప్రాంత నాయకుల దయా దాక్షిణ్యాల విధేయతల సారథ్యంలో పనిచేస్తూ కింద పడ్డా మీద పడ్డా ప్రజల హృదయాలలో దిగజారి పోతున్నారు. సీమాంధ్ర ప్రాంత నాయకుల ముందు జారిపడి అడుగడుగునా నవ్వుల పాలవుతున్నారు. తెలంగాణ ప్రజలలో రోజురోజుకు చులకన పాలవుతున్నారు. దానా దీనా తెలంగాణ ఉద్యమం ఇటు రాష్ట్రంలోను అటు దేశంలోను ఒక తాజా విషయంగా ఎప్పటికప్పుడు నానుతూ వస్తున్నది. తెరాస అధినేత కెసిఆర్ ఆమరణ నిరాహారదీక్ష తర్వాత తెలంగాణ ప్రాంతం రాజకీయ ఆవరణలో వాడి వేడి పుట్టింది. ఈ నేపథ్యంలో తెలంగాణలో మూడు పార్టీలు తెరాస, తెదేపా, కాంగ్రెస్ పార్టీల వైఖరులు, ఆయా పార్టీలకు చెందిన నాయకుల గుణశీలాలను విశ్లేషణ పూర్వకంగా చూద్దాం.

నిస్సందేహంగా తెరాసనే పదే పదే చెప్పుకున్నట్టు తెలంగాణ కోసం పురుడు పోసుకున్నప్పటి నుంచి అది పనిచేస్తునే రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేస్తూ వస్తున్నది. ఆ పార్టీ నాయకుడు కెసిఆర్ మేధోమథనంలోంచే అనేకానేక ఎత్తుగడలు, పొత్తుగడలు, పద్మవ్యూహాలు పన్నబడతాయి. కాలానుసారంగా శత్రు మిత్ర పార్టీలను ఆ ఉచ్చులోకి లాగి ఊపిరి సల్పకుండా చేయడం కెసిఆర్‌కు ఉన్న ఏకైక చతురత. తానే పన్నిన పన్నాగం అత్రుతలో తానే చిక్కుకొని కొన్నిసార్లు గిలగిలా కొట్టుమిట్టాడిన సందర్భాలు ఉన్నాయి. ఆ చిక్కుముడులను తానే విప్పుకుని బలాన్ని, బలగాన్ని పుంజుకున్న స్థితిగతులూ ఉన్నాయి. అయితే ఈయన ఉద్యమశైలిని, క్యాలినీ గమనిస్తే అవి అన్నీ అధికార పార్టీ రాజకీయాలుగా ద్యోతకమవుతాయి. విచిత్రమేమిటంటే తెరాస తెలంగాణలో బలమైన ప్రతిపక్ష శక్తి. కానీ ఆ పార్టీ అధినేత నిరంతరం చేసే ఆలోచనలు అధికార పార్టీ వ్యూహరచనలే. దీని కారణంగా తెరాస తెలంగాణలో అత్యంత శక్తివంతమైన ఉద్యమ పార్టీగా అవతరించలేక అడుగడుగునా ఆపసోపాలు పడుతోంది. అందుకే ఈ పార్టీ తాను సృష్టించే అల్పపీడనాల నుంచే తర తమ బేధాలు లేకుండా వివిధ మార్గాల ద్వారా తన

సాధన సంపత్తిని, మందుగుండు సామాగ్రిని సేకరించుకొంటుంది. పార్టీని తనదైన రాజముద్రతో నడపాలని నాయకత్వం ప్రయత్నిస్తుంటుంది. ఈ పార్టీ బలము, బలహీనత కూడా అదే.

ఆశ్చర్యంగా ప్రారంభంలో ఉన్న నాయకులు చాలా మంది క్రమక్రమంగా తెరాస నుంచి కనుమరుగయ్యారు. వీరు తెలంగాణ వ్యతిరేకులా అంటే, మరి వీరంత కరుడుగట్టిన తెలంగాణ వాదులు ఇంకొకరు కనిపించరు. అంటే వీరు తెలంగాణ విధేయులే కానీ తెరాస విశ్వాసపాత్రులు మాత్రం కాదని అవగతం అవుతుంది. జలసౌధ పునాదుల నుంచే తెలంగాణ భవనం లేచిందనేది విజ్ఞులు ఎవరూ కాదనే చారిత్రక సత్యం. ఇది దురదృష్టవశాత్తు పూర్తిగా తెరాసకు మింగుడు పడని అజీర్ణ విషయం. తెరాస ప్రతిసారీ చిక్కకుండా శత్రు శిబిర రాజకీయ 'ఎర'ను మింగి తన గమ్యాన్ని లక్ష్యాన్ని చేరాలని ఒడుపుతనం చూపిస్తుంది. కానీ శత్రువు అత్యంత నేర్పరి తనంతో విసిరిన గాలానికి తరచుగా 'చిక్కి' శల్యమై జీవన్మరణ సమస్యను ఎదుర్కొంటున్నది.

తెరాస తాను నమ్ముకున్న రాజకీయ ప్రక్రియ అంత సులభమైన విషయం కాదని తెలిసినా, దాని చుట్టూ అల్లుకున్న పెట్టుబడి పుట్టుబడి మాయోపాయాల కాటు నుంచి తప్పించుకోలేక కొండొకచో అంతర్గతంగా తప్పించుకోలేక కుదేలు అవుతుంది. తెరాసను సకారాత్మక కోణంలో విశ్లేషిస్తే ఉవ్వెత్తున లేచిన 'అల' లా కనిపించినా, చెలియలి కట్టను దాటని కెరతాన్ని తలపిస్తుంది. కానీ సముద్రం కదలికలోనే జీవన చింతన ఇమిడివుంది అనేది ఎవరూ కాదనలేని సార్వ కాలీన వాస్తవం. ఇకపోతే, తెలంగాణలో తెలుగుదేశం పార్టీ, ఈ ప్రాంత నాయకులు ప్రజల ముందు ఎన్ని శిరసాసనాలు, సూర్య నమస్కారాలు చేసినా ఆ పార్టీని, ఆ పార్టీ అధినాయకత్వం గోడ మీది పిల్లి విధానాలను నమ్మలేదు. ఇది తెలంగాణ తెదేపా నాయకులకు తెలిసినా తెలియనట్టు నటిస్తున్నారు. ఏమి చేయలేమని ఎరిగినా ఏదో చేస్తున్నట్టు దొంగాట ఆడుతున్నారు. ఈ లౌక్యమే తెదేపాను, ఆ పార్టీ నాయకుల ఉనికిని త్వరలో ప్రశ్నార్థకం చేయడమే కాకుండా ఈ ప్రాంతంలో కూడా పార్టీ తెరమరుగు అయ్యే ప్రమాదం పొంచి ఉంది. తెలంగాణ తెదేపా నాయకులు మొండి ధైర్యం చేయనంత కాలం వీరి పరిస్థితి ఈ ప్రాంత ప్రజలలో 'ర్యాలకాయతిన్న నక్క' శాస్త్రం దుస్థితి కనిపిస్తుంది. ఇలాగే కొనసాగితే ముమ్మాటికీ తెదేపా తెలంగాణలో శాశ్వత రాజకీయ జీవిత ఖైదీ శిక్షను అనుభవించాల్సి వస్తుంది.

ముచ్చటగా మూడోది కాంగ్రెస్, ఆ పార్టీకి చెందిన నాయకుల పరిస్థితి 'పొయ్యేంత పొద్దు వుంది. ఉండు బావా' అన్నట్టు విషమంగా వుంది. అటు అధికార పార్టీ ఇటు ప్రజలలో బలమైన తెలంగాణ కాంక్ష ఈ రెంటిలో ఏ ఒక్కదాన్ని కాదనలేక కక్కలేక మింగలేక కడుపును చింపుకుంటే కాళ్ళమీద పడ్డట్టూ సంకట స్థితిలో వుంది. ఈ అసందిగ్ధతనే నాయకులను ఎటూ లేకుండా విషయం కొలిక్కి రాకుండా చేస్తుంది. సమస్య పరిష్కారం దిశగా కొనసాగకపోయే సరికి నాయకులకు కంటి మీద రెప్ప వాలకుండా చేస్తుంది. అందుకే వీరు తమ నియోజకవర్గాలలో కంటే హైదరాబాద్, ఢిల్లీలకే ఎక్కువగా పరిమితమవుతున్నారు.

అయినప్పటికీ తమ రాజకీయ భవిష్యత్ దృష్ట్యా బలమైన పార్టీకి, ప్రభుత్వాలకు వ్యతిరేకంగా తెలంగాణ రాష్ట్ర సాధన దిశగా తీవ్ర నిరసన గళాలను నాయకులు వినిపిస్తూనే ఉన్నారు. ఏ విషయానికి ఆ విషయమే చెప్పుకోవాలి. ఈ ప్రాంత శాసనసభ్యులు, మంత్రుల కన్నా, పోరాట పటిమ గరిమను పార్లమెంట్ సభ్యులు నిస్సందేహంగా కాపాడుతున్నారు. 2009 నుండి ఇది ఎన్నో సార్లు నిరూపించబడుతూనే వుంది. కాంగ్రెస్ పార్టీ ఈ ప్రాంత పార్లమెంట్ సభ్యుల మార్గదర్శకత్వంలో ఉద్యమాన్ని ఒక కొలిక్కి తీసుకురావలసిన ఆవశ్యకత ఉంది. లేకుంటే ఈ ప్రాంతంలో కాంగ్రెస్ మొదటి ముద్దాయిగా బోనులో నిలబడి శిలువ ఎక్కాల్సి వస్తుంది. తెలంగాణ ప్రాంతంలో ఈ మూడు రాజకీయ పార్టీల స్థితిగతులు ఇలా వుంటే పార్టీల నాయకులు తమ తమ నాయకత్వాలను ప్రసన్నం చేసుకునేందుకు నమ్మశక్యం కానంతగా లౌక్యాలను ప్రదర్శిస్తుంటారు. ప్రజల చుట్టూ కాక నాయకుల నాయకత్వాల చుట్టూ ప్రదర్శన చేస్తూ అడుగడుగునా విధేయతను ప్రకటిస్తుంటారు. ప్రభుత్వంలో కాని పార్టీలలో కాని సీమాంధ్ర నాయకులదే పైచేయి అనేది జగమెరిగిన నిజం. కాబట్టి తెలంగాణ ప్రాంతంలోని కాంగ్రెస్, తెదేపా

పార్టీల నాయకులు ఎంత మొత్తుకున్నా 'గుట్టకు మొరిగిన కుక్కలా' వుంది. తెలంగాణలోని అన్ని రాజకీయ పార్టీలు, నాయకుల పరిస్థితి 'పెట్టుబడి చెట్టుకు తాడుతో కట్టేసి, పరిమితంగా మేతకు వదిలిన గుర్రం'లా అనిపిస్తుంది. అయితే, పార్టీలు నాయకులు పరిమితమైన తాత్కాలిక ప్రయోజనాలను ఆశించినంత కాలం తెలంగాణ సాధన అసాధ్యమని గుర్తించి తమ తమ పార్టీల ఉక్కు చట్రాల నుంచి బయటపడాలి. లౌక్యాలను వదిలి బహిరంగంగా అజేయమైన ప్రజల తరపున నడుచుకుంటేనే ఓట్ల పుట్టగతులుంటాయి. లేకపోతే తెలంగాణ ఉద్యమ కాలగర్భంలో నిర్ధాక్షిణ్యంగా కలిసిపోతారు.

ఇకనైనా తెలంగాణ కాంక్షించే పార్టీలు, నాయకులు ఆధిపత్య ప్రాంతాల ఆర్థిక మద్దతు మీద ఆధారపడి ఉద్యమాలు చేయడం మానుకోవాలి. లేదంటే ఎక్కడ వేసిన గొంగళి అక్కడ వేసినట్టే వుంటుంది. పార్టీలు, నాయకులు ఎంత తొందరగా మేల్కొని కళ్లు తెరిస్తే అంత మంచిది. స్వచ్ఛంద స్వయం సమృద్ధి రాజకీయ నిధిని ఏర్పాటు చేసుకోగలగిన నాడే తెలంగాణ అసలు రేషం వేషం శివమెత్తుతాయి. తెలంగాణ ఓట్ల పరుగు పందెంలో పార్టీలు నాయకులు పోటీ పడినంత కాలం తెలంగాణ ఉద్యమం కళ్ల ముందు కాటగలిసి పోతూనే ఉంటుంది. మసకబారి పోయే అవకాశాలు మిక్కిలిగా కలవు. ■

**– జూకంటి జగన్నాథం**

అధ్యక్షులు తెలంగాణ రచయితల వేదిక

13-09-11, ఆంధ్రజ్యోతి



*రైల్ రోకో నిర్వహిస్తున్న సకలజనులు*

# కుట్రలను ఛేదిస్తాం....
# ఉద్యమంలో ముందుంటాం.....

శాసన సభ స్పీకర్ నాదెండ్ల మనోహర్ తన ప్రాంతీయ దురభిమానాన్ని, తెలంగాణ పట్ల తన వివక్షతను మరోసారి చాటుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో ఎక్కువగా మాదిగలు, అందరూ 30 ఏళ్ళ పైబడినవారున్నారని, వారంతా మావోయిస్టుల కనుసన్నల్లో ఉద్యమాన్ని నడుపుతున్నారని ఆయన అన్నట్టు వికీలీక్స్ ద్వారా వెలుగులోకి వచ్చింది. అయితే దీని వెనుక పెద్ద కుట్ర దాగి ఉంది. తెలంగాణ ఉద్యమంలో మొదటినుంచీ క్రియాశిలకంగా పాల్గొంటున్న మాదిగ విద్యార్థి లోకాన్ని భయభ్రాంతులకు గురి చేయాలనుకుంటున్నారు. అలాగే.... రాబొయే కాలంలో ఉవ్వెత్తున లేస్తున్న ఉద్యమంపై నిర్బంధాన్ని ప్రయోగించడానికి భూమికను తయారు చేస్తున్నారు. తన రహస్య ప్రణాళిక 'అమెరికన్ కాన్సులేట్‌కు చెబితే.. ఎవరికి తెలుస్తుందిలే' అనే కుబుద్ధితో మనోహర్‌గారు భావించి ఊంటారు. అదికాస్తా వెలుగు చూడటంతో... నాలుక కర్చుకొని తాను అలా అనలేదని తప్పించుకోజూస్తున్నారు.

ఆదినుంచీ ... తెలంగాణ గడ్డమీద మాదిగలు అన్ని పోరాటాల్లో అగ్రభాగాన ఉన్నారు. చరిత్ర పుటలు తిరగేసినా ఇదే తెలుస్తుంది. నాటి తెలంగాణ సాయుధ పోరాట కాలం నుంచీ .. నేటిదాకా సమాజంలోని అట్టడుగున దోపిడీ పీడనలకు గురవుతున్నది దళితులే. వారే సామాజిక మార్పుకోసం నిరంతరం తపిస్తుంటారు. సమాజంలో జరిగే సంఘర్షణలో భాగస్వాములవుతారు. దొడ్డి కొమురయ్య కాలం నుంచి... నేటి మహబూబ్‌నగర్ జిల్లా నాగరాజు మాదిగ దాకా... ఎందరో మాదిగలు ఈ సమాజ మార్పుకోసం జరుగుతున్న పోరాటంలో భాగస్వాములయ్యారు. అమరులయ్యారు.

మలి దశ తెలంగాణ ఉద్యమం ప్రారంభమైనప్పటి నుంచి కూడా మాదిగలే తెలంగాణ ఉద్యమంలో అగ్రభాగాన ఉన్నారు. ఉస్మానియా, కాకతీయ, తెలంగాణ యూనివర్సిటీల్లో విద్యార్థి జేఏసీ నాయకులుగా ఉన్నది మాదిగ విద్యార్థులే. సామాజిక మార్పుకు అత్యవసరమైన వర్గంగా, తెలంగాణ ఉద్యమాన్ని సహజంగానే గుండెకు హత్తుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనకోసం పోరాడుతున్నారు. ఈక్రమంలో ఎన్నో నిర్బంధాలను చవిచూస్తున్నారు. ఒక్కొక్కరిపై వందల కేసులు బనాయించి జైళ్ళలో పెట్టారు. విద్యార్థి ఉద్యమంలో అగ్రభాగాన నిలుస్తున్న 20మందివిద్యార్థి నాయకుల్లో 15మంది మాదిగ విద్యార్థులే. అలాగే మలిదశ ఉద్యమంలో అరెస్టు అయిన మొదటి విద్యార్థి కూడా మాదిగనే. అలాగే 2009 డిసెంబర్ 6న అరెస్టయి జైలుకెళ్ళిన విద్యార్థులు ఏడుగురిలో ఐదుగురు మాదిగ విద్యార్థులే. ఇప్పటిదాక ఎక్కువ కాలం జైలు నిర్బంధంలో ఉన్నవారు కూడా మాదిగ విద్యార్థి నేతలే. అయినా విద్యార్థులు వెనకడుగు వేయకుండా పోరాడుతూనే ఉన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడేదాకా పోరు ఆపేదిలేదని మడమ తిప్పకుండా పోరాటంలో ముందంజలో ఉన్నారు. త్యాగాలకు వెరువక ముందుకు కదులుతున్నారు.

ఇదంతా ఒక ఎత్తు అయితే.. తెలంగాణ ఉద్యమానికి జవ, జీవం ఇస్తున్నది మాదిగ కవులు, కళాకారులే. తెలంగాణ జాతీయ గీతం రాసిన అందెశ్రీ, గోరటి వెంకన్న మొదలు నేర్నాల కిశోర్ దాకా ఎందరో కవులు, రచయితలు తమ కలంతో, గళంతో...తెలంగాణ ఉద్యమానికి వన్నె తెస్తున్నారు. అలాగే తెలంగాణ ఉద్యమంలో ప్రజాసంఘాల పాత్ర మరువలేనిది. ప్రజల పక్షాన నిలబడి కష్ట నష్టాలకోర్చి పోరాడుతున్న గజ్జెల కాంతం మొదలు విశారదన్, బొంగు రమేష్ తదితరులు ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. విద్యార్థులు, ప్రజాసంఘాలకు తోడు మేధావులు,

రాజకీయ నేతలు తమ వంతు పాత్రను పోషిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎవరు అవునన్నా, కాదన్నా మాదిగలు తెలంగాణ ఉద్యమంలో అగ్రభాగాన ఉన్నారు. అణగారిన వర్గంగా తెలంగాణ కోరుకునేవారిలో మాదిగలే ఎక్కువ సమఖ్యలో ఉంటారు. ఉన్నారు. ముందుండి పోరాడుతున్నారు. ఇకముందు కూడా ఎన్ని అవరోధాలు వచ్చినా, ఎన్ని త్యాగాలకోర్చి అయినా పోరాడుతారు. ఇప్పుడు స్పీకర్ కొత్తగా చెప్పాల్సింది ఏమీ లేదు. కాకుంటే.. ఆయన సీమాంధ్ర పక్షపాత బుద్ధితో తెలంగాణ ఉద్యమాన్ని అణచివేయాలనే కుట్రలో భాగంగా లేని నిందలు మోపుతున్నారు. పీడిత తాడిత వర్గాల కోసం పోరాడుతున్న మావోయిస్టులంటే .. మాదిగలకు గౌరవం ఉంటే ఉండొచ్చు, ఆయన ఆరోపించినట్లు విద్యార్థి నాయకుల్లో మావోయిస్టులు ఎవరూ లేరు. తెలంగాణ ఉద్యమానికి సారధ్యం వహిస్తున్న వారంతా ఆయా యూనివర్సిటీలలో చదువుతూ ..., రీసెర్చ్ స్కాలర్లుగా ఉన్నవారే. ఇలాంటి కుట్రలు, కుహకాలతో.. తెలమగాణ ఉద్యమాన్ని ఆపలేరు. నిత్య నిర్భంధంలో సైతం నిప్పులై మండుతాం. సీమాంధ్ర వలసవాదుల పాలనకు చరమగీతం పాడుతాం. తెలంగాణ సాధించుకుంటాం. ■

***– పిడమర్తి రవి, టీఎస్ జేఏసీ ఛైర్మన్***
***అద్దూరి శ్రీనివాస్, తెలంగాణ మాదిగ దండోరా రాష్ట్ర కన్వీనర్***
***బండారు వీరబాబు, బీఎస్ఎఫ్ రాష్ట్ర కో ఆర్డినేటర్,***
***దామెర రాజేందర్, తెలంగాణ మాదిగ విద్యార్థి సమఘం కన్వీనర్***
***పెద్దకొల్ల సంజీవ్ కుమార, తెలంగాణ మాదిగ యూత్ ఫెడరేషన్ కో ఆర్డినేటర్***

04.09.2011, నమస్తే తెలంగాణ




*సకల జనుల సమ్మె సందర్భంగా ఢిల్లీలోని రాజ్‌ఘట్‌లో మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా శ్రద్ధాంజలి ఘటించి, మౌనదీక్ష చేస్తున్న జె.ఎ.సి. నాయకులు. తేదీ : 02-10-2011.*

# పోరుబాటలో మైలురాయి 'సమ్మె'

**– కావటి వెంకట్ యాదవ్**

"వీర తెలంగాణ పోరుగడ్డపై పురుడు పోసుకున్న తెలంగాణ రాష్ట్ర సమితి అనేక ఆటుపోటులు చవిచూస్తూనే ఒడిఒడిగా అడుగులు వేస్తూ పదకొండేళ్ళ ప్రాయపు మైలురాయికి చేరింది. ప్రత్యేక రాష్ట్ర సాధనే ఏకైక లక్ష్యంగా మడమ తిప్పని ఉద్యమమే మూలధనంగా ముందుకు సాగుతూ రాష్ట్ర రాజకీయ చిత్రపటాన్నే సమూలంగా మార్చివేసి కాకలు తీరిన రాజకీయ యోధులకే ముచ్చెమటలు పట్టిస్తున్న టిఆర్ఎస్ చూస్తుండగానే దశాబ్ద కాలపు సమున్నత ఉద్యమ చరిత్రను సముపార్జించుకుంది. జాతీయ, ఆ మాటకొస్తే అంతర్జాతీయ స్థాయిలోనే గాంధేయ మార్గంలో సాగుతున్న మహత్తర విముక్తి పోరాటానికి ఈనెల 13న ప్రారంభమైన సకల జనుల సమ్మె వేదికగా నిలిచింది. ఈనెల 27వ తేదీ నాటికి పదేళ్ళు పూర్తయి పదకొండో వడిలోకి అడుగు పెట్టనుంది. ఆకుంఠిత దీక్షతో ఢిల్లీనే జయించినంత సంచలనం సృష్టించిన ఆయనను ఉక్కుమనిషిగా నిలిపిన తెలంగాణ రాష్ట్ర సమితి పదకొండేళ్ళ ప్రస్థానాన్ని, సకల జనుల సమ్మెను ఈ సందర్భంగా అవలోకనం చేసుకుంటే"........

## తెలంగాణ రాష్ట్రమే ధ్యేయం

ఆయన పేరు కల్వకుంట్ల చంద్రశేఖరరావు. 2000 సంవత్సరం నాటికే ఆయ మంచి పేరున్న నాయకుడు. మెదక్ జిల్లా సిద్ధిపేట స్థానం నుంచి ఎమ్మెల్యేగా అప్రతిహత విజయాలు సాధిస్తునే అమాత్యుడిగాను వెలుగొందిన చంద్రశేఖర్‌రావులో ఏదో తెలియని అసంతృప్తి. అప్పటికే తెలంగాణ ప్రాంతం మళ్ళీ వివక్షత విషవలయంలో చిక్కుకుంటోందన్న బాధ. తెలుగుదేశం వేదికగా తెలంగాణకు సరైన రీతిలో న్యాయం చేయలేకపోతున్నానన్న అచేతనం. ఇవే ఆయనలో గుణాత్మక మార్పుకు బీజాలు వేశాయి. అప్పటికే అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ హోదాలో ఉన్నప్పటికీ సవతి తల్లి ప్రేమకు గురవుతున్న సొంతగడ్డపై ఉన్న మమకారం ఆయన ఆలోచనా విధానాన్నే మార్చివేసింది. అంతే తెలుగుదేశం పార్టీపై తిరుగబాటు బావుటా ఎగురేశారు. ఒక్క కలంపోటుతో డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే పదవులను గడ్డిపోచలా త్యజించారు. ప్రజాస్వామ్యబద్ధంగా మరో చారిత్రక పోరాటానికి తెరలేపి మరుగునపడి పోయిందనుకున్న ఆరు దశాబ్దాల తెలంగాణ స్వరాష్ట్ర స్వప్నానికి మళ్ళీ ఊపిరి పోశారు. తెలంగాణ రాష్ట్ర సాధనే తన లక్ష్యమంటూ అందుకోసమే తన పోరాటమంటూ వెలుగెత్తి చాటిన కెసిఆర్ తెలంగాణ పది జిల్లాల ప్రజల మనసును దోచుకున్నారు. స్వరాష్ట్ర సాధనకై మహాపోరాటానికి అంకురార్పణ చేస్తూ 2001 ఏప్రిల్ 27న 'తెలంగాణ రాష్ట్ర సమితి' అనే ఉద్యమ సంస్థకు కెసిఆర్ ప్రాణం పోశారు. 'జయ, జయహో తెలంగాణ' అంటూ గులాబీ జెండాను భుజానికెత్తుకొని ఊరూరు, వాడవాడ తిరిగిన కెసిఆర్‌కు తెలంగాణ ప్రజలు నీరాజనాలు పట్టారు. పోరాడు బిడ్డా, నీవెంట మేమున్నామంటూ తెలంగాణ పల్లెలు ఆశీర్వదించాయి. టిఆర్ఎస్ పురుడు పోసుకున్న మూడు మాసాలకే వచ్చిన స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలంగాణలో టిఆర్ఎస్ సాధించిన అనూహ్య విజయాలు ప్రజల మద్దతుకు అద్దం పట్టాయి. అప్పటివరకూ పదవి రాలేదన్న అక్కసుతోనే కెసిఆర్ ప్రత్యేక తెలంగాణ అంటున్నారని ఆడిపోసుకున్న నోళ్ళన్నీ ఆ ఫలితాలతో మూతపడ్డాయి. టిఆర్ఎస్ వేదిక ద్వారానే సిద్ధిపేట నుంచి తిరిగి ఎమ్మెల్యేగా

భారీ మెజారిటీతో గెలిచిన కెసిఆర్ 2004లో జరిగిన శాసనసభ ఎన్నికల నాటికి రాష్ట్ర రాజకీయాలనే శాసించే స్థాయికి చేరారు. హైటెక్ హంగులతో అపర చాణుక్య ముఖ్యమంత్రిగా వెలుగొందుతున్న తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు ఓవైపు, ఎలాగైనా ఒక్కసారి రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలన్న ఆకాంక్షతో రగిలిపోతూ విపక్షనేతగా తొడలు చరుస్తూ కాంగ్రెస్‌ను విజయతీరాలకు తీసుకెళ్ళాలని ఉవ్విళ్లూరుతున్న డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరో వైపు. అయినా ఈ ఇరువురు ఉద్దండుల నడుమ ఒకే ఒక్కడుగా నిలిచిన కెసిఆర్ 2004 ఎన్నికల్లో అత్యంత ప్రాధాన్యత గల నేతగా వెలుగొందారు. తెలంగాణ రాష్ట్రం ఇస్తానంటేనే తన మద్దతు అని తెగేసి చెప్పిన కెసిఆర్‌ను మచ్చిక చేసేందుకు కాంగ్రెస్ ఆ వాగ్దానం కూడా చేసింది. అధికారంలోకి రాగానే తెలంగాణ ప్రజల మనసులో ఉన్న ఆకాంక్షను తీరుస్తామని సోనియా గాంధీయే స్వయంగా చెప్పడంతో జతకట్టడానికి కెసిఆర్ సరేనన్నారు. ఇంకేముంది, ఆ ఎన్నికల్లో కాంగ్రెస్–టిఆర్ఎస్ కూటమి అపూర్వ విజయాన్ని చేజిక్కించుకొని తొమ్మిదేళ్ళ చంద్రబాబు పాలనకు తెరవేసింది. తెలంగాణ అంశాన్ని మేనిఫెస్టోలో పెట్టడమే కాక యుపిఎ కామన్ మినిమం ప్రోగ్రాంలో, రాష్ట్రపతి ప్రసంగంలో చేర్చడంతో కాంగ్రెస్‌పై మరింత నమ్మకం పెంచుకున్న టిఆర్ఎస్ కేంద్ర, రాష్ట్ర మంత్రివర్గాల్లో చేరింది. కెసిఆర్‌తో పాటు ఆలె నరేంద్ర కేంద్రంలో మంత్రులయ్యారు.

## అసలు విషయం మరుగున పడింది

కాగా క్రమేపి కాంగ్రెస్ ధోరణిలో మార్పు గోచరించింది. ప్రణబ్‌ముఖర్జీ కమిటీ అంటూ, రెండో ఎస్సార్సీ అంటూ పాత పల్లవినెత్తుకుంది. దీంతో మండిపడ్డ టిఆర్ఎస్ అటు కేంద్ర, ఇటు రాష్ట్ర మంత్రివర్గాల నుంచి వైదొలిగింది. ఆ సమయంలో కాంగ్రెస్, టిఆర్ఎస్ నేతల మధ్య మాటల యుద్ధం కూడా తారాస్థాయికి చేరింది. కొందరు టిఆర్ఎస్ ఎమ్మెల్యేలకు వల విసిరిన కాంగ్రెస్ వారిని అక్కున చేర్చుకొని టిఆర్ఎస్ ఉనికికే సవాల్ చేసింది. కెసిఆర్‌పై ముప్పేట దాడి జరిగింది. అసలు తెలంగాణవాదమే లేదంటూ కొందరు కాంగ్రెస్ నేతలు ఎద్దేవా చేయడంతో కెసిఆర్ ఎంపి పదవికి రాజీనామా చేసి ఉప ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలవడం ద్వారా వారి నోటికి తాళం వేశారు. ఆ తరువాత తెలంగాణ రాష్ట్రం ఇవ్వనందుకు నిరసనగా మిగిలిన టిఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా రాజీనామాలు చేసి ఉప ఎన్నికలకు సిద్ధమయ్యారు. అయితే అప్పటి రాజకీయ పరిస్థితుల్లో మిశ్రమ ఫలితాలతో టిఆర్ఎస్ గడ్డుస్థితిని ఎదుర్కొంది. ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ చర్యలతో టిఆర్ఎస్ మరింత కష్ట కాలాన్ని చవిచూసింది. ఇక కాంగ్రెస్ తెలంగాణ ఇవ్వదని, ఢిల్లీ పెద్దలు ఒప్పుకున్నా వైఎస్ అడ్డు పడుతున్నారని ఆరోపించిన టిఆర్ఎస్ ఆ తరువాత వివిధ రకాల ఉద్యమాలతో అయిదేళ్ళు నెట్టుకొచ్చింది. 2009 ఎన్నికల నాటికి కథ మళ్ళీ మొదటికొచ్చింది. కాంగ్రెస్‌పై గుర్రుగా ఉన్న టిఆర్ఎస్ చూపు తెలుగుదేశం పార్టీపై పడింది. కాంగ్రెస్‌ను దెబ్బ కొట్టాలన్న లక్ష్యంతో టిడిపి కూడా ఓ మెట్టు దిగి తన సమైక్యాంధ్ర వాదాన్ని సడలించుకొని తెలంగాణకు జై కొట్టింది. టిఆర్ఎస్‌తో పొత్తుకు చేయి చాచింది. కాంగ్రెస్‌పై కోపంతో ఉన్న టిఆర్ఎస్ తెలంగాణకు సై అన్న టిడిపితో జత కట్టడానికి సిద్ధ పడింది. మహాకూటమి పేరుతో ఎన్నికల బరిలోకి దిగారు. అయితే ప్రజలు మహాకూటమి అంచనాలను తారుమారు చేస్తూ తిరిగి కాంగ్రెస్‌కే పట్టం కట్టారు. తెలంగాణ ప్రాంతంలో దాదాపు 50 సీట్లలో పోటీచేసి పట్టుమని పది కూడా గెలవని టిఆర్ఎస్ ఘోరంగా దెబ్బతిన్నది. ఇక టిఆర్ఎస్ పని ఖాళీ అని అంతా భావించారు. అయితే 2009 సెప్టెంబరులో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో మృతిచెంది రాష్ట్ర రాజకీయం ఒక్కసారి అనిశ్చిత స్థితికి చేరింది. అధికార పక్షంలో అలుముకున్న ముఠా కుమ్ములాటలతో అంతా గందరగోళంగా మారింది. అప్పటికే సకల సమస్యలతో సతమతమవుతున్న ముఖ్యమంత్రి రోశయ్యకు కెసిఆర్ రూపంలో పెను సవాల్ ఎదురైంది. ఎన్నికల పరాజయం నుంచి త్వరగానే కోలుకున్న కెసిఆర్ ఒక్క ఉదుటున విరుచుకుపడ్డారు. హైదరాబాద్ ఫ్రీజోన్ అంశం తెరపైకి వచ్చిన నేపథ్యంలో తెలంగాణ ఇస్తారా? ఛస్తారా? అని సింహగర్జన చేస్తూ 2009 నవంబరు 28న ఆమరణ నిరాహారదీక్షకు పూనుకున్నారు. దీక్ష చేపట్టక ముందే

ప్రభుత్వం ఆయనను అరెస్టు చేయించి ఖమ్మం జిల్లాకు తరలించింది. ప్రభుత్వ తీరుపై యావత్ తెలంగాణ భగ్గుమంది. ఆందోళనలతో అట్టుడికింది. ఖమ్మం ఆసుపత్రిలోనే కెసిఆర్ దీక్ష సాగించారు. వందలాది మంది తెలంగాణ బిడ్డలు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ప్రజల వత్తిడి మేరకు ఖమ్మం నుంచి హైదరాబాద్ నిమ్స్‌కు తరలించినప్పటికీ కెసిఆర్ దీక్ష వీడలేదు. ఆయన ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుండటంతో తెలంగాణ ఉద్రిక్తతలతో అగ్గిలా మారింది. రాష్ట్ర ప్రభుత్వం అదనపు బలగాలను దింపినా ప్రయోజనం లేకపోయింది. ఈ పరిణామాలన్నీ కేంద్రాన్ని కలవర పర్చాయి. వెంటనే రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి అఖిల పక్షం ఏర్పాటు చేయడం ద్వారా అన్ని పక్షాల అభిప్రాయం తెలుసుకోమని కేంద్రం కోరింది. అఖిలపక్ష సమావేశం జరిగింది. అన్ని పార్టీలు దాదాపు ఓకే అన్నాయి. అంతే 2009 డిసెంబరు 9న కేంద్ర హోంశాఖ మంత్రి చిదంబరం తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు ప్రక్రియ ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు.

## మళ్ళీ కథ మొదటికొచ్చింది

చిరకాల వాంఛ నేరవేరబోతోందని నాలుగు కోట్ల మంది ప్రజల హృదయాలు ఉప్పొంగాయి. కానీ ఈ ఆనందం కొన్ని గంటలు కూడా నిలువలేదు. సీమాంధ్ర అంతటా చిదంబరం ప్రకటనపై ఆగ్రహజ్వాలలు పెల్లుబికాయి. ప్రజాప్రతినిధులంతా రాజీనామాలు చేశారు. అఖిల పక్షంలో తెలంగాణకు సై అన్న ప్రధాన పార్టీలన్నీ మాట మార్చాయి. దీంతో కేంద్రం వెనక్కి తగ్గి కథ మళ్ళీ మొదటికొచ్చింది. ఈసారి తెలంగాణ భగ్గుమంది. ఆందోళనలతో అట్టుడికింది. ఈ ఆందోళనల్లో టిఆర్ఎస్‌దే ప్రముఖ పాత్ర. జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటైంది. బంద్‌లు, ఆందోళనలతో అట్టుడికింది. ఈ ఆందోళనల్లో టిఆర్ఎస్‌దే ప్రముఖ పాత్ర. జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటైంది. బంద్‌లు, ఆందోళనలతో తెలంగాణ దద్దరిల్లింది. విద్యార్థులు నిప్పులు చెరిగారు. టిఆర్ఎస్‌తో సహా పలు పార్టీల తెలంగాణ ఎమ్మెల్యేలు రాజీనామాలు చేశారు. దీంతో కేంద్రం శ్రీకృష్ణ కమిటీని వేసి ఉద్రిక్తతలు చల్లార్చే యత్నం చేసింది. మళ్ళీ ఏడాది గడిచింది. ఉప ఎన్నికల్లో తెలంగాణ వాదం గెలిచింది. ప్రధాన పార్టీలన్నీ మట్టి కర్చాయి. టిఆర్ఎస్ ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు జరిగాయి. జెఎసితో కలిసి పనిచేస్తునే టిఆర్ఎస్ సొంతంగా పోరాటాలు చేసింది. ఈ క్రమంలో వచ్చిన శ్రీకృష్ణకమిటి నివేదిక కూడా తెలంగాణకు వ్యతిరేకంగా వచ్చింది. మళ్ళీ ఆందోళనలు చుట్టుముట్టాయి. ఇంకా సాగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే టిఆర్ఎస్ పదకొండేళ్ళ మైలురాయిని దాటింది.

ఈ నేపథ్యంలో తెలంగాణ రాజకీయ జెఎసితో కలిసి టిఆర్ఎస్ ఈనెల 13న ప్రారంభించిన సకల జనుల సమ్మె పరాకాష్టకు చేరుకుంటోంది. తెలంగాణలోని పది జిల్లాల్లో సమస్త ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, కర్షకులు, సమస్త వృత్తుల వారు ఈ సమ్మె చేస్తున్నారు. ప్రభుత్వ పాలన స్తంభించి పోయింది. తెలంగాణ రాష్ట్ర సాధనే ఏకైక లక్ష్యంగా సాగుతున్న సకల జనుల సమ్మె సెగ కేంద్రానికి తగలకుండా రాష్ట్ర పాలకులు చేస్తున్న కుట్రలను తెలంగాణ కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు పటాపంచలు చేయాల్సిన తరుణం ఆసన్నమైంది. తెలంగాణ తెచ్చేదాకా..... తెగించి కొట్లాడుదూ.... అంటూ యావత్తు తెలంగాణ ప్రజలు కొదమ సింహాల్లా గర్జిస్తుంటే ఢిల్లీ పాలకుల గుండెలు అదిరిపోయి.... నిజాం నవాబులా సీమాంధ్ర నుంచి తెలంగాణకు విముక్తి కల్పించే రోజు త్వరలో రావాలని ఆశిద్దాం. ■

***– కావటి వెంకట్ యాదవ్***

25-09-11, వార్త

# మా ఆకాంక్షపై మాదే తీర్పు...

తెలంగాణ అంశం మీద బీజేపీ ప్రతిపాదించిన సావధాన తీర్మాణం ఈ నెల 5వ తేదీన లోక్‌సభలో చర్చకు వచ్చింది. దాదాపు రెండేళ్ళ తర్వాత మళ్ళీ తెలంగాణ అంశం లోక్‌సభలో చర్చకు రావడం హర్షణీయం. బీజేపీ లోక్‌సభ ప్రతిపక్ష నేత సుష్మాస్వరాజ్ చర్చను ప్రారంభించి, ' తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు బిల్లు ప్రవేశపెట్టండి, మద్దతు ఇవ్వడానికి మేము సిద్ధంగా ఉన్నాం' అని ప్రతిపాదన చేశారు. కానీ దానికి చిదంబరం నుంచి స్పష్టమైన సమాధానం రాలేదు. ఎప్పటిలాగే చిదంబరం' ఒకడుగు ముందుకు నాలుగు అడుగులు వెనక్కి' అన్నట్టుగా సమాధానమిస్తూ 'తెలంగాణ అంశాన్ని తెలుగువాళ్ళే తేల్చుకోవాలి' అని ప్రకటించి చేతులు దులుపుకున్నారు. ప్రతిపక్ష, స్వపక్ష సభ్యుల ప్రసంగాల తర్వాత చర్చకు సమాధానమిస్తూ పేర్కొన్న చాలా అంశాలు ఆక్షేపణీయమైనవి. వారు తమ ప్రసంగంలో చేసిన ఈ అంశాలను ఒకసారి పరిశీలించాలి.

చిదంబరం తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుపై తమ పార్టీయే (కాంగ్రెస్) ఇంకా ఒక నిర్ణయం తీసుకోలేదంటున్నారు. 2004 ఎన్నికలప్పుడు టీఆర్ఎస్‌తో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఒప్పందం చేసుకున్నప్పుడు కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల మేనిఫెస్టోలో తెలంగాణ అంశం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించింది. అంతే కాకుండా కరీంనగర్‌లో జరిగిన ఒక సభలో సాక్షాత్తూ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలైన సోనియాగాంధీ 'తెలంగాణ ప్రజల మనోభావాలు తనకు తెలుసునని, వారి భావోద్వేగాలను గౌరవిస్తానని, అధికారంలోకి వస్తే, మీ ఆకాంక్షలను సఫలం చేయడానికి అన్ని ప్రయత్నాలు చేస్తామని వాగ్దానం చేసింది. ఆ ఎన్నికల తర్వాత కేంద్రంలో అధికారం చేపట్టిన యూపీఏ సర్కార్ తమ కనీస ఉమ్మడి కార్యక్రమంలో 'అవసరమగు సంప్రదింపుల ద్వారా విస్తృత అంగీకారాన్ని కుదిర్చి సరైన సమయంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అంశాన్ని చేపడుతుంది' అని ప్రకటించింది. ఆ తర్వాత రాష్ట్రపతి పార్లమెంటు ఉభయ సభలనుద్దేశంచి చేసిన ప్రసంగంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు యూపీఏ సర్కార్ తమ కనీస ఉమ్మడి కార్యక్రమంలో పేర్కొన్నదానికి కట్టుబడి ఉన్నట్లు ప్రకటించారు. ఇదే విషయాన్ని ప్రధాని మన్మోహన్ తన మొదటి 'ప్రెస్ కాన్ఫరెన్స్'లో పునరుద్ఘాటించారు. దానిలో భాగంగానే ప్రణబ్ ముఖర్జీ నేతృత్వంలో ఒక కమిటీని వేశారు. మళ్ళీ ఇప్పుడు 'తెలంగాణ అంశంపై కాంగ్రెస్ పార్టీ ఇంకా ఓ నిర్ణయం తీసుకోలేదు' అంటున్నారు. చిదంబరం. ఏ నిర్ణయం తీసుకోకుండానే కాంగ్రెస్ పార్టీ గతంలో ఆ ప్రకటనలన్నీ చేసింది అంటే క్షమించరాని మోసం.

'తెలంగాణ అంశంపై తెలుగువాళ్ళే' తేల్చాలి అంటున్నారు చిదంబరం. ఆయన భాషలో తెలుగువాళ్ళు అంటే మొత్తం ఆంధ్ర, తెలంగాణ, రాయలసీమ ప్రజలు. తెలంగాణ అంశాన్ని తేల్చాల్సింది తెలంగాణ ప్రజలు. ఆంధ్ర, రాయలసీమ ప్రజలు కాదు. రాష్ట్రం సమైక్యంగా ఉండాలంటే రాష్ట్రంలోని మూడు ప్రాంతాల ప్రజల మధ్య 'మనందరిదీ ఒకే భాష, ఒకే సంస్కృతి, ఒకే చరిత్ర కాబట్టి మనం అంతా ఒక్కటే' అనే భావం నెలకొని ఉండాలి. అప్పుడే అది సమైక్యంగా మనుగడ సాధించగలదు. 'మనమంతా ఒక్కటే' అనే భావన ఆ ప్రజల్లో లేనప్పుడు దాన్ని సమైక్యంగా ఉంచలేమన్నది చారిత్రక సత్యం.

1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పుడు ఆంధ్ర, రాయలసీమ ప్రజల మనో భావాలనే పరిగణనలోకి తీసుకున్నరు. కానీ మద్రాసు ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకోలేదు. ఒకవేళ మద్రాసు ప్రజల మనోభావాలను

పరిగణనలోకి తీసుకుని ఉంటే ఆంధ్ర రాష్ట్రం ఆనాడు ఏర్పడి ఉండేది కాదు. అంతే కాదు ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుకు సంబంధించి తీర్మానాన్ని ఉమ్మడి మద్రాసు రాష్ట్ర శాసనసభలో ప్రవేశపెట్టలేదు. తీర్మానం ప్రవేశపెడితే అది వీగిపోతుందని ముందే గ్రహించి దాన్ని లోక్‌సభలో ప్రవేశపెట్టిండ్రు. కానీ దీనికి భిన్నంగా తెలంగాణను కోస్తాంధ్రతో కలిపి విశాలాంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటుపై జరిగిన చర్చలో ఏకాభిప్రాయం రాలేదు. 29 మంది తెలంగాణ శాసన సభ్యులు తెలంగాణ ప్రాంతాన్ని ప్రత్యేక రాష్ట్రంగానే ఉంచాలని, కోస్తాంధ్ర ప్రాంతాలతో కలిపి విశాలాంధ్ర ఏర్పాటుకు పూనుకోవద్దని డిమాండ్ చేశారు. 101 మంది తెలంగాణ శాసనసభ్యుల్లో 15 మంది అసలు ఓటింగ్‌లోనే పాల్గొనలేదు. విశాలాంధ్ర ఏర్పాటుకు ఏకాభిప్రాయం ఎక్కడ వచ్చింది? అందుకే తెలంగాణ అంశంపై తెలుగువాళ్ళే తేల్చుకోవాలంటే ఏకాభిప్రాయం ఉండాల్సింది తెలంగాణ ప్రజల్లోనే కానీ కోస్తాంధ్ర ప్రజల్లో కాదు.

చిదంబరం తన ప్రకటనలో 'తెలంగాణ ఏర్పాటు విషయంలో కేంద్రం కేవలం ఒక సంధాన కర్తగా మాత్రమే వ్యవహరిస్తుంది' అన్నారు. ఇది నిజంగా బాధ్యతారహితమైన ప్రకటన. నూతన రాష్ట్రాల ఏర్పాటు విషయంలో కేంద్రం ఒక సంధానకర్తగా మాత్రమే వ్యవహరించి ఉంటే నేడు దేశంలో 28 రాష్ట్రాలు ఉండేవికావు. 1956లో రాష్ట్రాల పునర్విభజన జరిగిన తర్వాత దేశంలో 14 కొత్త రాష్ట్రాలు ఏర్పడ్డాయి. ఇప్పుడు వాటి సంఖ్య 28కి చేరింది. ఇవన్నీ ఏర్పడ్డది కేంద్ర ప్రభుత్వ చొరవతోనే అన్నది నిజం. నూతన రాష్ట్రాల ఏర్పాటు విషయంలో కేంద్రానిది నిజంగా సంధానకర్త పాత్రే అయితే 'ఎన్డిఏ' హయాంలో ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, జార్ఖండ్ రాష్ట్రాలు ఏర్పడి ఉండేవి కావు. బీహార్ రాష్ట్ర శాసనసభ రెండు సార్లు జార్ఖండ్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ తీర్మానం చేసింది. అయినప్పటికీ కేంద్రం చొరవతో జార్ఖండ్ రాష్ట్రం ఏర్పడింది. దీంతో నూతన రాష్ట్రాల ఏర్పాటు విషయంలో కేంద్రానిది సంధానకర్త పాత్ర కాదు అంతిమ నిర్ణయమని తేటతెల్లమయింది.

చిదంబరం తెలంగాణ అంశంపై ఏమంటున్నారో ఓసారి చూద్దాం. 'తెలంగాణ అంశంపై ఆంధ్రప్రదేశ్ ప్రజలు రెండుగా చీలిపోయారు, రెండు ప్రధాన రాజకీయ పార్టీల్లో విభజన వచ్చింది. రాష్ట్రంలో ఇంకా నాలుగు పార్టీలు తెలంగాణ అంశంపై ఏ నిర్ణయం తీసుకోలేదు.' అని అంటున్నారు. మన రాష్ట్రంలో బీజేపీ, టీఆర్ఎస్, సీపీఐ పార్టీలు తెలంగాణ ఏర్పాటుకు సానుకూలంగా ఉన్నాయి. సీపీఎం రాష్ట్ర విభజనను వ్యతిరేకిస్తున్నది. తెలంగాణ అంశంపట్ల ఇంకా ఏనిర్ణయం తీసుకోని రాజకీయ పార్టీలు చిదంబరం దృష్టిలో వైఎస్ఆర్ కాంగ్రెస్, ఎంఐఎం, టీడీపీ, కాంగ్రెస్‌లు. ఈ మధ్యకాలంలోనే పురుడుపోసుకున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ గురించి పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదు. ఇక ఎంఐఎం విషయానికి వస్తే ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, టీడీపీ పార్టీలు తీసుకునే నిర్ణయం ఆధారంగా తాము ఓ నిర్ణయం తీసుకుంటామని ప్రకటించింది. అంటే తెలంగాణ విషయంలో ఓ నిర్ణయం తీసుకుంటామని ప్రకటించింది. అంటే తెలంగాణ విషయంలో ఓ నిర్ణయం తీసుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్, టిడీపీల పైననే ఉందన్నమాట. అంతేగాక అప్పటి ముఖ్యమంత్రి రోశయ్య అధ్యక్షతన 7 డిసెంబర్, 2009న రాష్ట్ర శాసనసభ బిజినెస్ అడ్వయిజరీ కమిటీ సమావేశం జరిగింది. తర్వాత అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ రెండు సమావేశాల్లోనూ తెలుగుదేశం పార్టీతో సహా అన్ని పార్టీలు తెలంగాణ ఏర్పాటుపై తమ అభిప్రాయాలను వెల్లడించాయి. వాటి ఆధారంగానే చిదంబరం డిసెంబరు 9 ప్రకటన వెలువడింది. రాజకీయ పార్టీలుగా కాంగ్రెస్, టీడీపీలు వివిధ సందర్భాలలో తెలంగాణ అంశం పట్ల తమ పార్టీల వైఖరులను వెల్లడించాయి. దాన్ని ప్రామాణికంగా తీసుకోవాలి గానీ, ప్రాంతాలవారీగా ప్రజా ప్రతినిధులు, ప్రజలు చీలిపోయినదాన్ని కాదు.

లోక్‌సభ చర్చలో తెలంగాణ ప్రజలకు చిదంబరం ఇచ్చిన సమాధానం నిరాశకు గురిచేసింది. అదే పాత పాట. తెలంగాణ కోసం యాదిరెడ్డి అనే యువకుడు దేశ రాజధాని ఢిల్లీలోని పార్లమెంటు సమీపంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దాని తర్వాత కూడా కేంద్ర ప్రభుత్వంలో కదలిక రాలేదు. పైపెచ్చు, అతని ఆత్మ త్యాగాన్నే కొందరు శంకించడం క్షమించరాని విషయం. ఈ ఆత్మ బలిదానాలన్నీ చిదంబరం డిసెంబర్ 9 ప్రకటన తర్వాతనే జరిగాయి. తెలంగాణ పై ఇప్పటివరకు చేసిన భిన్న ప్రకటనలతో తెలంగాణ ప్రజలు నిరాశ నిస్పృహలకు గురై ఆత్మహత్యలకు

పాల్పడుతున్నారు. వీటన్నింటికి కారకుడు చిదంబరం. ఆత్మ బలిదానాలకు పాల్పడ్డ యువకుల ఆత్మలు ఘోషిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర ప్రక్రియను ప్రారంభించమని డిమాండ్ చేస్తున్నాయి. ఇప్పటికైనా కేంద్రం కండ్లు తెరిచి నాలుగున్నర కోట్ల ప్రజల మనోభావాలకు అనుగుణంగా రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభిస్తుందని ఆశిద్దాం. ■

***– ప్రొ. జి.లక్ష్మణ్, ప్రొ. బి. సత్యనారాయణ,***
***ప్రొ. ఎస్. మల్లేష్, ప్రొ. విష్ణువర్ధన్‌రెడ్డి,***
***ప్రొ.ఎం. వెంకటేశ్వరరావు, ప్రొ. ఎ. కరుణాకర్***

20.08.2011, నమస్తే తెలంగాణ

---

# తెలంగాణ రిసోర్స్ సెంటర్

తెలంగాణ రిసోర్స్ సెంటర్ తెలంగాణ ప్రజల చరిత్రను, సంస్కృతిని, జీవన విధానాన్ని తెలంగాణ ప్రజలకు, ముందు తరాలకు అందించేటటువంటి ప్రయత్నం చేయాలనే నిర్ణయాన్ని తీసుకుంది. తెలంగాణ వనరులు, పరిశ్రమలు, పనిముట్లు మొ॥వాటి గురించి వివిధ రూపాలలో (ప్రింట్, వీడియో మరియు ఆడియోల ద్వారా) ప్రజల ముందుకు తీసుకువస్తుంది. అందులో భాగంగా మొదట ఒక లైబ్రరీని ఏర్పాటు చేసుకుంది. ప్రచురణ రూపంలో వివిధ అంశాలపైన పుస్తకాలను ప్రచురించడం ప్రారంభించింది.

**లక్ష్యాలు ఉద్దేశాలు :**

దక్కన్ ప్రాంత చరిత్రను సేకరించి తెలంగాణ ప్రజలకు, భావి తరాలకు అందిస్తుంది.

తెలంగాణ ప్రాంతాన్ని గుండెల్లో పెట్టుకొని టిఆర్‌సి పనిచేస్తుంది.

టిఆర్‌సి, తెలంగాణ ప్రాంత ప్రజల పక్షాన నిలచి ఈ ప్రాంతానికి సంబంధించిన మానవుడు, జీవరాశులు, ప్రాంత సంపద, జీవన విధానం, జీవన వైరుధ్యాలు, జీవన విధానంలో ముఖ్యంగా సంస్కృతి, ఇక్కడి కళలు, వృత్తులకు సంబంధించిన విషయాలను, పరికరాలు, పనిముట్ల సమాచారాన్ని నేటి తరానికి అందించే ప్రయత్నం చేస్తుంది.

రచయితలు, కళాకారులు, వృత్తి కులాల వారసులు, జీవించి ఉన్న వృద్ధులు, మొదలైనవారి ఆలోచనలు, అభిప్రాయాలు, వారి త్యాగాలు.... అన్నింటిని ఎంతో కొంత ప్రచురించే పని చేస్తుంది. (ప్రింట్ మరియు ఆడియో, వీడియో ద్వారా).

చరిత్ర పోరాటాలు, ఉద్యమాలు, ఆదివాసి గిరిజన సంస్కృతి, పూర్వం కుల వ్యవస్థలు, కట్టు–బొట్టు, ఇప్పటి వరకు వచ్చిన సాహిత్యాలను భద్రపరచడం, వాటి వివరాలను సేకరించడం టిఆర్‌సి బాధ్యతగా తీసుకుంటుంది.

ప్రస్తుత ఉద్యమ బాధ్యతగా... నిజా నిజాలను ప్రజల ముందుకు తీసుకెళ్తుంది.

ఉద్యమంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొంటూ, ఉద్యమం ముందుకు తీసుకెళ్ళి భావ ప్రచారం, పరిశోధన సాగించే దిశలో సెమినార్‌లు, కాన్ఫరెన్స్‌లు, వర్క్‌షాప్‌లు ఏర్పాటు చేస్తుంది.

టి.ఆర్.సి.ని అన్ని వర్గాల వారికి దేశ విదేశీయులకు అందరికి అందుబాటులో ఉంచుతుంది.

ఈ ప్రాంతానికి సంబంధించిన పరిశ్రమలు, సంస్కృతి, కళలు, వనరులు, జీవన విధానం, ఉద్యమ తీరుతెన్నులు, ఉద్యమ భవిష్యత్తు దృష్ట్యా ఉద్యమ అవసరాల దృష్ట్యా ఈ ప్రాంత శైలిలో ఇమిడే పద్ధతిలో వసతులను ఏర్పాటు చేస్తుంది.

టిఆర్‌సి తెలంగాణ పుస్తక గ్రంథాలయం ఏర్పాటు చేసింది.

పుస్తకాలు ఎవరివద్ద ఉన్నా– కరపత్రం కావచ్చు, పాటల సి.డి. కావచ్చు, ఓ కవిత కావొచ్చు, ఒక నినాదం కావొచ్చు.... తెలంగాణ ప్రజలకు అందించే క్రమంలో మీ దగ్గర ఉన్న ప్రతిదీ టి.ఆర్.సి.కి అందేటట్లు చూడాలని కోరుతుంది.

**మా లక్ష్యాలకు, ఉద్దేశ్యాలకు దగ్గరగా ఉన్నవారితో మరింత దగ్గరగా పనిచేస్తుంది.**
**(వాళ్ళతో కలిసి పనిచేయడం, వాళ్ళకు సహకరించడం, సహకారం పొందడం)**

# పెనం వేడయ్యేదాకా వంట 'చెరుకు'ను కాపాడాలి!!

– ప్రొ. ఘంటా చక్రపాణి

దాదాపు ఆరు నెలల క్రితం 'టీ న్యూస్' ఛానల్ లో ఉద్యమ తీరుతెన్నుల మీద ఒక చర్చ జరిగింది. నాతోపాటు ఆ చర్చలో తెలంగాణ రాష్ట్ర సమితి ఫైర్ బ్రాండ్‌లలో ఒకరైన దాసోజు శ్రావణ్ ఉన్నారు. అది ఉద్యోగులు సహాయ నిరాకరణ చేస్తోన్న సందర్భం. సహాయ నిరాకరణ పట్ల రాజకీయ నాయకులు అంటీముట్టనట్టు ఉంటున్నారని, ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర సమితి ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్ళడానికి మల్లగుల్లాలు పడుతోందని నేనన్నాను. నా విమర్శను తిప్పికొడుతూ శ్రావణ్ ఇంకా 'తవా గరం కాలేదని' అన్నాడు. అంటే పెనం వేడికాలేదని అర్థం రొట్టెలు వేయాలంటే పెనం వేడెక్కాలని, ఆ వేడి పెంచడం కోసమే సహాయ నిరాకరణ అని ఆయన వివరణ కూడా ఇచ్చినట్టు గుర్తు. తెలంగాణ కొలిమి రెండేళ్ళుగా నిరంరతాయంగా మండుతూనే ఉంది. నిరాహార దీక్షతో కేసీఆర్ రాజేసిన ఆ మంట ఆరిపోకుండా ఉండడానికి ఇప్పటికి ఏడువందలకు పైగా యవకులు సమిధలైపోయారు. ఉద్యమం ఆరిపోతుందేమోనన్న అనుమానం వచ్చినప్పుడల్లా విద్యార్థులు, న్యాయవాదులు, డాక్టర్లు ఒక్కరేమిటి తెలంగాణ పౌర సమాజమంతా ఒక్కటై ఊపిరూదుతూ వస్తోన్నారు. ఇక సకల జనుల సమ్మె ఆ మంటను దావానలం చేసింది. తెలంగాణ అంతా మన ఉద్యోగులు, కార్మికుల పుణ్యమా అని నలభై మూడు రోజులపాటు అగ్గిమండింది. ఆ మంటలో రొట్టెలే కాదు గుట్టలైనా కాల్చిపారేయవచ్చని అనుకున్నాం కానీ అందరి అంచనాలు, ఆకాంక్షలు తలకిందులయ్యే రీతిలో ఆ మంట మీద కొందరు నీళ్ళు చల్లారు. ఆ మంటకు భయపడి తెలంగాణ వ్యతిరేకులంతా రాజీనామాలు చేసేసి సంక్షోభం సృష్టిస్తే ఢిల్లీ దయ్యాలు దిగి వస్తాయనీ అనుకున్నాం కానీ ఇదేదీ జరగలేదు. ఒకరిద్దరు పార్టీలు మారడం మినహా వారి వైఖరిలో ఏ మార్పూ రాలేదు. విచిత్రంగా వేడి పుట్టించాల్సిన మంట ఇప్పుడు తెలంగాణ ఎంపీలకుపార్లమెంటు శీతాకాల సమావేశాల్లో చలికాచుకోవడానికి పనికొస్తోంది. అలాగే ఆ వెచ్చదనం కొందరికి పాదయాత్రలకు ఉపయోగపడుతోంది. ఇంకొంత మంది మంట ఎలాగూ ఆరిపోతోంది కాబట్టి ఆ బొగ్గులను అమ్ముకుని పబ్బం గడపాలని చూస్తున్నారు. ఇవన్నీ మన ప్రధాన మంత్రికి బాగా తెలుసు. అందుకే మంట ఉన్నప్పుడు ఒక్క మాటకూడా మాట్లాడని ఆయన ఇప్పుడు మళ్ళీ పెనం ప్రస్తావన తెచ్చారు. మంటల్లో ఎవరు మాడి పోయినా ఫరవాలేదు గానీ పెనం మీది రొట్టెలు ఎవరికి దక్కాలో ఆయన ఇప్పుడు లెక్కలు వేస్తున్నారు. అందుకే ఆయన 'పెనం లోంచి పొయ్యిలో పడలేము కదా!' అంటున్నారు. అయినా తెలంగాణ మౌనంగానే ఉంది. అదే మంటలో ఒకరోజు ప్రధాని బొమ్మల్ని కాల్చేసి నిరసన తెలిపిందే తప్ప వారికి ఇబ్బంది కలిగించే ఏ పనీ చేయలేదు.

ఇదంతా ఎందుకు చెప్పుకోవాల్సి వస్తున్నదంటే టీ న్యూస్ ఛానల్‌లో గతవారం జరిగిన చర్చ సందర్భంగా గౌస్ అనే ఒక సాధారణ పౌరుడు ఫోన్ చేసి ఆవేదనతో ఆరునెలల క్రితం దాసోజు శ్రావణ్ ప్రస్తావించిన పెనం సంగతి గుర్తు చేశాడు. టెలివిజన్ ఛానళ్ళు చర్చలు తెలంగాణ ప్రజలకు చాలా విషయాలు అర్థం చేయిస్తున్నాయి. ముఖ్యంగా టీ న్యూస్ తెలంగాణ ఉద్యమంలో ఒక అద్భుత భూమికను పోషిస్తోంది. టీ న్యూస్ చర్చలను చాలామంది తెలంగాణ పల్లెల్లో చూడడమే కాదు ఫాలో అవుతున్నారు. ఆ ఛానల్‌కు ఫోన్ చేసి కొన్ని వందలమంది చర్చలో

పాల్గొంటున్నారు. ఎలా అడగాలో తెలియకపోయినా వారి ప్రశ్నల్లో భావాలను బలంగా వ్యక్తం చేస్తున్నారు. గౌస్ అడిగింది కూడా అదే. 'ఆరు నెలల క్రితం పెనం ఇంకా వేడికాలేదు అన్నారు. మరి ఇంకా వేడెక్కలేదా'? అని. నిజమే ఆకలి దహిస్తున్నప్పుడు ఎవరైనా పెనం వైపే చూస్తారు. పెనం వేడెక్కితే దశాబ్దాలుగా ఎదురుచూస్తోన్న రొట్టెముక్క నేడో రేపో దొరుకుతుందన్న ఆశతో తెలంగాణలో ప్రతి ఒక్కరూ ఉన్నారు. అందుకోసం తమ విలువైన సమయాన్ని, జీతాలను, జీవితాలను వంట చెరుకుగా చేసి మంటను రగిలిస్తూనే ఉన్నారు. కానీ రాజకీయ పార్టీలు, నాయకులు మాత్రం ఆ మంటతో చుట్టలు వెలిగించుకుంటున్నారు. ఆ కిక్కు 2014దాకా కొనసాగాలన్న కోరిక వాళ్ళది.

ఎందుకోగానీ తెలంగాణ ఉద్యమంలో నిస్సత్తువ కనిపిస్తోంది. ఉన్నట్టుండి ఉద్యమ నాయకులు చాలా సహనపరులైపోయారు. ఎంత సహనం అంటే రాజ్యం ఏలుతున్న వాళ్ళు ఉద్యమ మూలాలను నరికేస్తున్నా చలించడం లేదు. స్పందించడం లేదు. నల్లగొండ జిల్లా నకిరేకల్లుకు చెందిన డాక్టర్ చెరుకు సుధాకర్ సంగతే తీసుకోండి. ఆయన ప్రజల్లో పేరు ప్రతిష్టలున్న పెద్దమనిషి. అంతే కాదు టీఆర్ఎస్‌లో పెద్ద నాయకుడు. పార్టీ రాజకీయ వ్యవహారాలు నిర్ణయించే పొలిట్‌బ్యూరోలో సభ్యుడు. ఆయనను పోలీసులు అరెస్టు చేసి రెండు వారాలుగా నానా తిప్పలు పెడుతున్నారు. మొదట నేరాలే వృత్తిగా పెట్టుకుని అలజడులు సృష్టించే సంఘ విద్రోహక శక్తులమీద పెట్టె పీడి యాక్టు పెడుతున్నట్టు చెప్పారు. ఆ వెంటనే ఆయనను దేశద్రోహుల మీద, దేశ భద్రతకు ముప్పుగా మారిన వాళ్ళమీద పెట్టే 'నాసా' అనే చట్టం పెట్టి 'బెయిలు'కు కూడా నోచుకోకుండా వరంగల్ సెంట్రల్ జైలులో తోసేశారు. చెరుకు సుధాకర్ జనమెరిగిన డాక్టర్. వెనుకబడిన కులాల నుంచి ఎదిగిన చెరుకు సుధాకర్‌కు తెలంగాణ పట్ల, తెలంగాణ పీడిత వర్గాల పట్ల లోతైన అవగాహన ఉంది. తెలంగాణ పీడిత వర్గాల విముక్తి తెలంగాణ విముక్తితోనే సాధ్యమన్న స్పష్టతా ఉంది.

తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భావం నుంచీ టీఆర్ఎస్‌లో ఉన్నాడు. అంచెలంచెలుగా ఆ పార్టీ కీలక నేతల్లో ఒకరిగా ఎదిగారు. సకల జనుల సమ్మెలో భాగంగా ఆర్టీసీ కార్మికులు కూడా సమ్మె చేస్తున్నప్పుడు నల్లగొండ జిల్లా జాతీయ రహదారి మీద విజయవాడ, హైదరాబాద్‌ల మధ్య నడుస్తోన్న ప్రైవేటు బస్సులను ప్రజలు అడ్డుకున్నారు. కొన్ని బస్సుల అద్దాలు పగులగొట్టారు. అయితే ఏ ఒక్కరికి గాయాలు గానీ, హాని గానీ జరుగలేదు. నిజానికి సర్కారుకు సకల జనుల సెగ తగిలింది ఆరోజే. అప్పటిదాకా మౌనంగా ఉన్న ప్రభుత్వం మొదటిసారిగా మాట్లాడింది. ఈ అన్నిటికీ బాధ్యుడిగా డాక్టర్ చెరుకు సుధాకర్‌ను అరెస్టు చేశారు. అక్కడి వరకు ఫరవాలేదు. అతనలా చేసి ఉంటే కోర్టు విచారించి అతనికి తగిన శిక్ష వేయవచ్చు. కానీ అక్కడే అసలు కుట్ర మొదలయ్యింది. అరెస్ట్ చేసిన కొన్ని రోజులకు పోలీసులకు శ్రీకృష్ణ కమిటీ ఎనిమిదో చాప్టర్ గుర్తొచ్చింది. ఉద్యమానికి పునాదిగా ఉన్న ఇటువంటివారిని ఊరికే వదలకూడదనుకున్నారేమో వెంటనే ఆయనపై నిందారోపణలు మొదలుపెట్టారు. అతనొక హింసోన్మాది అని, నక్సలైట్‌లతో సంబంధాలు ఉన్నాయని, తెలంగాణ పేరుతో అమాయక ప్రజలను రెచ్చగొట్టాడని పోలీసులు నేరారోపణ చేశారు. ఈ వార్తలు చదివినప్పుడు నేను ఈ పాపం ఊరికే పోదు అనుకున్నాను. ఇప్పటికే మండిపోతోన్న ఉద్యమకారుల మీద తప్పుడు కేసులు పెట్టడం కొరివితో తల గోక్కోవడమే అనుకున్నాను. నల్లగొండ జిల్లా భగ్గుమంటుందనీ అనుకున్నాను. కానీ అదేమీ జరుగలేదు. కనీసం ఒక్కరోజు బంద్‌రో, రాస్తారోకోనో కూడా జరుగలేదు. అందరూ కలిసి పనిచేసిన ఉద్యమంలో అరెస్టయిన ఒక ప్రధాన పార్టీ నేత అరెస్టుపట్ల జేఏసీ కూడా పెద్దగా స్పందించలేదు. అలాంటి అరెస్టుల పైన, నల్ల చట్టాలు ఉపయోగించడంపైన తమ కార్యాచరణ ఏమిటో కోదండరాం ప్రకటించలేదు. ఆ మరుసటి రోజే అక్కడికి వెళ్ళిన బీజేపీ నాయకురాలు సుష్మా స్వరాజ్ మాటవరసకైనా ఆ సంఘటనను తన ప్రసంగంలో ప్రస్తావించలేదు.

ఇవన్నీ ఒక ఎత్తయితే టీఆర్ఎస్, కేసీఆర్ కూడా సరైన రీతిలో స్పందించలేదన్న విమర్శలు వస్తున్నాయి. కేసీఆర్ తనకు అత్యంత ఆత్మీయుడైన తన సహచరుడు అరెస్ట్ అయి, జైలులో ఉంటే స్పందించకుండా ఉంటాడని నేననుకోను. కానీ ఆ పార్టీ వ్యవహారశైలి వల్ల బహుశా కొందరికి అటువంటి భావన కలుగవచ్చు. ఒక ఉద్యమం మీద ప్రభుత్వం ఉక్కు పాదం మోపినప్పుడు, అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నప్పుడు, నల్ల చట్టాలను ప్రయోగిస్తున్నప్పుడు

కేవలం బెయిల్ కోసం ప్రయత్నించడం, జైలు నుంచి ఆస్పత్రికో ఇంటికో తీసుకొచ్చే ప్రయత్నం చేయడమే కాదుకదా రాజకీయ పార్టీలు చేయాల్సింది. ఖచ్చితంగా ఆ చర్యలను ఖండించి, అటువంటి చట్టాలను ఎదిరించే దిశగా పోరాటాన్ని మలచాల్సింది. మళ్లీ ఇంకొకరిమీద అలాంటి నేరారోపణలు చేయకుండా ఇదొక రాజకీయ ఉద్యమమన్న స్పృహ పాలకులకు కలిగించాల్సింది. అటువంటి ప్రయత్నమేదీ జరుగకపోవడం ఇప్పుడు టీఆర్ఎస్‌మీద విమర్శలకు కారణం అవుతోంది. తెలంగాణ ఉద్యమంలో ముందు వరసలో ఉన్న టీఆర్ఎస్ మీద చాలా మంది దృష్టి ఉంది. ఇది సహజం. ఇందులో టీఆర్ఎస్ తప్పులు చేయకూడదని కోరుకునే వాళ్ళు కూడా ఉంటారు.

ఇప్పుడు టీఆర్ఎస్ ఏది చేసినా ఏమీ చేయకపోయినా ఆ చర్యలను కులం కోణంలో చూసే దశ మొదలయ్యింది. ఇప్పుడున్న సామాజిక చైతన్యంలో అది సహజంగానే ప్రధాన అంశం. రైల్ రోకో సందర్భంగా బీసీ, ఎస్సీ ఎంపీలు, ఎమ్మెల్యేల మీదే కేసులు పెట్టారని అన్నవాళ్ళు ఉన్నారు. నాకు తెలిసి కవిత, కేటీఆర్‌ల మీద కూడా కేసులు పెట్టారు. మొన్న మొన్నటివరకు మంత్రి పదవిలో ఉన్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్యే పదవి కూడా వదులుకుని ఒక కాంగ్రెస్ నాయకుడిగా ఆమరణ నిరాహార దీక్షకు దిగితె ఆ పార్టీ గానీ, ప్రభుత్వం గానీ పట్టించుకోలేదు. కనీసం కాంగ్రెస్ తెలంగాణ ఫోరం కన్వీనర్‌గా ఉన్న జానారెడ్డితో సహా ఆ జిల్లా శాసన సభ్యులెవరూ ఆయన శిబిరంవైపు తొంగి చూడలేదు. అలాగే ఉద్యమ ఆవేశంలో డీఎస్పీ నళిని తన ఉద్యోగం వదులుకుంది. ఆమె నిరుపేద కుటుంబం నుంచి వచ్చింది. గతంలో కేసీఆర్ నిరాహారదీక్ష సందర్భంగా ఉద్యోగానికి లోనై రాజీనామా చేసి ఉద్యమంలోకి వచ్చింది. కేసీఆర్, హోంమంత్రి సబితా ఇంద్రారెడ్డితో సహా అప్పుడు ఆమెను మళ్ళీ ఉద్యోగంలో చేరిన నాటి నుంచి పోలీసు అధికారులు తనకు నరకం చూపిస్తున్నార'ని ఆమె పదే పదే వాపోయింది. అవకాశం చిక్కినప్పుడల్లా ఇంద్రారెడ్డిని గుర్తు చేసి తనూ తెలంగాణ ఆడబిడ్డనే అని చెప్పే హోం మంత్రికి కూడా మొరపెట్టుకుంది. ఉద్యమం కూడా ఆమెకు ధైర్యాన్ని ఇవ్వలేకపోయింది. చివరకు ఆమెను సస్పెండ్ చేసినా ఎవ్వరూ పెద్దగా పట్టించుకోలేని స్థితి మన ఉద్యమానిది. పార్టీల్లో ఉన్నవాళ్ళే కాదు, బయట ఉండి ఉద్యమానికి బాసటగా నిలబడ్డ వాళ్ళు తెలంగాణ వాదులుగా ముందుకొచ్చిన అనేక మంది సామాన్యులు ఇవాళ పరిస్థితులు చూసి కలవర పడుతున్నారు. కొందరు పెద్దలు ఇది మంచి పరిణామం కాదని చెపుతున్నారు. అలా వేలెత్తి చూపేవాళ్ళను తప్పు పట్టలేం. విమర్శల కోసం కాదుగానీ ఒక రాజకీయ పార్టీగా అందునా ఉద్యమ కీలక దశలో అంతటి ఉదాసీనత టీఆర్ఎస్‌కు పనికిరాదని, అది ఒక్క టీఆర్ఎస్‌కే కాదు, మొత్తంగా ఉద్యమానికే మంచిది కాదని నేను కూడా భావిస్తాను. చెరుకు సుధాకర్ ఒక్కడే కాదు అట్లా ఉద్యమానికి ముడి సరుకుగా మారిపోయిన వాళ్ళు ఎంతోమంది ఉన్నారు. వారిలో ఆత్మస్థయిర్యం నింపడానికి, మిగిలినవారి ధైర్యం చెడకుండా ఉండడానికైనా నిర్బంధానికి వ్యతిరేకంగా నిలబడి పోరాడాల్సింది.


ఇపుడు ఎవరైనా వేలెత్తి చూపుతున్నది కూడా ఆ ఉద్దేశ్యంతోనే. పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులకు, ఎంపీలకు, ఎమ్మెల్యేలకే రక్షణ లేని స్థితి ఇవాళ తెలంగాణలో ఉన్నదనడానికి ఇంతకంటే వేరే సాక్ష్యాలెందుకు? ఈ నిర్బంధ పరిస్థితిని ఇప్పుడు ఎదిరించకపోతే, ప్రభుత్వం ఒక్కొక్కరిని ఏరి మరీ బోనులో బంధించే అవకాశం ఉంటుంది. అది మొత్తంగా ఉద్యమానికే ముప్పు అని గుర్తించాలి. సకల జనుల సమ్మె పోరుతో .... ఎంత నిప్పులు చెరిగినా పొయ్యి వెలగలేదు. రొట్టెముక్క చేతికందలేదు. కనీసం వంట 'చెరుకు'నైనా రేపటి కోసం కాపాడుకోకపోతే ఎట్లా అన్నదే ఎవరి ఆవేదనైనా. ఈ విషయంలో అందరికంటే ఎక్కువ బాధ్యత టీఆర్ఎస్ మీదే ఉంటుంది.


తెలంగాణ ఉద్యమ నాయకులు, వేదికలు, ప్రజా సంఘాలు, అన్ని జేఏసీలు మారుతోన్న పరిణామాలను గమనించి అయినా పరస్పర నిందలు మానుకుని ఆత్మ విమర్శ చేసుకోగలిగితే ఉద్యమాన్ని కాపాడుకోగలుగుతాం. ■


**– ప్రొ. ఘంటా చక్రపాణి**
సమాజ శాస్త్ర ఆచార్యులు, రాజకీయ విశ్లేషకులు
ఈమెయిల్: ghantapatham@gmail.com


18.11.2011, నమస్తే తెలంగాణ


# తెలంగాణ రిసోర్స్ సెంటర్ 2011లో ప్రచురించిన సంకలనాలు


















FST FORUM

FORUM FOR SUSTAINABLE TELANGANA

"CHANDRAM" 490, 11th Street, Himayathnagar, Hyderabad - 29.

తెలంగాణలోని సహజ వనరులు, పరిశ్రమలు, గ్రామాలు, పట్టణాలు, పర్యావరణం, వ్యవసాయం, ఉపాధి, నదులు, చెరువులు, అడవులు, నీరు, భూమి హక్కులు, భూ వినియోగములను సుస్థిర పరుచుకోవడం బాధ్యతగా తీసుకుని ఫోరమ్ ఫర్ సస్టెయినబుల్ తెలంగాణ పర్యావరణ సంఘాలు, వ్యక్తులతో కలిసి పనిచేస్తుంది.

భిన్న రంగాలకు చెందిన సమస్త వృత్తుల వాళ్ళు, విద్యార్థులు, రైతులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఆటోలు నడుపుకునే వాళ్ళతో సహా ..... ఒక్కరు కాదు ప్రతిరంగం ఉద్యమానికి స్పందించింది. తన స్థాయిలో పాల్గొన్నది. సింగరేణి కార్మికుల్లో వ్యక్తమయిన ఐక్యత సాధారణమైన సంఘటన కాదు. అలాగే గ్రామ గ్రామంలో నిరసన, ఉద్యమాలు జరిగాయి. ఉద్యమ రూపాలలోని వైవిధ్యంలో ప్రజల సృజనాత్మకత కనిపించింది. అంటే ఉద్యమాలకు నిర్దిష్టమైన గమ్యాలు ఉండడమే కాదు, వాటికి ఒక గమనం కూడా ఉంటుంది. ఆ గమనాన్ని గమనిస్తే సకల జనుల సమ్మె ఒక గొప్ప సామాజిక అనుభవమే. అయితే సమ్మె విఫలమైందన్న నిరాశకు గురికాకుండా సమ్మె సృష్టించిన చైతన్యాన్ని మరలా ఉన్నత శిఖరాలకు తీసుకుపోయేలా ఉద్యమకారులు కృషి చేయడమే నిజమైన సామాజిక అభివృద్ధికి దోహదపడుతుంది.

**– ప్రొ. హరగోపాల్**







*తెలంగాణ సాధనకై ఢిల్లీలో బాపూజీ దీక్ష శిబిరం వద్ద సంఘీభావం తెలుపుతున్న గద్దర్, వేదకుమార్ తదితరులు. తేది : 3-11-2011*

TELANGANA RESOURCE CENTRE
"CHANDRAM", 490, St. No. 11, Himayatnagar, Hyderabad-500 029.
trchyd@gmail.com; Mobile : 9959922022
www.telanganaresourcecentre.org